ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 26.09.2026 | సంపుటి : 13 సంచిక : 67 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# సీఈసీ.. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చెయ్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ఆయన్ను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎంపిక చేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ ఆయన్ను మోదీ, షా కాపాడుతున్నారు. 2024 ఎన్నికలకు ముందు సీఈసీపై చట్ట ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయి. ఈ క్రమంలో ఓట్ చోరీ చివరకు చట్టం చోరీగా మారుతోంది - రాహుల్

## దేశవ్యాప్తంగా మిన్నంటిన కాంగ్రెస్ ఆందోళనలు

### పలుచోట్ల జలఫిరంగుల ప్రయోగం




న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా శుక్రవారం నిరసనలు చేపట్టింది. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా, ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, సీఈసీ పదవి నుంచి ఆయనను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది. జమ్మూకశ్మీర్, అసోం, ఉత్తరాఖండ్, బంగాల్, ఉత్తరప్రదేశ్, చండీగఢ్, మణిపూర్ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీ చేస్తూ సీఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు."ఓటు చోరీ చేస్తూ ఎన్నికల సంఘం బీజేపీ ప్రభుత్వాలను అధికారంలోకి తెస్తోంది. రాహుల్ గాంధీ ఈ విషయాన్ని గత మూడేళ్లుగా చెబుతూ వస్తున్నారు. ఈ రోజు అది వాస్తవమని రుజువైంది. రాహుల్ దృఢ సంకల్పానికి నేను సెల్యూట్ చేస్తున్నాను. ఇది దేశానికి ఎంతో మేలు చేస్తుంది. మాకు నిష్పక్షపాతమైన, స్వచ్ఛమైన ఎన్నికలు కావాలి" అని ఉత్తరాఖండ్ పీసీసీ అధ్యక్షుడు గణేశ్ గోడియాల్ అన్నారు. యూపీలోని లఖ్‌నవూలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. హజ్రత్‌గంజ్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయాన్ని ముట్టడించేందుకు వారు ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. మణిపుర్‌లో కాంగ్రెస్ నేతలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి, విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ మిగతా 2లో..

## జెన్‌జీకి ఓటు హక్కును లాక్కొనేందుకు మోదీ కుట్ర

- యువత ఆశలను, ఆకాంక్షలను దెబ్బతీస్తున్నారు
- వారిని ఓటరు జాబితాలో లేకుండా చేసేందుకు పన్నాగం
- కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్
- మోదీ, షా, జ్ఞానేశ్ దేశద్రోహులు
- సార్వత్రిక ఎన్నికల తరువాత అసెంబ్లీ ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయి: రాహుల్

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎస్ఐఆర్ ప్రక్రియపై వివాదం నెలకొన్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఒక ప్రధాని (రాజీవ్ గాంధీని ఉద్దేశించి) జెన్‌జీకి ఓటు హక్కు ఇచ్చారని, మరొకరు (మోదీ) దానిని లాక్కోవాలని చూస్తున్నారని మండిపడింది. యువత ఆశలను, ఆకాంక్షలను దెబ్బతీసి వారికి భయపడే ప్రధాని నరేంద్ర మోదీ అని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం మిగతా 2లో..



# సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

## ఆర్యదాన్ మొహమ్మద్ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు ప్రదానం

- రాజ్యాంగ పరిరక్షణకు లౌకికవాదులు అందరూ కలిసి రావాలి
- దేశంలో మతతత్వ శక్తులను అడ్డుకోవడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు ఇచ్చే నివాళి
- రైతులు, బీసీలు, సామాన్యుల సంక్షేమానికి గుర్తింపు
- ఈ ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం గౌరవంగా ఉంది
- దేశ రాజకీయాల్లో మార్పు కేరళ నుంచే షురూ అవుతుంది
- ఆ మార్పే దేశమంతా తుపానుగా మారాలి
- రాహుల్ గాంధీ నాయకత్వంపై విశ్వాసం
- సంఘ్ పరివార్ దేశాన్ని విభజిస్తోంది...
- గాంధీ పరివార్ భారత ఐక్యతకు కృషి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తిరువనంతపురం(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేరళలో ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు' లభించింది. కేరళలోని నిలంబూరులో శుక్రవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఆ పురస్కారాన్ని రేవంత్ స్వీకరించారు. కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్... సీఎం రేవంత్‌రెడ్డికి అవార్డును ప్రదానం చేశారు. కేరళ దిగ్గజ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సీఎం రేవంత్ రెడ్డి దూర దృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తిస్తూ సీఎం రేవంత్ రెడ్డిని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పట్ల రేవంత్‌రెడ్డి చూపుతున్న నిబద్ధతను కూడా మిగతా 2లో..



## సీఈసీ నిర్ణయాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలి

### జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'సుప్రీం'లో పిటిషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):'సర్' అంశంపై ఎన్నికల కమిషన్‌లో విభేదాలు ఏర్పాడ్డాయంటూ వచ్చిన వార్తలపై రాజకీయ దుమారం తీవ్రమవుతోంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అభిశంసనకు విపక్షాలు సిద్ధమవుతుండగా.. తాజాగా ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఆయనపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ కోరుతూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ వేశారు.ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా.. జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్‌వేర్ మార్పులన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. సర్‌కు సంబంధించిన నిర్ణయాలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ.. 'ఫామ్-6'ను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సర్ ప్రక్రియ సమయంలో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయని, వాటిపై సిట్‌తో దర్యాప్తు జరిపేలా మిగతా 2లో..

## జ్ఞానేశ్ రాజీనామా చేయకపోతే ప్రతిపక్షాలు ఎన్నికలు బహిష్కరించాలి

### ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుందనేది ముమ్మాటికీ నిజమే..

- విపక్ష పార్టీలకు అభిజీత్ దీప్కే పిలుపు



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంపై ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ప్రతిపక్షాలు భావిస్తే.. ఇకపై ఎన్నికల్లో పోటీ చేయడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరుగుతుందనేది ముమ్మాటికీ నిజమేనని ఆరోపించారు. అయితే, ప్రతిపక్షాలు ఎన్నికల్లో పాల్గొనడంతో.. అవి స్వేచ్ఛగా, పారదర్శకంగా జరుగుతున్నా యనే భావన ప్రజల్లో కలుగుతోందన్నా రు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని పదేపదే ఆరోపిస్తున్నప్పటికీ.. ప్రతిపక్ష పార్టీలు ఎందుకు పోటీ చేస్తున్నాయని ప్రశ్నించారు. "మీరు ఎన్నికల్లో పోటీ చేయకపోతే మీ ఉనికికే ముప్పు వాటిల్లుతుందనే భయంతో పోటీ చేస్తుండొచ్చు. కానీ ఓట్లు దొంగిలిస్తున్నప్పుడు.. మీ ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రలోభపెడు తున్నప్పుడు.. మీ పార్టీలు చీలిపోతున్నప్పుడు.. మీరు ఇంకా ఎలాంటి ఉనికిని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు?. ఆట మోసపూరితమైందని చెబుతున్నప్పుడు.. దానిని కొనసాగించడం తప్పు. ఇప్పటికైనా ఇటువంటి మోసపూరిత ఎన్నికల్లో పోటీ చేయడం ఆపండి. రాజకీయ మనుగడకు కాకుండా.. దేశంలోని ప్రజాస్వామ్య ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వండి' అని అభిజీత్ సూచించారు. మిగతా 2లో..



## ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

### రూ.39లక్షల రికార్డు ధరపలికిన బాలాపూర్ లడ్డూ

హైదరాబాద్(జనంసాక్షి): ఖైరతాబాద్ బడా గణేశుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ ఏడాది 69 అడుగుల 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా గణనాథుడు దర్శనమిచ్చాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో ఖైరతాబాద్ నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. ఆ తర్వాత ఎన్టీఆర్ మార్గ్ వద్దకు చేరుకున్న బడా గణేశుడికి ఉత్సవ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు హుస్సేన్‌సాగర్‌లో భారీ క్రేన్ల సాయంతో నిమజ్జన ప్రక్రియను పూర్తిచేశారు. కాగా ఖైరతాబాద్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు భక్తుల జయజయధ్వానాల నడుమ బడా గణేశుడి మిగతా 2లో..

## 'ఎండీఆర్'లో ప్రభుత్వానికి రూపాయి రాదు

- ఇది ట్యాక్సో, సెస్సో కాదు..
- ఈ రుసుములు వ్యాపారి మాత్రమే భరించాలి
- నిర్మలా సీతారామన్


న్యూఢిల్లీ(జనంసాక్షి): యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ విధింపుపై విపక్షాలు చేస్తున్న విమర్శలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రతిపాదిత రుసుములు కేవలం రూ. 2వేల కన్నా అధికంగా ఉన్న యూపీఐ లావాదేవీలకే వర్తిస్తాయని గుర్తుచేశారు. అలాగని ఇది పన్నో, సెస్సో కాదని, సర్‌ఛార్జీ అంతకంటే కాదని పేర్కొన్నారు. దీంట్లో ఖజానాకు వచ్చేది ఏమీ ఉండదని స్పష్టంచేశారు. డిజిటల్ పేమెంట్స్ ఎకో సిస్టమ్‌లో యూపీఐ సేవలందిస్తున్న పేమెంట్ సర్వీసు ప్రొవైడర్లు, మర్చంట్ బ్యాంకులు, మిగతా 2లో..

## గోదావరిలో వరద పోతుంటే.. బురద రాజకీయాలేనా..!

- వెంటనే మోటార్లు నడిపి జలాశయాలను నింపాలి
- ఎల్‌నినోను కారణంగా చూపి బాధ్యత నుంచి తప్పించుకోవద్దు
- ఎండిన రిజర్వాయర్లకు కాంగ్రెస్ పాలన నిర్లక్ష్యమే కారణం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు లేఖ



హైదరాబాద్(జనంసాక్షి): గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించారు. ఇందులో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్లను ఏర్పాటు చేశారు. గోదావరిలో వరద వచ్చినప్పుడు ఆ నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లను నింపితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు.. మరోవైపు గోదావరిలో భారీ వరద ప్రవాహం మిగతా 2లో..



## అమెరికాతో యుద్ధాన్ని కోరుకోవట్లేదు

- ఉద్రిక్తతలు ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది అమెరికానే..
- కానీ అగ్రరాజ్య ఒత్తిడికి టెహ్రాన్ ఎప్పటికీ లొంగబోదు
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు

న్యూయార్క్(జనంసాక్షి):ఇరాన్- అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. యుద్ధం ఎప్పుడు ముగియాలో నిర్ణయించాల్సింది అమెరికానేనని స్పష్టం చేశారు. యుద్ధాన్ని కొనసాగించాలని తాము కోరుకోవట్లేదన్నారు. దీన్ని ఎలా ముగించాలనే విషయంలో ఇరుపక్షాల మధ్య ఏకాభిప్రాయం లేదని చెప్పారు. అయితే.. అగ్రరాజ్య ఒత్తిడికి టెహ్రాన్ ఎప్పటికీ లొంగబోదన్నారు. తమ దేశంలోని ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి.. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ నాయకులు అశాంతి వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇరాన్‌కు గానీ.. అమెరికాకు గానీ సంఘర్షణలు ప్రయోజనకరం కావని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చివరి నాటికి యుద్ధం ముగుస్తుందా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఓ వైపు అమెరికా-ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతుంటే.. మరోవైపు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై దాడులను ఉద్ధృతం చేస్తున్నారు. తాజాగా మరోసారి హూతీలు రియాద్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నారు. సౌదీలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై డ్రోన్, క్షిపణి దాడులు జరిగినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు హూతీ సైనిక ప్రతినిధి ప్రకటించారు. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు.దక్షిణ తైఫ్ ప్రావిన్స్, ఎర్ర సముద్ర తీరంలోని యాన్బు ప్రాంతాల్లో హూతీలు ప్రయోగించిన మిగతా 2లో..

## మన బ్రహ్మోస్‌తో పాకిస్తాన్‌కు భయంపుచ్చుకుంది

### దాయాది దేశం నిద్రలేని రాత్రులు గడిపింది:అమిత్ షా



నోయిడా(జనంసాక్షి): ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ మిగతా 2లో..



## వంటనూనెపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు

### పండుగ వేళ ధరలపై కేంద్రం కీలక నిర్ణయం

ముంబై(జనంసాక్షి): పండుగ సీజన్ వేళ వంట నూనెల ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లలో పెరిగిన ధరల ప్రభావంతో దేశీయంగా వంట నూనెల ధరలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దిగుమతి చేసుకునే ముడి వంట నూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. సెప్టెంబర్ 24 నుంచి కొత్త మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26.09.2026



# సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక అవార్డు

అవార్డు ఎంపిక కమిటీ ప్రశంసించినట్లు వెల్లడించారు. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని నాలుగు వేర్వేరు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన ఆర్యదాన్ ముహమ్మద్ ప్రజాసేవ, లౌకిక విలువలు, సామాన్యుల సంక్షేమం పట్ల నిబద్ధతతో పనిచేసిన నాయకుడిగా కేరళలో గుర్తింపు పొందారు. ఆయన నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా, ఈ కార్యక్రమంలో కే.సీ. వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఆర్యదాన్ ముహమ్మద్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు సేవలందించిన ఆయన కేరళ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేశారు. నీలాంబూర్‌తో పాటు కేరళలో కాంగ్రెస్ పార్టీకి ఆయన ఒక బలమైన శక్తిగా నిలిచారని అన్నారు. ఆర్యదాన్ ముహమ్మద్ పేరుతో ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం తనకు ఎంతో గౌరవంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. కేరళ వెలుపల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత ప్రత్యేకమని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తగా, రాహుల్‌గాంధీ నాయకత్వంలోని బృందంలో ఒక కార్యకర్తగా తాను ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పారు. కేరళకు రావడం తనకు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలోనూ, కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ ఇక్కడికి వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతిసారీ కేరళ ప్రజలు తనకు ఆత్మీయ స్వాగతం పలికారని చెప్పారు. లౌకికవాదానికి అండగా నిలుస్తూ కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులకు మద్దతు ఇస్తున్న కేరళ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఎండీఆర్ ప్రభుత్వానికి రూపాయి రాదు

అందులోని భాగస్వామ్య పక్షాలకే ఈ మొత్తం చేరుతుందని వెల్లడించారు ."ఇది పన్ను కాదు, సెస్ కాదు, సర్‌ఛార్జ్ కూడా కాదు. ఈ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరదు. మొత్తం ఎండీఆర్‌లో 40 శాతం వినియోగదారులు ఉపయోగించే బ్యాంకులకు, 30 శాతం పేమెంట్ గేట్‌వేకి, 20 శాతం యూపీఐ యాప్‌కి, మిగిలిన 10 శాతం యూపీఐ యాప్ స్పాన్సర్ బ్యాంకుకు వెళ్తుంది. ఈ రుసుములు వ్యాపారి మాత్రమే భరించాలి" అని నిర్మలా సీతారామన్ తెలిపారు. డిజిటల్ చెల్లింపుల సాంకేతిక మౌలిక సదుపాయాలను నిర్వహించడానికి, మెరుగుదలకు, ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడానికి ఈ ఛార్జీని చెల్లింపుల వ్యవస్థలోని భాగస్వామి వర్గాలే పంచుకుంటాయని స్పష్టంచేశారు. ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా జరిగే లావాదేవీలపై ఇప్పటికే వ్యాపారులు ఎండీఆర్ చెల్లిస్తున్నారని నిర్మలా సీతారామన్ గుర్తుచేశారు. యూపీఐలో లావాదేవీలపై ఎండీఆర్‌ను వినియోగదారులపై పడే ఛార్జీగా చూడకూడదన్నారు. రూ.2 వేలు వరకు యూపీఐ లావాదేవీలు ఉచితంగానే కొనసాగుతాయని తెలిపారు. వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే లావాదేవీల్లో సుమారు 96 శాతం ఈ పరిధిలోకి రావని పేర్కొన్నారు. ప్రతిపాదిత ఎండీఆర్ వల్ల వినియోగదారులపై భారం పడుతుందన్న విమర్శల వేళ నిర్మలా సీతారామన్ ఈ మేరకు స్పష్టతనిచ్చారు. అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి రానున్నాయి.

# ఇథనాల్ వినియోగంతో రైతులకు మెరుగైన ఆదాయం: గడ్కరీ



భోపాల్(జనంసాక్షి): ఇథనాల్ వాడకం రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, పెట్రోలియం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సహాయపడుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలని, ప్రజా రవాణాను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్‌లో నూతన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో గడ్కరీ మాట్లాడారు.రైతులంటే ఈ రోజుల్లో అన్నదాత మాత్రమే కాదని.. 'ఇంధన దాత'లని గడ్కరీ అభివర్ణించారు. ఇథనాల్ ఉత్పత్తి వల్ల రైతులకు మేలు చేకూరిందన్నారు. దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి ప్రారంభమయ్యాక మొక్కజొన్న క్వింటాల్ ధర రూ.1200 నుంచి రూ.2,600కు చేరిందన్నారు. ఫ్లెక్స్ ఫ్యూయల్ కలిగిన ఇంజిన్లు నూరు శాతం ఇథనాల్‌తో నడుస్తాయని చెప్పారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు.భారత్ రూ.22 లక్షల కోట్ల పెట్రోలియంను దిగుమతి చేసుకుంటోందని గడ్కరీ ఈ సందర్భంగా తెలిపారు. ఇథనాల్, ఎలక్ట్రిసిటీ, హైడ్రోజన్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వాడకాన్ని పెంచి దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, హైడ్రోజన్ సాయంతో నడిచే వాహనాలూ అందుబాటులోకి రానున్నాయని గడ్కరీ చెప్పారు. కాలుష్యం పరంగా రవాణా రంగం వాటా గణనీయంగా ఉందని, అందుకే ప్రజా రవాణాను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.

# 10వేల మీటర్ల పరుగులో గుల్‌వీర్‌కు రజతం

**పోల్ వాల్ట్‌లో భారత్‌కు కాంస్యం.. భరణిక రికార్డు**

**ఆసియా గేమ్స్‌లో మెరిసిన భారత అథ్లెట్లు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్ విభాగంలో గుల్‌వీర్ సింగ్ రజతం సాధించాడు. పురుషుల 10000 మీటర్ల దూరాన్ని 28 నిమిషాల 29 సెకన్ల 38 మిల్లీ సెకన్లలో పూర్తి చేసి సిల్వర్ మెడల్ అందుకున్నాడు. 1500 మీటర్లు, 5000 మీటర్ల విభాగంలోనూ గుల్‌వీర్ సింగ్ పోటీ పడనున్నాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించిన సంగతి తెలిసిందే. తాజా ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటివరకు 23 పతకాలు సాధించింది. వీటిలో 2 స్వర్ణం కాగా, 9 రజతం, 12 కాంస్య పతకాలున్నాయి.

పోల్ వాల్ట్‌లో భారత్‌కు కాంస్యం.. భరణిక రికార్డు

ఆసియా గేమ్స్- 2026లో భారత మహిళా అథ్లెట్ భరణికా ఇళంగోవన్ చరిత్ర సృష్టించింది. పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 4.15 మీటర్ల ఎత్తు ఎగిరి కాంస్య పతకం సాధించింది. ఇప్పటివరకు నిర్వహించిన ఆసియా గేమ్స్‌లో ఈ ఈవెంట్‌లో భారత్‌కు పతకం



రావడం ఇదే ప్రథమం. ఈ పోటీల్లో కజకిస్థాన్‌కు చెందిన పోలినా నివానోవా కూడా 4.15 మీటర్లు ఎగిరి మూడో స్థానంలో నిలిచింది. దీంతో కాంస్య పతకాన్ని ఇద్దరూ పంచుకున్నారు. జపాన్‌కు చెందిన మిసాకి మరోటా 4.55 మీటర్లు క్లియర్ చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా.. చైనాకు అథ్లెట్ చుంగే నియూ 4.50 మీటర్లతో రజతం సాధించింది.1997 ఫిబ్రవరి 3న తమిళనాడులోని మయిలాడుతురైలో జన్మించిన భరణిక.. ఈ స్థాయికి చేరుకునేందుకు ఎన్నో కష్టనష్టాలకోర్చింది. 2020లో మోకాలి గాయంతో సుదీర్ఘకాలం విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత 2023లో భువనేశ్వర్‌లోని రిలయన్స్ ఫౌండేషన్ హై పెర్ఫామెన్స్ సెంటర్‌కు వెళ్లింది. అక్కడ కోలుకునేందుకు అనువైన పరిస్థితులతోపాటు మెరుగైన శిక్షణ అందడంతో జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమైంది. మార్చి నెలలో బెంగళూరులో జరిగిన ఇండియన్ ఓపెన్ జంప్ కాంపిటీషన్‌లో 4.10మీటర్ల ఎత్తును క్లియర్ చేసి.. ఆసియా క్రీడలకు అర్హత సాధించింది. భారత్‌కు బంగారు పతక ఆశలు రేకెత్తించింది. అంతేకాకుండా 65వ నేషనల్ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోల్ వాల్ట్ ఈవెంట్‌లో 4.20 మీటర్ల ఎత్తు ఎగిరి విజేతగా నిలిచింది.

# జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయ్

లాంఫెల్‌పట్‌లోని ప్రధాన ఎన్నికల కార్యాలయంవైపు ర్యాలీ నిర్వహించారు. తర్వాత ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. తర్వాత ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారింది. దీనితో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. కాంగ్రెస్ నిరసనల నేపథ్యంలో పోలీసులు జమ్మూకశ్మీర్‌లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే శ్రీనగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శాసన సభ లోపల నిరసన ప్రదర్శనలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బ్యానర్లు ప్రదర్శించారు. అలాగే గువాహటి, చండీగఢ్, డెహ్రాడూన్, లఖ్‌నవూ, కోల్‌కతాల్లో కూడా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. మరోవైపు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తమ రాష్ట్ర విభాగాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆయా రాష్ట్రాల్లోని ఎన్నికల సంఘాల కార్యాలయాల వరకు పాదయాత్రలు నిర్వహించాలని స్పష్టం చేసింది. మరోవైపు బీఎల్ఓ అప్లికేషన్‌లో ప్రత్యేకంగా 'మార్క్ వీఐపీ' ఫీచర్‌ను సృష్టించి, ఓటర్ సమానత్వంపై ఎన్నికల సంఘం దాడి చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. అసలు ఎన్నికల సంఘం భారతీయ ఓటర్లను ఎందుకు, ఏ ప్రాతిపదికన వేరు చేస్తోందని ప్రశ్నించింది.

అందుకే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అప్రూవర్‌గా మారాలని, విచారణను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అంతేకాదు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. కాగా, సీఈసీ తీసుకున్న ఎస్ఐఆర్‌తో సహా పలు కీలక నిర్ణయాలు చెల్లవని కాంగ్రెస్? అధికార ప్రతినిధి పవన్ ఖేడా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జరుగుతున్న అన్ని పరిణామాలను గమనిస్తోందని, సరైన సమయంలో సరైన చర్యలు తీసుకుంటుందనే నమ్మకం తమకు ఉందని ఆయన అన్నారు.ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు, ఆదేశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషి 10 నెలల వ్యవధిలో కనీసం 14సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని గురువారం ఓ ప్రముఖ పత్రిక తన నివేదికలో పేర్కొంది. దీనితో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగాయి. పలు ప్రతిపక్షపార్టీలు, సీజేపీ సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు చేపట్టాయి. అయితే ఎన్నికల కమిషనర్లు తెలిపిన సంస్థాగత అభ్యంతరాలను అసమ్మతిగా అభివర్ణించడాన్ని ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఇవన్నీ తమ




రోజువారీ పనిలో భాగమేనని తెలిపింది. ఎస్ఐఆర్‌తో సహా అన్ని విషయాల్లో తుది నిర్ణయం ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఏదేమైనప్పటికీ, పార్లమెంట్ ఉభయ సభల్లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్?పై విపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ సెప్టెంబర్ 29న దిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం అంతర్గత పనితీరు మొదలైన అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# సీఈసీ నిర్ణయాలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలి

ఆదేశాలివ్వాలని పిటిషనర్ కోరారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ.. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్ గార్గ్, ఈసీ ఐటీ హెడ్ సీమా ఖన్నాపై క్రిమినల్ విచారణ జరపాలని అభ్యర్థించారు.

# ప్రతిపక్షపార్టీలు ఎన్నికలు బహిష్కరించండి

**24 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి**

సర్‌లో అవకతవకలకు బాధ్యత వహిస్తూ.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ 24 గంటల్లో రాజీనామా చేయాలని దీప్కే డిమాండ్ చేశారు. లేదంటే అక్టోబర్ 2 నుంచి జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం.. సామాజిక న్యాయం

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘన నివాళు లర్పించారు. అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని సీఎం పేర్కొన్నారు. ఆమె 131వ జయంతి సందర్భంగా ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం బీసీలు, పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దాదాపు 80 ఏళ్ల క్రితమే తెలంగాణ గడ్డపై దొరల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటానికి జంగ్ సైరన్ మోగించారని సీఎం గుర్తుచేశారు. సమ్మక్క-సారలమ్మ, చాకలి ఐలమ్మ వంటి వీర మహిళల స్ఫూర్తితోనే తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామని తెలిపారు. కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టి ఆమె సేవలను స్మరించుకున్నామని సీఎం చెప్పారు. ఐలమ్మతో పాటు తెలంగాణ వీర మహిళలు చూపిన ధైర్యం, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు కూడా ఆదర్శమని అన్నారు. బీసీ విద్యార్థులకు మెరుగైన విద్య, గురుకులాలు, హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు యువత, మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, గౌరవం, న్యాయం అందించడమే చాకలి ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అని స్పష్టం చేశారు.

# జెన్‌జీకి ఓటు హక్కును లాక్కోనేందుకు మోదీ కుట్ర

రమేశ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.ఇది ఇద్దరు ప్రధానుల కథ. ఒక ప్రధాని (రాజీవ్ గాంధీ) 1988 డిసెంబరులో జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను సవరించి ఓటు హక్కు కనీస వయసును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. ఆయన యువతకు సాధికారత కల్పించిన ప్రధాని. మరో ప్రధాని (నరేంద్ర మోదీని ఉద్దేశించి) జెన్‌జీ ఓటర్లు నమోదు కాకుండా ఉండేందుకు 2024 నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణలను నిలిపివేశారు. ఈ ప్రధాని యువత ఆశలు, ఆకాంక్షలను నాశనం చేశామని భయపడుతున్నారు. ఒక ప్రధాని జెన్ జీకి ఓటు హక్కు ఇచ్చారు. మరొకరు అక్రమ మార్గాల ద్వారా ఆ ఓటు హక్కును లాక్కోవాలని నిశ్చయించుకున్నారు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

వారిని ఓటరు జాబితా లేకుండా చేసేందుకు మోదీ కుట్ర : జైరాం రమేశ్

అంతకుముందు గురువారం కూడా నరేంద్ర మోదీపై జైరాం రమేశ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అవమానానికి గురైన ప్రధాని మోదీ జెన్‌జీ ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో లేకుండా చూసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. జెన్‌జీ వీధుల్లోకి వచ్చి మోదీని ఎగతాళి చేశారని అన్నారు. అందుకే వారిని ఓటరు జాబితాలో లేకుండా చేసేందుకు సీఈసీ జ్ఞానేశ్? కుమార్‌ను ప్రధాని మోదీ నియమించారని విమర్శించారు. ఏటా ఓటర్ల జాబితాను సవరించే ప్రత్యేక సమ్మరీ రివిజన్‌ను నిలిపివేశారని అన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన జెన్‌జీ యువతను కొత్త ఓటర్లుగా చేర్చడానికి ఇదొక మార్గమని చెప్పారు. ఎస్ఎస్ఆర్‌ను పునఃప్రారంభించాలని మిగతా ఇద్దరు ఈసీలు గట్టిగా కోరుతున్నప్పటికీ, మోదీపై యువతలో అసంతృప్తి స్పష్టమైనప్పటి నుంచి గత రెండేళ్లుగా ఎలాంటి సవరణ జరగలేదని మండిపడ్డారు.

**మోదీ, షా, జ్ఞానేశ్ దేశద్రోహులు :రాహుల్**

న్యూఢిల్లీ(జనంసాక్షి):అలాగే లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం మోదీ, సీఈసీపై గురువారం తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశంలోని ప్రతి రాజకీయ వ్యవస్థను చరిత్రాత్మకంగా ప్రభావితం చేసిన ప్రభుత్వ వ్యతిరేక ధోరణులు, అధికారంలో ఉన్న బీజేపీ విషయంలో రహస్యంగా ఎలా అదృశ్యమవుతున్నాయని ప్రశ్నించారు. దేశంలో ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియను నాశనం చేసిన ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహులని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశానికి వారు చేసిన ద్రోహానికి మోదీ, అమిత్ షాపై విచారణ జరిగి తీరుతుందని అన్నారు. సీఈసీ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కోరారు. దేశంలో 2024 తర్వాత జరిగిన సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని ఆరోపించారు."సీఈసీ జ్ఞానేశ్ కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారు. ఆయన్ను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎంపిక చేశారు. జ్ఞానేశ్? కుమార్ రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ ఆయన్ను మోదీ, షా కాపాడుతున్నారు. 2024 ఎన్నికలకు ముందు సీఈసీపై చట్ట ప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయి. ఈ క్రమంలో ఓట్ చోరీ చివరకు చట్టం చోరీగా మారుతోంది" అని రాహుల్ ఆరోపించారు.

# హర్మూజ్ వద్ద యుద్ధంలోకి అమెరికా లేజర్ వెపన్స్..!

**న్యూయార్క్(జనంసాక్షి):**ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా అత్యాధునిక క్షిపణులు, డ్రోన్లను విరివిగా వాడుతోంది. తాజాగా అగ్రరాజ్యం తన అమ్ముల పొది లోని లేజర్ వెపన్స్ శక్తిని హర్మూజ్‌లో ప్రయోగిస్తున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వీటితో ఇప్పటికే హర్మూజ్ వద్ద అనేక క్రూజ్ క్షిపణులు, డ్రోన్లను కూల్చినట్లు తెలిపాయి. మార్పులు చేసిన ఎక్స్‌బాక్స్ గేమ్ కన్సోల్ కంట్రోలర్లను ఈ లేజర్ ఆయుధాల ఆపరేటింగ్‌కు వాడుతున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టుపై 500 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు సమాచారం.క్షిపణుల వంటి ఖరీదైన ఆయుధాలను ఉపయోగించడం కంటే ఈ లేజర్ ఆయుధాల ద్వారా.. హర్మూజ్‌పై డ్రోన్‌లను, క్రూజ్ క్షిపణులను సమర్థంగా ధ్వంసం చేస్తున్నట్లు అమెరికా సైనిక వర్గాలు వెల్లడించాయి. వీటిద్వారా డ్రోన్‌లను ట్రాక్ చేసి.. పేల్చివేస్తున్నట్లు తెలిపాయి.ఈ లేజర్ ఆయుధాల సాంకేతికను అమెరికా సుమారు 50 ఏళ్లుగా అభివృద్ధి చేస్తోంది. సంప్రదాయ యాంటీ-డ్రోన్, యాంటీ-మిసైల్ వ్యవస్థల్లా.. లేజర్ ఆయుధాలకు భౌతిక ఇంటర్‌సెప్టర్ అవసరం లేదు. ఈ ఆయుధాలు జనరేటర్లు లేదా బ్యాటరీ ప్యాక్‌ల నుంచి శక్తిని గ్రహించి.. దానిని ఫోటాన్లుగా మారుస్తాయి. అనంతరం వాటి కాంతి కణాలు లక్ష్యం ఉపరితలంపై పడి అది కాలిపోయేంత వేడిని పుట్టిస్తాయి. ఇతర ఆయుధాలతో పోలిస్తే.. వీటి ధర కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఇప్పటి వరకు వీటిని యుద్ధ నౌకలపై మాత్రమే ప్రయోగించారని.. మానవ లక్ష్యాలపై ఉపయోగించలేదని నిపుణులు పేర్కొన్నారు. ఈ ఆయుధాలను మరింత అభివృద్ధి చేయగలిగితే ప్రపంచ దేశాలు ఇకపై మందుగుండు సామగ్రి నిల్వల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండబోదన్నారు. అయితే యుద్ధ భూమిలో ఈ లేజర్ ఆయుధాల వాడకాన్ని ట్రంప్ యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

# గోదావరిలో వరద పోతుంటే.. బురద రాజకీయాలేనా..!

ఉన్నా, ఆ నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపడంలో మీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఆందోళన కలిగిస్తోంది. నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే మీరు మాత్రం ప్రాజెక్టుల మీద రాజకీయాలు చేస్తూ పంటలు ఎండగొడుతున్నారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేయకుండా చోద్యం చూస్తున్నారు.ఒకవైపు గోదావరిలో వరద ప్రవాహం కొనసాగుతుంటే, మరోవైపు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్ డెడ్ స్టోరేజీలో ఉన్నాయి. మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 13 టీఎంసీలు మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. ఇక్కడ 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం అందుబాటులో ఉంది. మల్లన్న సాగర్ నిండుకుండలా మారితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతో పాటు, మీరు చెబుతున్న మూసీ ప్రాజెక్టుకు కూడా ఇక్కడి నుంచి నీటిని తరలించే అవకాశం ఉంటుంది. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌లోనూ 15 టీఎంసీలకు కేవలం 6 టీఎంసీలే ఉన్నాయి. ఇక్కడికి సైతం నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం చేకూరుతుంది. ఎల్లంపల్లిలో నీటి ఎత్తిపోతలు ప్రారంభిస్తే మిడ్ మానేరు సహా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లకు నీటిని తరలించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా పూర్తి పరిష్కారం లభిస్తుంది. ఈ రిజర్వాయర్లను నింపడం వల్ల దాదాపు 5 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి దోహదం చేసినట్లవుతుంది.మరోవైపు మిడ్ మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్.ఎం.డి.)లో ప్రస్తుతం 11 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయి. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లోని రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేసిన వారవుతారు.మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో మా ప్రభుత్వ హయాంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. ఈ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ కోసం రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి నీటిని తరలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడం జరిగింది. అయితే రంగనాయక సాగర్‌లో నీళ్లు లేకపోవడం వల్ల పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితితో పామ్ ఆయిల్ సాగు చేస్తున్న రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి కోసం రైతులు కళ్లల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తుంటే, మీరు మాత్రం నదుల్లో వస్తున్న నీళ్లను లిఫ్ట్ చేయకుండా కిందకు వదిలిపెడుతున్నారు.ప్రస్తుతం గోదావరి నదిలో ఎల్లంపల్లి వద్ద వరద ప్రవాహం భారీగా కొనసాగుతున్నది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకొని అన్ని మోటార్లను నడిపి నీళ్ళు లిఫ్ట్ చేసే అవకాశం ఉన్నా మీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మీరు చేస్తున్న నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతున్నది. జలకళతో కనిపించాల్సిన రిజర్వాయర్లు ఎండిపోయి కనిపిస్తున్నాయంటే దానికి కారణం నీటి నిర్వహణలో మీ ప్రభుత్వ వైఫల్యం.ఇప్పటికైనా కళ్లు తెరవండి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం లేదు మంత్రిగారు. ఎల్‌నినోను సాకుగా చూపకుండా, అందివచ్చిన గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా ఆన్-ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటల పాటు అన్ని మోటార్లు నడిపి జలాశయాలను నింపాలని డిమాండ్ చేస్తున్నాం. రాజకీయాలను పక్కన పెట్టి రైతు ప్రయోజనాల కోసం ఆలోచించాలని, ప్రకృతిపై నెపం నెట్టి రైతులకు సాగు నీళ్లు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం

# మా దేశంపై దాడిని మీ భార్య సమర్థించలేదా..?

**మమ్దానీపై నెతన్యాహు మండిపాటు**

న్యూయార్క్(జనంసాక్షి):అమెరికా పర్యటనలో ఉన్న ఇజ్రా యెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ నగరానికి రాకుండా తనను అడ్డుకునేందుకు మమ్దానీ యత్నించారని ఆరోపించారు. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని మేయర్ సతీమణి సమర్థించారని అన్నారు. ఐరాస జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు."ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందంటూ మీరు పదే పదే అసత్య ప్రచారం చేశారు. ఈ సమావేశానికి రాకుండా నన్ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. నా గళాన్ని అణగదొక్కాలని చూశారు. కానీ.. మీరు ఎప్పటికీ నిజాన్ని అణచివేయలేరు. ఇజ్రాయెల్ ఎన్నడూ నరమేధానికి పాల్పడలేదు. మారణహోమాన్ని ఆపింది. ఇక, 2023 అక్టోబరు 7న మా దేశ ప్రజలపై హమాస్ జరిపిన భీకర దాడిని సమర్థిస్తూ ఉన్న ఓ పోస్టును మీ భార్య లైక్ చేశారు. టెల్ అవీవ్ అస్తిత్వమే భూమ్మీద ఉండకూడదన్న మరో పోస్టునూ ఆమె సమర్థించారు. వీటిని మీరు ఏమాత్రం ఖండించకపోవడం గమనార్హం" అని నెతన్యాహు అన్నారు. అంతర్జాతీయ వేదికపై నెతన్యాహు అసత్యాలు పలికారని దుయ్యబట్టారు. ఇవేవీ నిజాన్ని మార్చలేవని అన్నారు. మానవాళికి వ్యతిరేకంగా ఆయన పాల్పడిన యుద్ధ నేరాలకు గానూ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

శోభాయాత్ర కనుల పండువగా కొనసాగింది. వేలాదిమంది భక్తులు వీడ్కోలు పలుకుతుండగా గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. బడా గణేశుడి నిమజ్జనోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా భక్తులు ట్యాంక్‌బండ్ వద్దకు తరలివచ్చారు. గణపతి బప్పా మోరియా నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. శోభాయాత్ర ప్రారంభ సమయంలో దానం నాగేందర్ మహాగణపతి ఎదుట డ్యాన్స్ చేశారు.

**నిమజ్జనోత్సవాల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి: మంత్రి పొన్నం**

హైదరాబాద్: గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను ఉత్సవ నిర్వాహకులు వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షం కురిసే అవకాశమున్నందున నిర్వాహకులు ఈ దిశగా ఆలోచించాలని కోరారు. ఈ రోజు రాత్రి వరకు నిమజ్జనోత్సవాన్ని పూర్తి చేయాలనే భావిస్తున్నట్టు ఆయన తెలిపారు. గణేశ్ నిమజ్జనోత్సవాల ప్రక్రియను మంత్రి పొన్నం ప్రభాకర్ డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనర్, కలెక్టర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌తో కలిసి విహంగ వీక్షణం చేశారు. హుస్సేన్ సాగర్ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. డప్పు చప్పుళ్లు, భక్తుల ఆటపాటలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో మొత్తం 114 నిమజ్జన కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం 14,840 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటికే 10వేలకు పైగా విగ్రహాలు పూర్తయ్యాయని సీపీ సజ్జనర్ తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనోత్సవం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం లోపు అన్ని విగ్రహాల నిమజ్జనం పూర్తవుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.

**రూ.39లక్షల రికార్డు ధరపలికిన బాలాపూర్ లడ్డూ**

నగరంలోని బాలాపూర్‌లో గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది. ఈసారి లడ్డూ రికార్డు ధర పలికింది. వనస్థలిపురంలోని సాహెబ్‌నగర్‌కు చెందిన సామ ప్రణీత్‌రెడ్డి సొంతమైంది. రూ.39లక్షలకు ఆయన దీన్ని సొంతం చేసుకున్నారు. వేలంలో పాల్గొనేందుకు 8 మంది తమ పేర్లను నమోదు చేసుకోగా.. చివరికి ప్రణీత్‌రెడ్డిని లడ్డూ వరించింది. గతేడాది రూ.35 లక్షలు పలికింది.వినాయక ఉత్సవాల్లో బాలాపూర్‌కి ప్రత్యేక స్థానం ఉంది. స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రసాదం ప్రత్యేక గుర్తింపు సాధించింది. నవరాత్రులు పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కిలోల లడ్డూను పొందడం ద్వారా శుభం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అందుకే వేలంలో దక్కించుకునేందుకు పోటీ పడుతుంటారు.బాలాపూర్ వినాయకుడికి 45 ఏళ్ల ఘన చరిత ఉంది. లంబోదరుడిపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలన్న ఆలోచనతో మొట్టమొదటిసారిగా బాలాపూర్ ఉత్సవ సమితి 1994లో లడ్డూ వేలం నిర్వహించింది. మొదటిసారిగా లడ్డూ ప్రసాదాన్ని రూ.450కు కైవసం చేసుకున్న రైతు కొలను మోహన్‌రెడ్డి.. దాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు పంచి.. మిగతాది పొలాల్లో చల్లారు. భగవంతుడు సుఖసంతోషాలను అందించారనే నమ్మకంతో మరుసటి ఏడాదితో పాటు 1998, 2004, 2008లలోనూ ఆయన పోటీ పడి దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పాల్గొనేందుకు 15 ఏళ్ల పాటు స్థానికులకే అవకాశం కల్పించిన ఉత్సవ సమితి.. ఆ తర్వాత బయట వ్యక్తులనూ అనుమతించింది. అలా 2009లో సరిత అనే మహిళ రూ.5.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఇప్పటివరకు 31 సార్లు వేలం వేయగా.. 2020లో కరోనా నేపథ్యంలో వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందజేశారు. 2024లో కొలను శంకర్‌రెడ్డి రూ.30.01లక్షలకు, గతేడాది లింగాల దశరథ్‌గౌడ్ రూ.35 లక్షలకు దక్కించుకున్నారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలన

- క్షేత్రస్థాయి పరిశీలనలో సీఎంఓ కార్యాలయ ఉన్నతాధికారులు



వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి): వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం వరంగల్ లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాల శాఖ వికాస్ రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంవో కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, వివిధ విభాగాల నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, నీటి సరఫరా తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన పనుల నాణ్యతను, చేపట్టాల్సిన పనులను ప్రణాళికాబద్ధంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో ప్రతి దశలోనూ నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి అందుబాటులోకి వచ్చిన అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందేలా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగావరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉన్నతాధికారులకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెన్షన్‌కు లంచం డిమాండ్

- ముగ్గురు ఉద్యోగులపై వేటు
- ఫైలు ముందుకు కదలాలంటే ముడుపులు ఇవ్వాల్సిందేనంటూ వేధింపులు
- బాధితురాలి ఫిర్యాదుతో విచారణ జరిపించిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



సూర్యాపేట (జనంసాక్షి): పదవీ విరమణ పొందిన తోటి ఉద్యోగిని పింఛన్ ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించడంతో పాటు లంచం డిమాండ్ చేసిన ముగ్గురు ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కొరడా ఝళిపించారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌లను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం ఈ చర్యలు తీసుకున్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖలో విధులు నిర్వర్తించిన ఓ ఉద్యోగిని గత మార్చి నెలలో పదవీ విరమణ పొందారు. ఆమెకు రావాల్సిన పింఛను, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తాలూకు ఫైలును ఎప్పటికప్పుడు పై కార్యాలయానికి పంపించాల్సి ఉండగా గతంలో పని చేసిన అధికారిణితో పాటు సంబంధిత విభాగ ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారు. ఆ శాఖకు చెందిన గతంలో పనిచేసిన సీనియర్ అధికారిణితో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. అడిగిన మొత్తం ఇస్తేనే ఫైలుపై సంతకాలు చేసి ముందుకు పంపుతామని చెప్పడంతో, ఆ మొత్తం ఇచ్చేందుకు బాధితురాలు నిరాకరించడంతో నెలల తరబడి ఫైల్ కదలకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వీసు ముగిసి నెలలు గడుస్తున్నా లంచం ఇవ్వలేదనే సాకుతో తన పెన్షన్ ఫైలును కదలకుండా అడ్డుకుంటున్నారని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఆవేదనపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారులు జరిపిన విచారణలో ఉద్యోగులు లంచం డిమాండ్ చేసిన మాట వాస్తవమేనని, విధుల్లో తీవ్ర అలసత్వం, బాధ్యతారాహిత్యం ప్రదర్శించారని తేలింది. విచారణ నివేదిక ఆధారంగా సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ను తక్షణమే సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు వెలువరించారు. దీనితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారిణిపై సైతం సమగ్ర విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించినా, ప్రజలను లేదా విశ్రాంత ఉద్యోగులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ లంచాల కోసం వేధించినా ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కొండపోచమ్మ, మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తాం



- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట బ్యూరో (జనంసాక్షి) సెప్టెంబర్ 25 : కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన ఆయా గ్రామాల నిర్వాసితుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి పరిష్కరిస్తామని తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం ములుగు మండలం కొండపోచమ్మ సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ మరియు గజ్వేల్ పట్టణంలో ముట్రాజ్ పల్లి పరిధిలోగల మల్లన్న సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీ లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ రిజర్వాయర్ లకు అర్ అండ్ ఆర్ కాలనీల సమస్యలు చాలా కాలం నుండి పెండింగ్ లో ఉన్నాయని, నిర్వాసితులకు సంబంధించిన పరిహారం, పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు, ఇళ్ల స్థలాలు, ఇతర పెండింగ్ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, వీటికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సంబంధించిన బడ్జెట్ మంజూరు కాగానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాలు అర్హత మేరకు అందేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కొండపోచమ్మ సాగర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో చెరువు పక్కన నిర్మాణం చేపడుతున్నారని చెరువు యొక్క ఎఫ్ టి ఎల్ బౌండరీ లు ఫిక్స్ చెయ్యాలని, దీనికి ఆనుకొని ప్లాట్స్ చెయ్యకూడదని ములుగు తహసిల్దార్ ను ఆదేశించారు. అర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితుల పునరావాసం కోసం భూ సేకరణ చేసి ఎవ్వరికి కేటాయించకుండా ఎలాంటి నిర్మాణం చేపట్టని భూములను వెంటనే అధీనంలోకి తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇట్టి స్థలాలు ఆక్రమణకు, మరియు ఎలాంటి పంటలు వెయ్యకుండా ఎల్లప్పుడూ పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఆర్డీఓ చంద్రకళ, సిద్దిపేట ఆర్డీఓ సదానందం, ఆయా మండల తహశీల్దార్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా అర్ అండ్ ఆర్ కాలనీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌ను అభివృద్ధికి కేంద్ర నిధులు కోరండి

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ డా.కడియం కావ్య
- కేయూ పీఎం-ఉషా నిధుల కోసం అభ్యర్థన
- వరంగల్‌లో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం కోసం కేంద్రాన్ని కోరాలని సీఎంకు విజ్ఞప్తి



వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) : వరంగల్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గారిని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కలిసి వినతిపత్రాలు అందజేశారు. కాకతీయ యూనివర్సిటీకి పీఎం-ఉషా నిధుల మంజూరు, వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర నిధులు, వరంగల్‌లో నైలిట్ , సీఐటీడీ కేంద్రాల ఏర్పాటు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు అంశాలను ముఖ్యమంత్రికి ఎంపీ వివరించారు. కాకతీయ యూనివర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు పీఎం-ఉషా పథకం కింద ప్రతిపాదించిన నిధులను కేంద్రం నుంచి త్వరగా మంజూరు చేసి విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కోరారు. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన, మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులు, పరిశోధకులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. వరంగల్ కోటలో పురావస్తు మ్యూజియం అభివృద్ధికి కేంద్ర సాంస్కృతిక శాఖ నుంచి రూ.10 కోట్లు మంజూరు చేయించేలా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి గారిని ఎంపీ కోరారు. 1991లో ఏర్పాటు చేసిన ప్రస్తుత మ్యూజియం భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త మ్యూజియం భవన నిర్మాణం 2023 మేలో పూర్తయినప్పటికీ కళాఖండాల తరలింపు, పరిరక్షణ, ప్రదర్శన వసతులు, భద్రత, వాతావరణ నియంత్రణ తదితర పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. 2026-31కు సంబంధించిన సవరించిన మ్యూజియం గ్రాంట్ పథకం మార్గదర్శకాలు వెలువడిన అనంతరం ప్రతిపాదన సమర్పించాల్సి ఉన్నందున, ఆ మేరకు కేంద్రంతో సమన్వయం చేయాలని కోరారు.

### వరంగల్‌లో నైలిట్ కేంద్రం

వరంగల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో మాత్రమే ఉన్న ఈ సంస్థకు వరంగల్‌లో కేంద్రం ఏర్పాటు చేస్తే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ తదితర రంగాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన శిక్షణ, ధ్రువపత్రాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

### సీఐటీడీ ఏర్పాటుకు విజ్ఞప్తి

వరంగల్‌లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ డా.కడియం కావ్య కోరారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు, నైపుణ్యం కలిగిన యువత, ఎంఎస్ఎంఈలకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. టూల్ అండ్ డై డిజైన్, సీఏడీ/సీఏఎం, సీఎన్‌సీ మిషనింగ్, మౌల్డ్ తయారీ, ప్రెసిషన్ ఇంజినీరింగ్, రోబోటిక్స్, ఆటోమేషన్, 3డీ ప్రింటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందించడంతో పాటు స్థానిక పరిశ్రమలకు సాంకేతిక సహకారం లభిస్తుందని వివరించారు. కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖతో సంప్రదించి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

### పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలి

వరంగల్‌లో ప్రస్తుతం ఉన్న పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం స్థానంలో పూర్తిస్థాయి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. 2017 మార్చి 29న ఏర్పాటు చేసిన ద్వారా ప్రాంత ప్రజలకు సేవలు అందుతున్నాయని, పాస్‌పోర్ట్ సేవలకు డిమాండ్ పెరుగుతోందని తెలిపారు. తత్కాల్ పాస్‌పోర్ట్ సేవల కోసం కరీంనగర్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వరంగల్-హనుమకొండ-కాజీపేట త్రినగర ప్రాంతంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలకు ప్రయోజనం చేకూరేలా తగిన మౌలిక వసతులు, సిబ్బందితో పూర్తిస్థాయి పి ఎస్ కే ఏర్పాటు చేయాలని కేంద్ర విదేశాంగ శాఖతో మాట్లాడాలని ముఖ్యమంత్రిని ఎంపీ కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తో పాటు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ప్రస్తావించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## పకడ్బందీ ప్రణాళికతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలి

- తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలి
- గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలి
- సంబంధిత అధికారులకు ఆదేశాలు జారిచేసిన మంత్రి సీతక్క
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలసంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం



హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనం సాక్షి) : తాగునీటి సరఫరాకు అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, పకడ్బందీ ప్రణాళికతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించి పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎల్ నినో సన్నద్ధత, విబిజి రాంజీ, ఆర్డబ్ల్యూఎస్, హ్యామ్ రోడ్స్ పై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టరేట్ కు చేరుకున్న సీతక్కకు పోలీసులు గౌరవ వందనం సమర్పించగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సమీక్షా సమావేశంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, ఎల్ నినో, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సీతక్క సమీక్షించారు. సాగునీరు, తాగునీరుకు సంబంధించిన అంశాలను సాగునీటి పారుదల శాఖ అధికారులు, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు, అభివృద్ధి పనుల పురోగతి గురించి వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ ప్రణాళికతో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడంతో పాటు, భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు చేపట్టే బోర్ రీచార్జ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని, నీటి నిల్వలు, రిజర్వాయర్లు, బోర్లు, మోటార్లు తదితర వాటి పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్ మాట్లాడుతూ.. వీబీజీ రాంజీ పథకం ద్వారా కూలీలకు పని దినాలు కల్పించాలని అన్నారు. పథకం ద్వారా చేపట్టిన పనుల పురోగతి పై ప్రతి పదిహేను రోజులకోసారి అధికారులు సమీక్ష చేయాలన్నారు. పనులను పూర్తి చేయడంలో, కూలీలకు ఉపాధి కల్పించే విషయంలో స్థానిక సర్పంచులను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్ మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు. ఎల్ నినో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టాలి అనే అంశాలపై అధికారులు ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ సమావేశం లో స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ లు చాహత్ బాజ్ పాయి, అడిషనల్ కలెక్టర్లు, మిషన్ భగీరథ ఈఎన్సి కృపాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఎన్సి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# 60 కిలోల ఆహార పదార్థాలు ధ్వంసం





- ఫుడ్ సేఫ్టీ తనిఖీల్లో అపరిశుభ్ర ఆహార పదార్థాలు బహిర్గతం

వలిగొండ, సెప్టెంబర్ 25( జనం సాక్షి) : మండల కేంద్రంలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎన్. శివ శంకర్ రెడ్డి వలిగొండ గ్రామం, మండల పరిధిలోని పలు ఆహార తయారీ, విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంజయ్ బెంగళూరు బేకరీ, శ్రీ రాజశ్యామల హోటల్ అండ్ రెస్టారెంట్‌లను తనిఖీ చేశారు. తనిఖీల్లో ఆహార తయారీ, నిల్వ ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రమాణాలు సక్రమంగా పాటించకపోవడం, అపరిశుభ్రమైన పరిస్థితుల్లో ఆహార పదార్థాలను నిల్వ చేయడం వంటి పలు లోపాలను గుర్తించారు. బేకరీలో ఫంగస్ సోకిన స్వీట్లు, అనుమానాస్పదంగా రంగు కలిగిన టీ పొడి, పురుగులు సోకిన టీ పొడి, చక్కెరతో పాటు కేక్‌లు, కేక్ క్రీములు, బిస్కెట్లు తదితర ఆహార పదార్థాలు పరిశుభ్రమైన పరిస్థితుల్లో నిల్వ చేయకపోవడం గుర్తించారు. కేక్ తయారీ ప్రాంతం, హోటల్ వంటగది, రిఫ్రిజిరేటర్లు కూడా సక్రమంగా శుభ్రపరచకపోవడంతో అపరిశుభ్ర, అస్వచ్ఛ పరిస్థితులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల సందర్భంగా స్వీట్లు, పఫ్‌లు, ఖారా, బూంది, సాస్‌లు, టీ పొడి, కేక్ క్రీములు, బిస్కెట్లు తదితర సుమారు 60 కిలోల అననుకూల ఆహార పదార్థాలను తొలగించి ధ్వంసం చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది, వాహనం సహకారంతో ధ్వంసం చేసిన ఆహార పదార్థాలను డంపింగ్ యార్డుకు తరలించి పారవేశారు. తనిఖీల్లో అనుమానాస్పదంగా గుర్తించిన ఆహార పదార్థాల నుంచి నమూనాలను సేకరించి విశ్లేషణ కోసం ప్రయోగశాలకు పంపించారు. నమూనాల విశ్లేషణ నివేదిక అందిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలపై సంజయ్ బెంగళూరు బేకరీ, శ్రీ రాజశ్యామల హోటల్ అండ్ రెస్టారెంట్‌లకు సంబంధించి రెండు ఇంప్రూవ్‌మెంట్ నోటీసులు జారీ చేయడానికి యాదాద్రి భువనగిరి జిల్లా డిజిగ్నేటెడ్ ఆఫీసర్ కుమారి పి. స్వాతికి సిఫార్సు చేశారు. ఆహార తయారీ ప్రదేశాలు, వంటగదులు, రిఫ్రిజిరేటర్లు, పరికరాలు, నిల్వ ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా నిర్వహించాలని, ఆహార పదార్థాలను కీటకాలు, ఫంగస్, ఇతర కలుషితాలకు గురికాకుండా సురక్షితంగా నిల్వ చేయాలని అధికారులు సూచించారు. ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని ఆహార వ్యాపార నిర్వాహకులకు స్పష్టం చేశారు. నమూనాల విశ్లేషణ నివేదికలు, ఇంప్రూవ్‌మెంట్ నోటీసుల అమలును బట్టి తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

## మతసామరస్యం వెల్లివిరిసిన వేళ

సత్తుపల్లి (జనంసాక్షి) : సత్తుపల్లి హనుమాన్ నగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ, హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. వేలంలో మొదటి లడ్డూను ఎస్కే బాజీరజియా రూ.20 వేలకు దక్కించుకోగా, రెండవ లడ్డూను రూ.10 వేలకు ఎస్కే నాగూరు దంపతులు దక్కించుకున్నారు. లడ్డూ వేలంలో పాల్గొని ఉత్సవాలకు సహకరించిన విజేతలను దేవాలయ కమిటీ సభ్యులు, హనుమాన్ యూత్ కమిటీ సభ్యులు అభినందించి లడ్డూలను అందజేశారు. ఈ దైవ కార్యక్రమానికి, నిత్య అన్నప్రసాద వితరణకు సహకరించిన భక్తులకు, దాతలకు, ప్రజలందరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## గురుకుల పాఠశాలలో విద్యార్థినులను కరిచిన ఎలుకలు

పాలకుర్తి (జనంసాక్షి) : పాలకుర్తి నియోజకవర్గంలో దారుణం జరిగింది. గురుకుల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. పాలకుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో రాత్రి ఎలుకలు కరవడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురైయారు. చేతులు, కాళ్లపై ఎలుకలు కరవడంతో అస్వస్థతకు గురైన విద్యార్థినులను చికిత్స నిమిత్తం సిబ్బంది ఆసుపత్రికి తరలించారు.

## పూల కుండీలలో వినాయక నిమజ్జనం

కరీంనగర్ (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ ఆపదలో సహాయానికి రా ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక నిమజ్జనం సందర్భంగా నగరంలోని 24వ డివిజన్ లోని మెహర్ నగర్ లో మట్టి వినాయకులను పూలకుండీలలో నిమజ్జనం చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలనుఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేసి అలాగే నిమజ్జనం సందర్భంగా పూలకుండీలను ఉచితంగా పంపిణీ చేసి వాటిలో మట్టి విగ్రహాల నిమజ్జనం చేసినట్లు ఆ మట్టితో పూల కుండీలలో పూల మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించామని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ, సభ్యులు తుమికి పవన్ కుమార్, కె. రామకృష్ణారెడ్డి, వి. శ్రీనివాసరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, దేవదాస్, గోపీనాథ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26 సెప్టెంబర్ 2026

ఎన్నికల సంఘంపై నీలినీడలు

# జ్ఞానేష్ కుమార్ రాజీనామానే సముచితం

*భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం కేవలం ఒక రాజ్యాంగ సంస్థ మాత్రమే కాదు.. ప్రజల ఓటు హక్కుకు కాపలాదారు. అధికార పక్షం ఎవరు, ప్రతిపక్షం ఎవరు అనే తేడా లేకుండా ప్రతి రాజకీయ పార్టీకి సమాన దూరంలో నిలిచి, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసాన్ని కల్పించాల్సిన అత్యంత కీలక బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అందుకే ఎన్నికల సంఘం నిర్ణయాలపై చిన్నపాటి అనుమానం తలెత్తినా దాని ప్రభావం మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థపై పడుతుంది. ప్రస్తుతం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం చుట్టూ నెలకొన్న పరిణామాలు ఇలాంటి ఆందోళనలకు కారణమవుతున్నాయి.*

సంపాదకీయం

ఎన్నికల సంఘంలోని సహచర కమిషనర్లు పలు అంశాలపై లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ కథనాలు వెలువడుతున్నాయి. మరోవైపు విపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ అభిశంసనకు డిమాండ్ చేస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేస్తూ రాజకీయ వర్గాలు బహిరంగంగా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎన్నికలను బహిష్కరించాలన్న పిలుపుల వరకు పరిస్థితి వెళ్లడం కూడా ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆందోళన కలిగించే పరిణామమే. ఇవన్నీ ఆరోపణలు, రాజకీయ అభిప్రాయాలు మాత్రమే కావచ్చు. వాటి తుది నిజానిజాలు నిర్ధారించాల్సి ఉంటుంది. కానీ ఒక రాజ్యాంగ సంస్థ చుట్టూ ఇంతటి స్థాయిలో విశ్వసనీయతపై చర్చ మొదలవడం మాత్రం విస్మరించలేని వాస్తవం.

ఎన్నికల సంఘం తన నిర్ణయాలు చట్టబద్ధమైన విధానంలోనే జరిగాయని, తుది నిర్ణయాల్లో ఏకాభిప్రాయం ఉందని చెబుతోంది. ఆ వివరణకు కూడా ప్రాధాన్యం ఉంది. అయితే సంస్థ తనను తాను సమర్థించుకోవడం ఒక్కటే ప్రజల్లో ఏర్పడిన అనుమానాలను పూర్తిగా తొలగించకపోవచ్చు. ఎందుకంటే ఎన్నికల సంఘం విశ్వసనీయత విషయంలో ప్రజలకు కనిపించేది కేవలం తుది నిర్ణయం కాదు.. ఆ నిర్ణయానికి దారితీసిన ప్రక్రియ కూడా. ఆ ప్రక్రియపై సందేహాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయడం మరింత ముఖ్యమవుతుంది.

ఇక్కడే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ నైతిక బాధ్యత ప్రశ్న ముందుకు వస్తుంది. రాజ్యాంగ పదవి అంటే కేవలం చట్టపరమైన అధికారాన్ని అనుభవించడం కాదు. ఆ పదవిపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసాన్ని నిలబెట్టడం కూడా బాధ్యతే. ఒకవేళ తన నాయకత్వంపై విస్తృతమైన రాజకీయ విమర్శలు కొనసాగుతూ, సహచర కమిషనర్ల అభ్యంతరాలపై చర్చ జరుగుతూ, విపక్షాలు అభిశంసనకు డిమాండ్ చేస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజా చర్చ తీవ్రతరం అవుతున్న పరిస్థితి ఏర్పడితే.. ఆ పదవిలో కొనసాగడమే ఏకైక మార్గమని భావించాల్సిన అవసరం లేదు.

అలాంటి సమయంలో రాజీనామా బలహీనతకు సంకేతం కాదు. అది నైతిక బాధ్యతకు సంకేతంగా నిలవవచ్చు. తన వ్యక్తిగత పదవిని కాపాడుకోవడం కంటే సంస్థ ప్రతిష్ఠను ముందుకు పెట్టడం రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తికి ఉన్నతమైన సంప్రదాయంగా నిలుస్తుంది. ఆరోపణలు నిజమని అంగీకరించినట్లుగా కాకుండా, ఎన్నికల సంఘంపై ఏర్పడిన అనుమానాలకు తాను కారణంగా మారకూడదన్న నైతిక సందేశంతో పదవి నుంచి తప్పుకోవచ్చు. అవసరమైతే తనపై వచ్చిన ప్రతి ఆరోపణపై స్వతంత్ర విచారణ జరగడానికి కూడా మార్గం సుగమం చేయవచ్చు.

అంతేకాదు, రాజీనామా ద్వారా ఎన్నికల సంఘంపై రాజకీయ ఒత్తిడి పెంచాలన్న ఉద్దేశం ఉండాల్సిన అవసరం లేదు. దీనికి విరుద్ధంగా, సంస్థను వ్యక్తిగత వివాదం నుంచి బయటకు తీసుకురావడానికి అది ఒక మార్గంగా మారవచ్చు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పదవిలో కొనసాగుతున్నంతకాలం ఆయనపై వస్తున్న ప్రతి విమర్శ ఎన్నికల సంఘం నిర్ణయాలతో ముడిపడే అవకాశం ఉంది. కానీ ఆయన స్వచ్ఛందంగా తప్పుకుని, ఆరోపణలు--అభ్యంతరాలపై పారదర్శకమైన పరిశీలనకు అవకాశం కల్పిస్తే, సంస్థను వ్యక్తి నుంచి వేరు చేసి చూడగల పరిస్థితి ఏర్పడుతుంది.

రాజ్యాంగ సంస్థల గౌరవం కేవలం వాటికి రాజ్యాంగం ఇచ్చిన అధికారాలతో నిలబడదు. ఆ అధికారాలను వినియోగించే వ్యక్తుల నైతిక విశ్వసనీయతతో కూడా నిలబడుతుంది. ఎన్నికల సంఘంపై విశ్వాసం కోల్పోవడం ఎంత ప్రమాదకరమో తెలిసిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, తన పదవిని కాపాడుకోవడం కంటే ఎన్నికల సంఘం ప్రతిష్ఠను కాపాడటానికే ప్రాధాన్యం ఇస్తే అది ప్రజాస్వామ్యానికి ఒక బలమైన సందేశం అవుతుంది.

అయితే రాజీనామా డిమాండ్‌ను కేవలం రాజకీయ ఒత్తిడికి లొంగిపోవడంగా చూడకూడదు. రాజీనామా అంటే ఆరోపణలు నిజమని తీర్పు ఇవ్వడం కూడా కాదు. అది ఒక నైతిక నిర్ణయం. ఒక వ్యక్తి తనపై ఏర్పడిన వివాదం కారణంగా సంస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతినకూడదని భావించి స్వచ్ఛందంగా పక్కకు తప్పుకోవడం రాజ్యాంగ పదవుల విషయంలో అసాధారణమైన విషయమేమీ కాదు. ముఖ్యంగా ఎన్నికల సంఘం వంటి సంస్థ విషయంలో వ్యక్తి పదవిలో కొనసాగడం కంటే సంస్థపై ప్రజల విశ్వాసం నిలవడం అత్యంత ముఖ్యమైనది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఫలితాలపై రాజకీయ పార్టీలు విభేదించవచ్చు. ఎన్నికల నిర్ణయాలపై విమర్శలు చేయవచ్చు. కానీ ఎన్నికలను నిర్వహించే సంస్థపైనే విశ్వాసం కోల్పోయే పరిస్థితి ఏర్పడితే మాత్రం దాన్ని సాధారణ రాజకీయ వివాదంగా పరిగణించలేం. ప్రస్తుతం వినిపిస్తున్న ఆరోపణలు, అభ్యంతరాలు, రాజకీయ డిమాండ్లు అన్నింటి నిజానిజాలు తేలాల్సి ఉన్నప్పటికీ, ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ఏర్పడుతున్న చర్చను మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిందే.

అందుకే జ్ఞానేష్ కుమార్ ముందున్న ప్రశ్న కేవలం తన పదవిని కొనసాగించాలా వద్దా అన్నది కాదు. తన పదవిలో కొనసాగడం ద్వారా ఎన్నికల సంఘంపై ఏర్పడుతున్న రాజకీయ, ప్రజా అనుమానాలు మరింత కొనసాగుతాయా? లేక స్వచ్ఛందంగా తప్పుకోవడం ద్వారా సంస్థకు కొత్తగా విశ్వాసాన్ని నిర్మించుకునే అవకాశం కల్పించాలా? అన్నదే అసలు ప్రశ్న. ఈ నేపథ్యంలో వ్యక్తిగత పదవి కంటే ఎన్నికల సంఘం ప్రతిష్ఠను, తన కొనసాగింపుకంటే ప్రజల విశ్వాసాన్ని ప్రాధాన్యంగా పరిగణించి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయడం సముచితమైన నైతిక నిర్ణయంగా నిలుస్తుంది.

ఎన్నికల సంఘం ఎవరి వ్యక్తిగత సంస్థ కాదు. అది 140 కోట్లకు పైగా భారత ప్రజల ప్రజాస్వామ్య హక్కులకు కాపలాదారు. ఆ సంస్థపై ప్రజల విశ్వాసం చెక్కుచెదరకుండా ఉండటమే అత్యున్నత లక్ష్యం. ఒక వ్యక్తి పదవిలో కొనసాగడం కంటే ఒక రాజ్యాంగ సంస్థ ప్రతిష్ఠ కాపాడబడటం ఎంతో గొప్పది. అందుకే ప్రస్తుత పరిస్థితుల్లో జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి, ఎన్నికల సంఘానికి తనను తాను రాజకీయ వివాదం నుంచి వేరు చేసుకునే అవకాశం కల్పించడం.. ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించే దిశగా ఒక కీలకమైన అడుగుగా నిలుస్తుంది. పదవి కోసం పట్టుబట్టడం కంటే సంస్థ కోసం తప్పుకోవడమే కొన్నిసార్లు రాజ్యాంగ పదవికి నిజమైన గౌరవం.

# మోదీ హయాంలో దిగజారిన ఎన్నికల సంఘం ప్రతిష్ట

*భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికల సంఘం (ఈసీఐ) విశ్వసనీయత అత్యంత కీలకం. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి; అధికార పక్షాలు మారుతాయి; కానీ ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న నమ్మకం మాత్రం ప్రజాస్వామ్యానికి పునాది. 2014 తర్వాత భారత ఎన్నికల సంఘంపై రాజకీయ పార్టీలు, మాజీ ఎన్నికల అధికారులు, న్యాయ నిపుణులు, పౌరసమాజ సంస్థలు, మీడియా వర్గాల నుంచి వరుసగా వ్యక్తమైన విమర్శలను ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని చూడాలి. ఈ విమర్శలు ఎన్నికల సంఘం నిర్ణయాలపై అనుమానాలు పెరుగుతున్నాయన్నది మాత్రం విస్మరించలేని వాస్తవం.*



2019 లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఈసీఐ అంతర్గత విభేదాలు దేశవ్యాప్తంగా చర్చకు వచ్చాయి. అప్పటి ఎన్నికల కమిషనర్ అశోక్ లావాసా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అప్పటి బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్న ఫిర్యాదులపై ఇచ్చిన మెజారిటీ నిర్ణయాలకు భిన్నంగా అభిప్రాయాలు నమోదు చేశారు. ఐదు సందర్భాల్లో ఆయన అభ్యంతరాలు వ్యక్తం చేయగా, వాటిలో నాలుగు మోదీకి సంబంధించినవని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది. అనంతరం ఆయన అసమ్మతి అభిప్రాయాలను తుది ఆదేశాల్లో ఎలా నమోదు చేయాలన్నదానిపై కూడా కమిషన్‌లో విభేదాలు తలెత్తాయి.

ఇది ఒక వ్యక్తి అభిప్రాయ భేదంగా కొట్టిపారేయవచ్చు. కానీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై చర్య తీసుకోవడంలో ఆలస్యం జరిగితే ఎన్నికల సమయంలో దాని ప్రభావం తిరిగి సరిదిద్దలేనిదిగా మారుతుందని లావాసా అప్పట్లో చెప్పడం గమనార్హం. 2024 ఎన్నికల సమయంలో కూడా ప్రతిపక్షాలు ప్రధానమంత్రి ప్రసంగాలపై చేసిన ఫిర్యాదులపై ఈసీఐ తగినంత వేగంగా స్పందించలేదని ఆరోపించాయి. రాయిటర్స్ నివేదిక ప్రకారం, కాంగ్రెస్ పది ఫిర్యాదులను ప్రస్తావిస్తూ చర్యల్లో ఆలస్యం ఎన్నికల సంఘం విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని పేర్కొంది. మాజీ ఎన్నికల కమిషనర్ ఎస్.వై. ఖురేషీ కూడా ఫిర్యాదులపై త్వరిత నిర్ణయం అవసరమని అభిప్రాయపడ్డారు.

ఎన్నికల నిధుల విషయంలోనూ ఒక ముఖ్యమైన మలుపు కనిపించింది. ఎలక్టోరల్ బాండ్ల పథకానికి సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై ఎన్నికల సంఘం గతంలో పారదర్శకత తగ్గుతుందన్న ఆందోళనలు వ్యక్తం చేసింది. 2019లో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కూడా బాండ్లపై తన అభ్యంతరాలను ఈసీఐ పునరుద్ఘాటించింది. అయితే, ఎన్నికల వ్యవస్థలో ఈసీఐ అభిప్రాయం ఒకటి కాగా తుది చట్టపరమైన నిర్ణయం పార్లమెంట్, న్యాయవ్యవస్థ పరిధిలో ఉంటుంది. అందువల్ల దీనిని నేరుగా ఏదైనా రాజకీయ పక్షపాతానికి సాక్ష్యంగా కాకుండా, ఎన్నికల పారదర్శకతపై సంస్థలోనే వ్యక్తమైన ఆందోళనగా చూడాలి.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటర్ల జాబితాలు, ఓటింగ్ శాతం వంటి అంశాలు కూడా ఎన్నికల సంఘంపై ప్రజా అనుమానాలను పెంచాయి. ఈసీఐ మాత్రం ఈవీఎంలకు సాంకేతిక, పరిపాలనా రక్షణలు ఉన్నాయని, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అనేక దశల్లో తనిఖీలు జరుగుతున్నాయని స్పష్టం చేస్తోంది. సుప్రీంకోర్టు కూడా ప్రస్తుతం అమలులో ఉన్న వీవీప్యాట్ ధృవీకరణ విధానాన్ని మార్చాలని ఆదేశించలేదు. కాబట్టి ఈవీఎంలపై వచ్చిన ప్రతి ఆరోపణను నిజమని చెప్పడం ఎంత తప్పో, ప్రజల్లో ఉన్న ప్రతి సందేహాన్ని కేవలం అపోహగా కొట్టివేయడం కూడా అంతే ప్రమాదకరం. పారదర్శకత పెంచడమే సరైన మార్గం. 2024లో బూత్ స్థాయి ఓటింగ్ డేటా, ఫారం 17సీ వంటి వివరాలను త్వరగా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్న డిమాండ్ కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు అప్పట్లో ఎన్నికల మధ్యలో కోరిన తాత్కాలిక ఆదేశాన్ని ఇవ్వలేదు. అయినప్పటికీ, ప్రజాస్వామ్యంలో "సమాచారం ఎందుకు దాచాలి?" అనే ప్రశ్నకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఎప్పటికీ ఉంటుంది.

ఇప్పుడు 2026లో పరిస్థితి మరింత తీవ్రమైన మలుపు తీసుకుంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 24న ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో తీసుకున్న చర్యలపై లిఖితపూర్వక అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఫారం-6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణ, సాఫ్ట్‌వేర్ నియంత్రణ వంటి అంశాలే ఈ అభ్యంతరాలకు కేంద్రంగా ఉన్నాయని ఆ కథనం తెలిపింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని చర్యలను "అనధికారికం", "చట్టవిరుద్ధం"గా పేర్కొన్నట్లు కూడా నివేదించింది.

ఇక్కడ అత్యంత తీవ్రమైన అంశం ఓటర్ల జాబితా. ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన (ఎస్ఐఆర్) (సర్) ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో డ్రాఫ్ట్ జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. ఇది తుది తొలగింపుల సంఖ్య అని భావించకూడదు; అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, పునఃపరిశీలనల తర్వాత సంఖ్య మారవచ్చు. కానీ ఇంత భారీ స్థాయిలో పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి బయటకు రావడం వల్ల ప్రతి అర్హుడికి తన పేరు తిరిగి చేర్చుకునే సరళమైన, సమయపూర్వక అవకాశాన్ని కల్పించడం అత్యవసరం.

అంతకంటే ఆందోళన కలిగించేది సంస్థలోని అంతర్గత పారదర్శకత. ఇద్దరు కమిషనర్లు తమ అభ్యంతరాలను ప్రధాన ఎన్నికల కమిషనర్‌కే కాకుండా కేబినెట్ కార్యదర్శికి కూడా తెలియజేశారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తెలిపింది. మరోవైపు ఎన్నికల సంఘం అన్ని నిర్ణయాలు ఏకగ్రీవంగానే జరిగాయని పేర్కొన్నట్లు ఇతర వార్తలు వచ్చాయి. ఈ రెండు వాదనల మధ్య నిజానిజాలను ప్రజలకు పూర్తిగా వివరించడం ఇప్పుడు ఈసీఐ బాధ్యత.

సంస్థపై అనుమానాలు పెరగడానికి మరో మూలకారణం నియామకాల విధానం. 2023 చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రివర్గం నుంచి నామినేట్ అయ్యే ఒక మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత ఉంటారు. సుప్రీంకోర్టు 2023లో తాత్కాలికంగా నిర్దేశించిన ప్రధానమంత్రి–ప్రతిపక్ష నేత–ప్రధాన న్యాయమూర్తి విధానంలో ఉన్న చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా స్థానాన్ని కొత్త చట్టం తొలగించింది. ఈ విధానాన్ని సవాలు చేసిన పిటిషన్లు ప్రస్తుతం న్యాయపరిశీలనలో ఉన్నాయి.

ఇక్కడ సమస్య మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా ఎవరు ఉన్నారనే రాజకీయ ఆరోపణ కంటే పెద్దది. ఎన్నికల సంఘం స్వతంత్రంగా కనిపించడమే కాదు, స్వతంత్రంగా పనిచేస్తోందని ప్రజలకు నమ్మకం కలగాలి. అదే సంస్థకు ప్రాణవాయువు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలన్నీ నిజమని నిర్ణయించడం ఎంత తొందరపాటు అయితే, వాటిని కేవలం రాజకీయ ఆరోపణలుగా మాత్రమే కొట్టివేయడం కూడా అంతే ప్రమాదకరం.

కాబట్టి కేంద్ర ప్రభుత్వం తక్షణం ఎన్నికల కమిషనర్ల నియామక విధానంపై విస్తృత పార్లమెంటరీ చర్చకు సిద్ధపడాలి. ఎంపిక ప్రక్రియలో ప్రభుత్వానికి ఉన్న ఆధిపత్యంపై ఉన్న అభ్యంతరాలను తొలగించే విధంగా విస్తృత ఏకాభిప్రాయం సాధించాలి. ఎన్నికల సంఘానికి ఆర్థిక, పరిపాలనా స్వయం ప్రతిపత్తిని మరింత బలపరచాలి.

ఎన్నికల సంఘం కూడా తక్షణం కొన్ని చర్యలు చేపట్టాలి. కమిషనర్ల మధ్య నమోదైన అభ్యంతరాలు, నిర్ణయ ప్రక్రియ, ఓటర్ల జాబితా మార్పులు, డేటా నిర్వహణ, సాఫ్ట్‌వేర్ మార్పులపై సాధ్యమైనంత సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ఎస్ఐఆర్‌లో తొలగించబడిన ప్రతి పేరుకు కారణం, పునరుద్ధరణకు విధానం, అప్పీల్‌కు గడువు స్పష్టంగా ప్రకటించాలి. ఎన్నికలకు ముందు భారీ స్థాయిలో పేర్లు తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడితే, స్వతంత్ర ఆడిట్ నిర్వహించాలి. అదేవిధంగా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులకు నిర్ణీత కాలపరిమితి పెట్టాలి. ఈవీఎం, వీవీప్యాట్, ఓటింగ్ శాతం, ఫారం-17సీ వంటి అంశాల్లో ప్రజల సందేహాలను "తప్పుడు ప్రచారం"గా మాత్రమే కాకుండా, సాధ్యమైన చోట స్వతంత్ర నిపుణుల ఆడిట్ ద్వారా పరిష్కరించాలి.

ఎన్నికల సంఘం ప్రతిష్టను పునరుద్ధరించడానికి ప్రధాన ఔషధం ప్రచారం కాదు–పారదర్శకత, సమాధానదాయకత, సంస్థాగత స్వాతంత్ర్యం. 2019లో లావాసా అసమ్మతి నుంచి 2024లో ఫిర్యాదులపై ఆలస్యాల వివాదం, 2026లో ఇద్దరు కమిషనర్ల 14 అభ్యంతరాల వరకు వచ్చిన పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి: ఎన్నికల సంఘంపై ప్రజల నమ్మకాన్ని పునర్నిర్మించడం ఇక కేవలం ఎన్నికల సంఘం బాధ్యత కాదు; కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్, న్యాయవ్యవస్థ, రాజకీయ పార్టీలు, మీడియా, పౌరసమాజం–అందరి ఉమ్మడి బాధ్యత. ఎందుకంటే ఎన్నికల సంఘంపై నమ్మకం కోల్పోతే ఓటు విలువపైనే అనుమానం మొదలవుతుంది. ప్రజాస్వామ్యానికి అంతకంటే ప్రమాదకరమైన పరిణామం మరొకటి ఉండదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# ప్రతిపక్షమంటే ప్రజా పక్షమే!

*'అమ్మకు చదువొస్తే, అందరికీ వచ్చినట్లే' అనే సూక్తి ఎంత నిజమో.. 'ప్రతిపక్షం బాగుంటే, ప్రజలు బాగుంటారు' అన్నది కూడా అంతే నిజం! ముఖ్యంగా పార్లమెంటరీ వ్యవస్థలో, ప్రతిపక్ష పార్టీలు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే, ప్రభుత్వ పాలన కూడా, పారదర్శకంగా ఉండే అవకాశం ఉంటుంది. ఎందుకంటే రాచరిక వ్యవస్థ నుండి నేటి ప్రజాస్వామ్య పాలన వరకు కూడా, రాజులైనా నేటి పాలకులైనా తమంతట తాముగా ప్రజల కోసం చేసింది ఏమీ లేదు! అక్కడక్కడ ఏవైనా అడగకుండానే కొన్ని సౌకర్యాలు కల్పించారు అంటే, అది కచ్చితంగా వారి స్వప్రయోజనాలు అందులో ఇమిడి ఉన్నాయి అని అర్థం! ఏదిఏమైనా, ఈరోజు ప్రజలు అనుభవిస్తున్న ప్రతి ప్రభుత్వ సౌకర్యాల వెనుక, ప్రజలు చేసిన పోరాటాలు ఉన్నాయి. అవి ప్రతిపక్ష పార్టీల రూపంలో కావచ్చు. ప్రజా పోరాటాల రూపంలో కావచ్చు. ప్రజలు పాలకులను నిలదీసిన ఫలితంగా కావొచ్చు! 'ఈ విధంగా అనేక రూపాల్లో ప్రశ్నించే ప్రజల ఉద్యమాలే, ప్రతిపక్ష పార్టీల పోరాటాలే.. దేశంలో జరిగిన అభివృద్ధికి ప్రధాన కారణం!'*



అయితే ప్రతిపక్షం అంటే ప్రశ్నించడం కాబట్టి, ప్రశ్నలు ఎక్కడైనా ప్రశ్నలాగా మిగిలిపోకూడదు. ఆ ప్రశ్నకు ఒక సామాజిక ప్రయోజనం ఉండాలి! సమాజం పట్ల, సామాజిక సమస్యల పట్ల అవగాహన ఉండాలి. ముఖ్యంగా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలనే సంకల్పం కంటే, ప్రజలకు మేలు జరిగే పనులు సాధించుకోవాలనే పట్టుదల ఉండాలి. ఇక వ్యక్తులను ప్రశ్నించేటప్పుడు ఆ ప్రశ్నల్లో సహేతుకత, శాస్త్రీయత, సామాజిక స్పృహ ఉండాలి. అంతేగాని ఆ వ్యక్తుల వ్యక్తిత్వం మీద దాడిచేసే విధంగా, వారిని అగౌరపరిచే విధంగా ఉండకూడదు. గ్రామ పంచాయతీ నుండి అసెంబ్లీ పార్లమెంట్ వరకు కూడా, సర్పంచ్ మొదలుకొని మంత్రుల వరకు కూడా.. వాళ్ల పాలనలో ఏదైనా ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడు, వాళ్ళను అభినందించాలి. అదే సమయంలో ప్రజలకు నష్టం కలిగే పనులు చేసినప్పుడు, కచ్చితంగా వారిని ప్రశ్నించాలి. అంతేకానీ మనకు వ్యతిరేక పార్టీ కాబట్టి, అతను ఏ మంచి పని చేసినా మనం వ్యతిరేకించాలి, అనే అప్రజాస్వామిక ధోరణి ఉండకూడదు! ప్రజల కోసం మంచి పనులు చేయడం పాలకుల విధి కదా. అలాంటప్పుడు వాళ్ళని ఎందుకు అభినందించాలి? అని కొందరు అనుకోవచ్చు. ఎందుకంటే, మన అభినందన వాళ్లకి ప్రోత్సాహాన్నిస్తుంది. అప్పుడు వాళ్లు ప్రజలకు, మరిన్ని ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడానికి ఉపయోగపడుతుంది కాబట్టి! ఇక ఎన్నికల వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రతిపక్ష పార్టీల పాత్ర మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది! సంపన్నులు, బడా పెట్టుబడిదారులు రాజకీయాల్లోకి వచ్చి, వారి అక్రమ సంపాదన అంతా పెట్టుబడిగా ఎన్నికల్లో ఖర్చుపెట్టి, అధికారాన్ని కైవసం చేసుకుంటున్నారు. ఈ పరిణామాల ఫలితంగా కొన్ని గ్రామాల్లో, ప్రతిపక్ష పార్టీల మెంబర్లు లేని 'గ్రామపంచాయతీ వ్యవస్థ' నెలకొని ఉంది! ఇలాంటప్పుడు ఆ గ్రామ పరిస్థితి ఎట్లా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! గ్రామ అభివృద్ధి పనులకు సంబంధించిన విధానం, ఎంత ఒంటెద్దు పోకడతో ఉంటుందో ఆలోచించండి! అక్కడ ఆ సర్పంచ్ ల పాలన, ఎంత నిరంకుశంగా ఉంటుందో ఆలోచించండి! మరి ఇలాంటి పరిస్థితులు ఉన్నచోట, ఆ గ్రామంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు అండగా ఉండాలి. ప్రజలను కలుపుకొని, ప్రధాన ప్రతిపక్షం అవ్వాలి. అప్పుడే ఆ గ్రామ పాలన గాడి తప్పకుండా ఉంటుంది!

అయితే సంపన్నులు కూడా మనుషులే కదా. వారి పాలన ఇట్లా ఎందుకు ఉంటుంది అంటే.. ఈ సంపన్నుల స్వభావంలో, సామాజిక స్పృహ ఉండదు కాబట్టి! వీళ్లలో ఉండేదల్లా స్వార్థం, అందిన కాడికి దోచుకోవడం, కీర్తి కాంక్షలు పెంచుకోవడమే ఉంటుంది. ఎందుకంటే వీళ్లకు ఆకలి, అసమానతలు, వివక్షలు, పేదరికం తెలియవు కాబట్టి! అందుకే ఈ దేశానికి సంపద ఉన్నవాళ్లు కాదు, సామాజిక స్పృహ ఉన్నవాళ్లే, సమాజ పాలకులు కావాలి! అప్పుడే శ్రామిక ప్రజల బతుకులు బాగుపడతాయి! కాబట్టి రాజకీయ రంగంలో అయినా, మరే రంగంలో అయినా, సమాజంలో జీవించే వాళ్ళకి కనీస సామాజిక చైతన్య జ్ఞానం ఉండాల్సిన అవసరం ఉంది. "ఈ సమాజం ఏ దేవుళ్ళతోనో మరెవరితోనో నడవడం లేదు. ఇది కులాలకు మతాలకు అతీతంగా, సకల శ్రామిక ప్రజలు శ్రమలు చేస్తేనే, ఈ సమాజం మనుగడ సాగిస్తోంది. కాబట్టి ఈ సమాజ పురోగతికి కారణమవుతున్న శ్రమజీవుల సంక్షేమానికి, వారి జీవన వికాసానికి మనం కృషి చేయాలి" అని తెలియజెప్పే జ్ఞానమే సామాజిక జ్ఞానం! ఈ జ్ఞానాన్ని ప్రజలు పెంపొందించుకోవాలి. అప్పుడే సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, వివక్షను, ప్రశ్నించే చైతన్యం అలవడుతుంది! తత్ఫలితంగా ప్రభుత్వ వ్యవస్థలు పాలకులు, కొంతైనా పారదర్శకంగా పనిచేయడానికి సాధ్యమవుతుంది. సమాజానికి మేలు జరుగుతుంది!



- ముద్దగౌని సుభాష్
సామాజిక ఉద్యమ రచయిత
ఫోన్: 9000904284

## మామునూరు విమానాశ్రయానికి పాములపర్తి సదాశివరావు పేరు పెట్టాలి

మామునూరులో పునర్నిర్మించనున్న పౌర విమానాశ్రయానికి ఓరుగల్లు వాస్తవ్యుడు, మట్టేవాడకు చెందిన పాములపర్తి సదాశివరావు పేరు పెట్టాలని పాతబోయినపల్లికి చెందిన దండంరాజు రాంచందర్‌రావు కోరారు. నిరాడంబర జీవితం గడిపిన సదాశివరావు చరిత్ర, సాహిత్యం, కళలు, తత్వశాస్త్రం తదితర రంగాలపై విస్తృతంగా రచనలు చేసిన మేధావిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా ఓరుగల్లు, తెలంగాణకు గౌరవం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. పాములపర్తి సదాశివరావు భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు బాల్యస్నేహితుడు, సమకాలికుడని రాంచందర్‌రావు తెలిపారు. ఇద్దరి ఆధ్వర్యంలో వరంగల్ నుంచి 'కాకతీయ' పత్రిక వెలువడిందని, 'జయ-విజయ' కలంపేరుతో సదాశివరావు రచనలు చేశారని పేర్కొన్నారు. 'సందేశం' పత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యుడిగా పనిచేయడంతో పాటు 'విశ్వజ్యోతి', 'ధర్మభూమి' తదితర పత్రికల్లోనూ వ్యాసాలు రాశారని తెలిపారు. 1945లో కాకతీయ కళాసమితిని స్థాపించి కళలు, సాహిత్యం, నాటకాలు, శాస్త్రీయ సంగీతాన్ని ప్రోత్సహించారని వివరించారు. ప్రతి సంవత్సరం త్యాగరాజ మహోత్సవాలను నిర్వహించే వారని తెలిపారు. మార్క్సిజం, ప్రపంచ చరిత్ర, భారతీయ తత్వశాస్త్రం, హిందుస్తానీ, కర్ణాటక సంగీతం, నాటకరంగం తదితర అంశాలపై ఆయన విస్తృతంగా రచనలు చేశారని పేర్కొన్నారు. 1982లో వరంగల్‌లో జరిగిన పోతన పంచశతాబ్ది ఉత్సవాలకు ప్రేరణగా నిలిచారని, పోతన విజ్ఞానపీఠం ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. 1988లో కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన విద్యారణ్య విద్వద్గోష్ఠిలో పాల్గొని విద్యారణ్యుని తత్వంపై పత్రం సమర్పించారని చెప్పారు. ఆయన జ్ఞాపకార్థం కాకతీయ విశ్వవిద్యాలయం ప్రతి సంవత్సరం స్మారకోపన్యాసాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఆజాంజాహి కార్మిక ఉద్యమాల్లోనూ ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని, 1996 ఆగస్టు 26న 76 ఏళ్ల వయసులో మృతి చెందారని పేర్కొన్నారు. పీవీ నరసింహారావు పేరును జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందేలా ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై వంటి మహానగరాల్లోని సంస్థలకు పెట్టే అంశాన్ని పరిశీలించాలని రాంచందర్‌రావు సూచించారు. వరంగల్ విమానాశ్రయానికి పాములపర్తి సదాశివరావు పేరు పెట్టే విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహిత్య, కళారంగ ప్రముఖులు ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

దండంరాజు రాంచందర్ రావు
పాత బోయినపల్లి సికింద్రాబాద్, 9849592958

## ప్రజా హృదయ విజేత

పుట్టింది కొండారెడ్డిపల్లి ఐనా
పెరిగింది ప్రజా సమస్యల్లోనే..
ప్రజల కోసం
నిలబడిన మహానేతకు
అరుదైన గౌరవం
లభించిన వేళ.. జేజేలు!!
పేదల గుండెల్లో
గుడికట్టుకున్న నాయకుడా
ప్రజా బలాన్నే నమ్ముకుని
సాగుతున్న సైనికుడా
పాలనలోనైనా,
ప్రజా పోరాటంలోనైనా,
నీ అడుగుజాడలే
రేపటి ప్రగతికి బాటలు.
సామాన్య ప్రజల సంక్షేమానికి
కష్టాల్లో తోడై, కన్నీళ్లలో
నీడై నిలిచినందుకు,
ప్రజల గుండెల్లో మీ స్థానం
నిరంతరం భద్రం.
మాటల్లో వాడి, చేతల్లో వేగం
చూపిన నేతవు,
తెలంగాణ ప్రజల హృదయాల్లో
నీవే చిరస్మరణీయుడవు!
మాట తప్పని మీ మంచితనం
మడమ తిప్పని ఆ ధైర్యం
కిందనుండి పైకేదిగిన నాయకుడా
కాలం కరిగిపోయినా
కరిగిపోదు నీ జ్ఞాపకం,
తెలంగాణా ప్రజల హృదయాల్లో
నీవే చిరస్మరణీయుడవు !!
రైతన్న మోములో
చిరునవ్వులు పూయించిన,
జనరంజక పాలనకు
నువ్వే కదా చిరునామా!
దశాబ్దాల నిర్లక్ష్యపు నీడల్లో
మగ్గిన మూసీ నదికి
రాజకీయాల మురికిని దాటుకుంటూ,
దూరదృష్టిగల నాయకుడివై
నిజమైన ప్రక్షాళనకు
జీవం పోయగ కదిలిన
అపర భగీరథుడివి నువ్వు!
భూకబ్జాలను ఒకటొకటిగా
విడుదల చేసి
ఎన్ని అడ్డంకులెన్నిదురైనా
అడుగు వెనక్కి వేయని,
నీ సంకల్పం సాహసోపేతం!
పేదల ఇళ్లకు భరోసానిస్తూ,
నగరానికి సరికొత్త సొగసును తెస్తూ,
నీడలా వెన్నంటిన జననేతవు
మా గుండెల్లో చెరిగిపోని భరోసావు.
వినూత్న కార్యక్రమాల నేతకు
జేజేలు, శుభాకాంక్షలు
ఎవ్వరి దిష్టి సోకకుండా చల్లగా ఉండాలని
కోరుకుంటూ...
**(ప్రతిష్టాత్మక ఆర్యదాన్ మహమ్మద్ -2026 అవార్డు అందుకుంటున్న వేళ శుభాకాంక్షలతో )**

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

## యాభై ఏళ్ల విమలక్క ప్రస్థానం విజయవంతం చేయాలి



**కొడంగల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కొడంగల్ అంబేద్కర్ కూడలిలో 'యాభై ఏళ్ల విమలక్క ప్రస్థానం' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్, రిటైర్డ్ ఉపాధ్యాయులు కేశవులు మాట్లాడుతూ.. ప్రజా ఉద్యమాల్లో పాట, ఆట, మాటలతో ప్రజలను చైతన్యపరిచిన విమలక్క 50 ఏళ్ల ప్రస్థానాన్ని స్మరించుకుంటూ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో సెప్టెంబర్ 26, 27, 28 తేదీల్లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జోగిని వ్యవస్థ నిర్మూలన, పౌర హక్కులు, మహిళా హక్కులు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విమలక్క చేసిన పోరాటాలను వారు గుర్తుచేశారు.
ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు చెవిటి శ్రీనివాస్, లక్ష్మప్ప, చంద్రయ్య, రాములు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లకు సుమారు 60 శాతం నోటీసులు

- వికారాబాద్ జిల్లాలో ఓటర్లకు 72 శాతం నోటీసుల పంపిణీ
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**తాండూరు, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్క పౌరుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గం లో పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. (సర్ ప్రత్యేక సమగ్ర సవరణ) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారుల పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాండూర్ పట్టణంలోని పాత మున్సిపాలిటీ, ఎంపీటీ హాల్, గౌతాపూర్ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సీఈవో సందర్శించారు. ఆయా కేంద్రాల్లో బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటరు నమోదు, నోటీసుల పంపిణీ, ధ్రువీకరణ పత్రాల స్వీకరణ తదితర ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా సి ఇ ఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లకు సంబంధించి సుమారు 60 శాతం



నోటీసులు అందజేసినట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం 72 శాతం నోటీసుల పంపిణీ పూర్తయినట్లు వెల్లడించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు.. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం అవసరమైన సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా ఉందని సీఈవో వివరించారు. అలాగే ఆయా ప్రాంతాల్లోని బీఎల్‌వోల సహకారంతో కూడా ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే అందించిన నోటీసులపై క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.. బీఎల్‌వోలు విధులను ఎలా నిర్వహిస్తున్నారు.. ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలను తెలుసుకునేందుకే ఈ పరిశీలన చేపట్టినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన సందర్భంగా అధికారులు, బీఎల్‌వోల నుంచి ప్రక్రియకు సంబంధించిన వివరాలను సీఈవో అడిగి తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ముందుగా తాండూర్ ఆర్ డి ఓ కార్యాలయం లో తహసీల్దార్ లు, ఎం పి డి ఓ లతో ఏర్పాటు చేసిన సమావేశం లో మాట్లాడారు. మండలం వారీగా ఇప్పటి వరకు ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నవని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు ప్, ఆర్డీఓ అనిత, తహసీల్దార్ తారా సింగ్, డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు రాజ్యాధికారం రావాలి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**ధారూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** బీసీలకు రాజ్యాధికారం దక్కాలి. సామాజిక న్యాయం, రాజకీయ హక్కులు కల్పించాలి. అధికారంలో బీసీలకు తగిన భాగస్వామ్యం ఉండాలి. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు అసెంబ్లీలో సముచిత ప్రాతినిధ్యం లభించాలి. అంటూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గళమెత్తారు. బీసీల రాజకీయ భాగస్వామ్యాన్ని ప్రధాన అంశంగా చేసుకుని చేపట్టిన పాదయాత్ర ధారూర్ మండల కేంద్రంలో కొనసాగింది. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమైన మల్లన్న. వారి జీవన పరిస్థితులు, వృత్తులు, సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పాదయాత్రలో భాగంగా మండల కేంద్రంలోని ఓ హోటల్‌కు వెళ్లిన ఆయన అక్కడ పూరీలు తయారు చేసి స్థానికులను ఆకట్టుకున్నారు. అనంతరం పోటరి మహేష్ కిరాణా దుకాణాన్ని సందర్శించి జొన్నలు, గోధుమలు, పెసర్లు, రాగులు, సైదలు, పసుపు, బియ్యం తదితర ఆహార పదార్థాలను పరిశీలించారు. సంప్రదాయ ఆహార పదార్థాల వినియోగంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. అక్కడి నుంచి బార్బర్ షాప్‌కు వెళ్లిన మల్లన్న. కటింగ్, షేవింగ్ ధరలు ఎంత, విద్యుత్ బిల్లుల పరిస్థితి ఎలా ఉందంటూ షాప్ యజమాని అనంతయ్యను ప్రశ్నించారు. బార్బర్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతోందా అని ఆరా తీయగా, తమకు ఉచిత విద్యుత్ అందడం లేదని, ప్రతి నెల సుమారు రూ.200 విద్యుత్ బిల్లు వస్తోందని అనంతయ్య తెలిపినట్లు మల్లన్న చెప్పారు. అనంతరం నాయిని బ్రాహ్మణ కుటుంబాల సంఖ్య, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న మల్లన్న. నాయిని బ్రాహ్మణులకు ప్రభుత్వం తగిన న్యాయం చేయడం లేదని ఆరోపించారు.



బీసీలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించడమే తన పాదయాత్ర ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ధారూర్ మండల కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మన్నాన్పల్లి, మంబాపూర్, కందనెల్లి మీదుగా తాండూరు వైపు కొనసాగింది. రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం, అధికారంలో భాగస్వామ్యం అనే అంశాలతో సాగిన మల్లన్న పాదయాత్రలో స్థానిక సమస్యలపై ఆయన నేరుగా ప్రజలతో మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది.

## రేడియల్ రోడ్డు బాధిత రైతులకు న్యాయం చేయాలి



**షాబాద్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** వ్యవసాయాన్ని నమ్ముకొని జీవిస్తున్న రైతులకు అన్యాయం జరగొద్దని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. రీ సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని శుక్రవారం మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ...రేడియల్ రోడ్డు కోసం భూముల సేకరణలో భాగంగా రైతుల భూముల కొలతలు, సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంకేపల్లిగూడ గ్రామ పరిధిలో భూములను సమగ్రంగా రీ-సర్వే చేయించాలని కోరారు. రైతులకు నష్టం కలగకుండా క్షుణ్ణంగా పరిశీలించి రీ-సర్వే నిర్వహించాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి ని కోరారు. రైతుల సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పార్టీ సర్పంచులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, సంకేపల్లిగూడ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ఎన్నికల కమిషనర్ వెంటనే రాజీనామా చేయాలి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు డిమాండ్ చేశారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వానికి తొత్తుగా మారిన సీఈసీ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, సీఈసీ తీరుకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ సీఈసీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో సీఈసీ పనిచేస్తూ స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను విస్మరించిన జ్ఞానేశ్ కుమార్ ఆ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, వెంటనే వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మీకాంతరెడ్డి, 'బి' బ్లాక్ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, నాయకులు బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎస్వీ సతీశ్ కుమార్, పిట్టల శ్రీనివాస్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు జీడి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, సత్యమూర్తి, యూసుఫ్ భాయ్, పిట్టల నాగరాజు, రాఘవన్, శ్రీకాంత్ ముదిరాజ్, వినోద్ యాదవ్, నాయకురాళ్లు లక్ష్మి, ఇందిరా ప్రియదర్శిని, ప్రభ, ఆశ, శారద, పుష్పలత, కనకలక్ష్మి, నాయకులు సత్యనారాయణ, ఫరీద్, సయ్యద్ మబ్బు, ఫరూక్, సురేశ్ సింగ్, కన్నెమల్ల నాగరాజు, బ్రహ్మయ్య, రామకృష్ణ, వెంకన్న, జీడి చరణ్‌జిత్ గౌడ్, చుంకూ శ్రీనివాస్, మంద భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులపై వేగం పెంచాలి

- రీ-సర్వేలో నాణ్యతకు పెద్దపీట
- అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** భూ భారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ వారాంతంలోగా వీలైనన్ని ఎక్కువగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి పెండింగ్ దరఖాస్తులు, రీ-సర్వే పురోగతిని సమీక్షించారు. ప్రతి మండలంలో నిర్దేశించిన గ్రామాల్లో జరుగుతున్న రీ-సర్వే పనులపై తహసీల్దార్లకు పూర్తి అవగాహన ఉండాలని, క్షేత్రస్థాయిలో పనులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. సాదా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏదైనా దరఖాస్తును




తిరస్కరిస్తే అందుకు గల స్పష్టమైన కారణాలను తప్పనిసరిగా తెలియజేయాలని ఆదేశించారు. ప్రజల భూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా పెండింగ్ దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే సోమవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వనపర్తికి రానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా రెవెన్యూ తదితర అంశాలపై జరగనున్న సమీక్షకు అధికారులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరంగాపూర్ రంగనాయక స్వామి ఆలయంలో విగ్రహాల చోరీ

- దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- ఆలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ సునీత రెడ్డి



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు చోరీకి గురయ్యాయి. రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడు విగ్రహాలను మాత్రమ దుండగులు ఎత్తుకెళ్లారని మరియు సీతమ్మ విగ్రహాన్ని అక్కడే వదిలి వెళ్లారు. విగ్రహాలతో పాటు రాములవారి వెండి కిరీటాన్ని కూడా దొంగలించారని అని పూజారులు తెలిపారు. గురువారం ఉదయం పూజారులు ఆలయానికి రాగా విగ్రహాలు కనిపించలేదు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఆమెతో పాటు సిఐ ఓడి రమేష్, ఎస్ఐ వెంకటేష్ గౌడ్, జలంధర్ రెడ్డి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ ఓడి రమేష్ తెలిపారు.

## బోడుప్పల్‌లో చెన్నై షాపింగ్ మాల్ ఫెస్టివల్ సేల్ సందడి

**బోడుప్పల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కేశవనగర్ అక్షయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్ ఫెస్టివల్ సేల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీ నటి ఎబ్బా పటేల్ ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. సినీ నటి చేతుల మీదుగా ప్రారంభం కావడంతో అభిమానులు, సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఎబ్బా పటేల్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి దుస్తుల కలెక్షన్లను పరిశీలించారు.
ఈ ఫెస్టివల్ సేల్ సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ సందర్శకులకు



అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. బోడుప్పల్, కేశవనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# పాలకులు అవలంభిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

- ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ఏఐఎస్ఎఫ్ ధ్యేయం
- ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

**బోడుప్పల్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా 4వ మహాసభలు బోడుప్పల్ సర్కిల్, ఉప్పల్ డిపో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మహాసభల సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేసారు. అనంతరం ఉప్పల్ డిపో వద్ద ఉన్న ది వ్యూ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్వేతా అరుణ పతాకాన్ని (ఏఐఎస్ఎఫ్ జెండా)ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఉమా మహేష్ ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై, విద్యా రంగ




పరిరక్షణ కోసం నిర్వహించిన పోరాటాల చరిత్రను వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన ఉద్యమాలు, విద్యార్థుల హక్కుల సాధనలో సంఘం పోషించిన పాత్రను ఆయన ప్రస్తావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా పుట్ట లక్ష్మణ్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ సౌకర్యాలు, నిరుద్యోగం వంటి అంశాలపై విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి సమస్యలే కాకుండా సామజిక సమస్యలపై, సమాజంలో జరుగుతున్న అక్రమాలపై పోరాడుతుందని అన్నారు. సామజిక, సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అగ్రభాగాన ఉంటుంది అని తెలియజేసారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు, మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.... మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటు కోసం, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవరకు ఏఐఎస్ఎఫ్ గా పోరాటాలు కొనసాగిస్తుందని, ఇందులో పని చేసిన వారు నేడు ఉన్నతమైన స్థానంలో ఉన్నారని, విద్యార్థి సంఘానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నదని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.. ఈ మహాసభల్లో సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చిన్నబాబు, ఎండీ అన్వర్, ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు శ్రీకాంత్, బద్రి, సద్గురు చారి, శివమణి, ప్రణవ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## అతివేగంతో పల్టీ కొట్టిన బొలెరో..!

- గేదె మృతి, పలువురుకి తప్పిన ప్రమాదం

**న్యాల్‌కల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** బులేరో వాహన చోదకుడు అతివేగం, జాగ్రత్తతో.. వేగంగా దూసుకు పోవడంతో ఓ బులెరో వాహనం అదుపుతప్పి ఓ చక్రం ఊడి పల్టీ కొట్టిన సంఘటన న్యాల్ కాల్ మండలం, ఇబ్రహీంపూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా, బాన్సువాడ నుండి టీఎస్ 17, టీ 9327 నెంబర్ గల బులెరో వాహనంలో 5 గేదెలతో జహీరాబాద్



లోని అల్లాన కర్మాగారానికి బయలుదేరింది. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని ఇబ్రహీంపూర్, చినిగేపల్లి గ్రామ కూడలి సమీపంలో వాహనం చక్రం ఒడి పల్టీ కొట్టింది. దీంతో వాహనంలోని ఓ గేదే అక్కడికక్కడే మృతి చెందగా.. వాహనంలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. అనునిత్యం ప్రధానంగా తెల్లవారుజామున, మధ్యాహ్న భోజన సమయంలో పదుల సంఖ్యలో వాహనాలు అతివేగంగా అజాగ్రత్తగా రాకపోకలు సాగిస్తాయని, తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు స్థానికులు వాపోయారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26 సెప్టెంబర్ 2026

# బీఆర్ఎస్ పోరాట ఫలితమే జూరాల నీటి విడుదల

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** జూరాల ప్రాజెక్టు నుంచి రైతాంగానికి నీటిని విడుదల చేయడం బీఆర్ఎస్ పోరాట ఫలితమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ అన్నారు. పంటలు ఎండిపోతూ రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రత్యక్ష పోరాటానికి పిలుపునివ్వడంతోనే ప్రభుత్వం దిగివచ్చి జూరాల నీటి విడుదలకు చర్యలు చేపట్టిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ.. నిరంజన్‌రెడ్డి సూచించిన విధంగా ప్రభుత్వం ముందుగానే కర్ణాటక ప్రభుత్వాన్ని సంప్రదించి ఉంటే రైతులు నష్టపోయే పరిస్థితి ఉండేది కాదని అన్నారు. జూరాల నీటి విడుదల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారానికే పరిమితమవుతోందని, పనులు మాత్రం కనిపించడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి నీటి కేటాయింపులపై చేస్తున్న ప్రకటనలపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. 299 టీఎంసీల



నీరు కేటాయించారని చెప్పడం వాస్తవ పరిస్థితులపై అవగాహన లేమిని సూచిస్తోందని అన్నారు. పరిపాలనా అవసరాల కోసం జారీ చేసే తాత్కాలిక పత్రాలను నీటి కేటాయింపులుగా పేర్కొనడం సరికాదని వారు పేర్కొన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతానికి సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాటాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రైతాంగానికి సాగునీరు అందేలా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

### సాయిచరణ్‌రెడ్డిపై విచారణ జరపాలి

డీఎస్పీ భీమ్‌రెడ్డికి బినామీగా వ్యవహరించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారంటూ వస్తున్న ఆరోపణలపై సాయిచరణ్‌రెడ్డిపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తేవాలని వాకిటి శ్రీధర్ డిమాండ్ చేశారు. మణికొండలోని సాయిచరణ్‌రెడ్డి ఇంట్లో సోదాలు జరిగాయన్న సమాచారంపై ప్రభుత్వం స్పందించి నిజానిజాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఈ సమావేశంలో నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, గంధం పరంజ్యోతి, ఎద్దుల సాయికుమార్, ఎం. రాజశేఖర్, పెద్దింటి వెంకటేష్, నాగన్న యాదవ్, బొబ్బిలి ప్రేమ్‌కుమార్, నీలస్వామి, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## నాగిరెడ్డిగూడెంలో ఉద్యాన శాఖ అధికారుల పర్యటన



**గుమ్మడిదల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** గుమ్మడిదల మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో రైతు సురేందర్‌రెడ్డి పొలంలో నిర్మించిన ఫామ్ పాండ్‌ను జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. సోమేశ్వరరావు, డివిజన్ ఉద్యాన శాఖ అధికారి జి. అనూషారెడ్డి పరిశీలించారు. వర్షపు నీటిని ఫామ్ పాండ్‌లలో నిల్వ చేసుకుని, అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. అనంతరం రైతు సుధాకర్‌రెడ్డి పొలంలో సాగు చేస్తున్న టమాటా పంటను పరిశీలించారు. టమాటా సాగులో చేపట్టిన స్టేకింగ్ పద్ధతిని అధికారులు పరిశీలించి, దాని ప్రయోజనాలను వివరించారు. మొక్కలకు సరైన ఆధారం కల్పించడం ద్వారా పంట నాణ్యత, దిగుబడి మెరుగుపడటంతో పాటు పంటను ఎక్కువ కాలం కొనసాగించవచ్చని తెలిపారు. రైతులు ఉద్యాన శాఖ సూచనలను పాటిస్తూ ఫామ్ పాండ్‌లు, స్టేకింగ్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి తక్కువ నీటితో అధిక, నాణ్యమైన దిగుబడులు సాధించాలని అధికారులు సూచించారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి

- భక్తిశ్రద్ధలతో భవానీ సేవాలాల్ దీక్షలు



**పుల్కల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆల్ఇండియా బంజారా లంబాడ శక్తిపీఠ్ జాతీయ సహకార్యదర్శి విఠల్ మహారాజ్ అన్నారు. విజయదశమి,లలిత్ పంచమిని పురస్కరించుకుని బంజారా గిరిజనులు చేపట్టే 21 రోజుల భవానీ సేవాలాల్ దీక్షలలో భాగంగా శుక్రవారం పుల్కల్ మండలం విట్టల్ నాయక్ తండాలో మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. నాగల్‌గిద్ద మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజు రాథోడ్ ఆధ్వర్యంలో దీక్ష మహారాజులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఠల్ మహారాజ్ మాట్లాడుతూ దీక్ష తీసుకోవడం ద్వారా భక్తిభావం పెంపొందడంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. దీక్షలతో గిరిజనుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం బాలబ్రహ్మచారి జగద్గురు సంత్ తపస్వి రామ్‌రావ్ మహారాజ్ కృషి,ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెంలోని భవానీమాత సేవాలాల్ మహారాజ్ ఆలయంలో దీక్షలు చేపట్టిన వారికి వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.గోవర్ధన్ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, బొమ్మారెడ్డిగూడెం సర్పంచ్ జైపాల్ నాయక్,దీక్ష మహారాజులు దేవిదాస్,శంకర్, ఈశ్వర్,పండరి,బాల్‌సింగ్, సురేందర్,మోహన్,జగదీష్, రాకేష్,సుభాష్, జీవవైవిధ్య పరిరక్షణ కమిటీ సభ్యుడు మూడ్ శివాజీ,జాదవ్ సంతోష్, రవీందర్ నాయక్ కార్బరి,వివిధ తండాల పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ కట్టడికి క్షేత్రస్థాయిలో నిఘా

- డ్రైడేను పకడ్బందీగా నిర్వహించాలి
- ఇందిరమ్మ ఇళ్లలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** డెంగ్యూ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాన్ని నామమాత్రంగా కాకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని రాంనగర్ కాలనీలో డ్రైడే కార్యక్రమం అమలును ఆయన పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు, దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులను పరిశీలించి, అధికారులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పట్టణంలో డెంగ్యూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ పాత్రల్లో నీరు నిల్వ కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పారిశుధ్యం, దోమల నివారణ చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని నాలుగో వార్డులో



నిర్మాణంలో ఉన్న కురుమమ్మ, ఎల్లమ్మకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు, లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులు చేయకుండా లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని సూచించారు. పునాదులను అవసరానికి మించి ఎత్తుగా నిర్మించకుండా, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ పీడీ విఠోభా, కౌన్సిలర్లు పరశురాం, శరవంద, లక్ష్మణ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయ సెస్ త్వరితగతిన వసూలు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** గ్రంథాలయ సెస్ వసూళ్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ రావు ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ సెస్ వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ,మున్సిపల్ అధికారులు ఇంటి పన్నుల్లోని 0.8 శాతం గ్రంథాలయ సెస్‌ను వసూలు చేసి జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఉన్న గ్రంథాలయ సెస్ బకాయిలను త్వరగా వసూలు చేసి, జిల్లా గ్రంథాలయ సంస్థ, జోగులాంబ గద్వాల ఖాతాలో జమ చేయాలని సూచించారు. గ్రంథాలయ సెస్ వసూళ్లలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఎం. మనోజ్ కుమార్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్,మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రబీ కార్యాచరణ ప్రణాళికపై సాంకేతిక సమావేశం



**గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా ఐడిఓసిలోని జిల్లా వ్యవసాయ అధికారి ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప ఆధ్వర్యంలో రబీ కార్యాచరణ ప్రణాళికపై సాంకేతిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిఆర్‌వికె గద్వాల సమన్వయకర్త డా. పి. అర్చన, నీటిపారుదల శాఖ డిఈ శివకృష్ణ, డిహెచ్ఎస్ఓ రాజ్‌కుమార్, కెవికె మదనాపురం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజేందర్ రెడ్డి సంబంధిత అధికారులు హాజరయ్యారు. సమావేశంలో జోగులాంబ గద్వాల జిల్లాలో రబీ పంటల మండలాల వారీగా అంచనా విస్తీర్ణాన్ని ఖరారు చేయడం, జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు అందుబాటులో లేని పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై చర్చించారు. నీటిపారుదల శాఖ డిఈ శివకృష్ణ మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు నుంచి నవంబర్ వరకు వారాబందీ పద్ధతిలో, ప్రతి మూడు రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

# పాఠశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన, తాగునీరు, మరుగుదొడ్లు తదితర వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్, ఇదే విధంగా నిరంతరం పరిశు



భ్రతను కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

## పౌష్టికాహారంతోనే గర్భిణీలకు సంపూర్ణ ఆరోగ్యం

**కోహెడ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** పౌష్టికాహారంతోనే గర్భిణీ, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని, ఐసీడీఎస్ శనిగరం సెక్టార్ సూపర్‌వైజర్ సాయి భవాని అన్నారు. శుక్రవారం మండలంలోని వింజపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ సాయి భవాని మాట్లాడుతూ కిషోర బాలికలు ఎదిగే వయస్సులో శరీరంలో వచ్చే మార్పులకు అనుగుణంగా తృణధాన్యాలైన రాగి, సజ్జలు, జొన్నలు, గోధుమలు, సోయాబీన్, చిక్కుడుకాయలు, కాయగూరలు, ఆకుకూరలు, పాలు, గుడ్డు వంటి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణీ మహిళలకు బిడ్డ ఎదుగుదల



ఆరోగ్యవంతంగా ఉంటుందని, తద్వారా సాధారణ కాన్పు అవుతుందని సూచించారు. గర్భిణీ స్త్రీలకు '1000 గోల్డెన్ డేస్' గురించి అవగాహన కల్పించారు. గర్భిణీ మహిళకు సీమంతం పోషకాహార మాసోత్సవ కార్యక్రమానికి హాజరైన గర్భిణీ మహిళకు గ్రామ సర్పంచ్ అన్నాడి శ్రీజ జీవన్ రెడ్డి, వార్డ్ సభ్యులు, అంగన్వాడీ టీచర్లతో కలిసి కార్యక్రమానికి కావాల్సిన పూలు, పండ్లు, చీరలు, గాజులు ఇచ్చి సాంప్రదాయబద్ధంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కిషోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతకు హ్యాండ్‌మేడ్ జ్యువెలరీ శిక్షణ



**నంగునూరు, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధే లక్ష్యంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ సౌజన్యంతో నంగునూరులో 22 రోజుల 'హ్యాండ్‌మేడ్ జ్యువెలరీ తయారీ' ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ బాలు పోచయ్య, అడిషనల్ డిఆర్డిఓ సుధీర్, డైరెక్టర్ గేము నాయక్ మాట్లాడారు. మార్కెట్‌లో హ్యాండ్‌మేడ్ జ్యువెలరీకి మంచి డిమాండ్ ఉందని, మహిళలు శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంచుకుని ఇంటి నుంచే చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించి కుటుంబానికి ఆసరాగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతినిధి ఎడ్మండ్ భూపతి మాట్లాడుతూ.. 22 రోజుల పాటు థియరీ, ప్రాక్టికల్స్‌తో కూడిన శిక్షణ ఇస్తామని, పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసి స్వయం ఉపాధికి మార్గదర్శకం చేస్తామని తెలిపారు. ఈ శిక్షణ కోసం నంగునూరు ప్రాంతానికి చెందిన 25 మంది మహిళలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, వివో, వివోఏ ప్రతినిధులు, ఎంపికైన మహిళలు పాల్గొన్నారు.

## డిజిటల్ రీ సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో భూ వివాదాల పరిష్కారం, భూ రికార్డుల ఆధునీకరణ లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఉట్కూర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం భూ భారతి' పోర్టల్ ద్వారా సర్వే మ్యాప్‌తో పాటు ప్రత్యేక భూధార్ నంబర్ ఆధారంగా శాశ్వత భూ హక్కుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. మొదటి విడతలో వెంకటాపూర్ రెవెన్యూ గ్రామంలోని 45 సర్వే నంబర్ల పరిధిలో 646.39 ఎకరాల్లో రెవెన్యూ రీ-సర్వే నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులు వాస్తవంగా అనుభవిస్తున్న భూమి విస్తీర్ణం ఆధారంగా సమగ్రంగా సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా గ్రామం మొత్తం సరిహద్దులను (విలేజ్ బౌండరీ) గుర్తించి, అనంతరం గ్రామకంఠం సరిహద్దులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, ప్రభుత్వ భూముల్లో రైతుల వారీగా ఉన్న పొజిషన్, ఆ తర్వాత పట్టా భూముల్లో రైతుల వారీగా సర్వే నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. రీ--సర్వే ప్రక్రియ ప్రారంభానికి ముందు గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని, అనంతరం గ్రామంలో టామ్‌టామ్ ద్వారా సమాచారం అందించి, నిర్ణీత ప్రకారం రీ--సర్వే ప్రక్రియను చేపడతామని తెలిపారు. రైతులు, ప్రజలు రీ-సర్వే ప్రక్రియకు సహకరించి తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో తహసిల్దార్ అశోక్ కుమార్, సర్వేయర్ జయ శంకర్, సర్వేయర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# చిరు వ్యాపారులకు నోటీసులు

- దుకాణాలు తొలగిస్తే కుటుంబాలు రోడ్డున పడతాయంటున్న వ్యాపారులు

**పుల్కల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** సింగూర్‌లో చిరు వ్యాపారులు నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించాలని ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేయడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా నోటీసులు అందజేసినట్లు వ్యాపారులు తెలిపారు. నిర్ణీత గడువులోగా దుకాణాలను తొలగించకపోతే జేసీబీలతో తొలగిస్తామని నోటీసుల్లో పేర్కొన్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. సింగూర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో దుకాణాలను తొలగించే చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారని వ్యాపారులు తెలిపారు. అయితే తమ జీవనోపాధి పూర్తిగా చిన్న దుకాణాలపైనే ఆధారపడి ఉందని, ఒక్కసారిగా దుకాణాలు తొలగిస్తే కుటుంబాలను పోషించుకోవడం కష్టమవుతుందని వాపోయారు. వీరిలో వికలాంగులు నిర్వహిస్తున్న దుకాణాలు కూడా ఉన్నాయని, వాటిని తొలగిస్తే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పేర్కొన్నారు.

### ప్రత్యామ్నాయం చూపించాలి

సింగూర్ ప్రాజెక్టును చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, వారికి తాగునీరు,అల్పాహారం తదితర సౌకర్యాలు కల్పించడంలో చిరు వ్యాపారుల దుకాణాలు ఉపయోగపడుతున్నాయని వ్యాపారులు తెలిపారు. దుకాణాలను తొలగించే ముందు తమకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని కోరారు. రహదారి విస్తరణ అవసరమైతే దుకాణాలను మరింత లోపలికి తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ మేరకు గ్రామపంచాయతీ పాలనాధికారి,సర్పంచ్‌కు చిరు వ్యాపారులంతా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్,రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి దుకాణాల తొలగింపును నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



అనంతరం పుల్కల్ తహసీల్దార్‌ను,సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని వ్యాపారులు పేర్కొన్నారు.

### మంత్రి జోక్యం చేసుకోవాలి

చిరు వ్యాపారుల సమస్యను రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి,ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి దుకాణాల తొలగింపును నిలిపివేయాలని కోరనున్నట్లు వ్యాపారులు తెలిపారు. పేద చిరు వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేయనున్నట్లు వారు తెలియజేశారు.

# కెరమెరిలో సిఆర్టి ఫిజికల్ టీచర్ అదృశ్యం





- మూడు రోజులైనా లభ్యం కానీ ఆచూకీ
- వాగుకు సమీపంలో లభ్యమైన బైక్
- చివరగా కెరమెరి వాగు వద్ద సెల్ ఫోన్ లొకేషన్
- వాగు ప్రవాహంలో గల్లంతైనట్టు అనుమానం

**కెరమెరి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** కెరమెరి మండలం కొత్తగూడ(సాకడ) గ్రామానికి చెందిన సిఆర్టి ఫిజికల్ టీచర్ దుర్వా శ్రీనివాస్ అదృశ్యమై మూడు రోజులు గడుస్తున్నా ఆచూకీ లభ్యం కాలేదు. జోడేఘాట్ లో ఫిజికల్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ బుధవారం పాఠశాలకు సెలవు పెట్టి ఆదిలాబాద్ వెళ్లి వచ్చాడు. బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కెరమెరి లో కనిపించిన తర్వాత ఇంటికి చేరలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**అనుమానంతో వాగులో జల్లెడ..**

బుధవారం రాత్రి సుమారు పది గంటల సమయంలో తన బైకును కెరమెరి వాగుకు సమీపంలో ఉన్న షెడ్డు వద్ద నిలిపినట్టు తెలుస్తోంది. కొత్తగూడ గ్రామానికి వెళ్లాలంటే కెరమెరి అంగడి బజార్ వైపున ఉన్న వాగును దాటి గ్రామానికి చేరుకోవాల్సి ఉంటుంది. దీంతో రాత్రి సమయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కెరమెరి వాగులో గల్లంతయ్యాడేమోననే అనుమానంతో పోలీసులు, కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామస్తులు, గజ ఈతగాళ్లతో కెరమెరి, సాకడ వాగులో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

# పార్టీ మారాలంటూ చైర్‌పర్సన్ భర్త వేధింపులు

- ఆరో వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి ఆరోపణ




**బెల్లంపల్లి, సెప్టెంబర్ 25, (జనంసాక్షి) :** తనను పార్టీ మారాలంటూ అధికార పార్టీ బెల్లంపల్లి మున్సిపల్ ఛైర్పర్సన్ భర్త దావ రమేష్ వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరో వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి ఆరోపించారు. శుక్రవారం ఆమె మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను బిఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్ గా గెలుపొందినా కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆరు నెలలుగా మున్సిపల్ ఛైర్పర్సన్ భర్త దావ రమేష్ ఒత్తిడి తెస్తున్నాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరే ఆసక్తి లేదని స్పష్టం చేసినప్పటికీ ఎన్నో సార్లు ఆయన కౌన్సిల్ సమావేశం జరగనున్న నేపథ్యంలో అధికారులతో కాల్ చేయించడం, బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లతో ఉంటూ నిరసనలు చేయవద్దు, అలా చేస్తే వార్డులో ఏలాంటి అభివృద్ధి చేయనని 7వ వార్డు నుండి కొందరు వ్యక్తులతో చెప్పించి బెదిరిస్తున్నాడని అన్నారు. గత ఆరు నెలలుగా ఆరో వార్డులో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని, చైర్మన్ భర్త దావ రమేష్ తనను వ్యక్తిగతంగా హింసిస్తూ, ఇబ్బంది పెడుతూ, నానా రకాలుగా భయపెడుతున్నడని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కూడా నా పని నేను చేసుకుంటూ వార్డు అభివృద్ధి కోసం మున్సిపల్ కమిషనర్ కు, అధికారులకు ఫోన్ చేసిన పట్టించుకోకపోవడం, కనీసం ఫోన్ కాల్ కూడా లిఫ్ట్ చేయకుండా నన్ను చాలా చిత్ర హింస పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టులో మా వార్డు బొడ్డు లలితను ఆర్పిగా అందరి సమక్షంలో కొత్తగా ఎన్నికైంది. కానీ ఎన్నిక చెల్లదంటూ చైర్పర్సన్ భర్త నా మీద కోపంతో ఆర్పి మీద కక్షతో చైర్మన్, మున్సిపల్ కమిషనర్, మెప్మా అధికారులు, ఆర్పీలు కొందరు కావాలని ఆమెను నానా రకాలుగా హింస పెడుతూ, ఇబ్బంది పెడుతూ, చిత్రహింసలు చేస్తూనే ఉంటారని ఎన్నోసార్లు ఏడుచుకుంటూ చెప్పిందన్నారు. వాటన్నిటిని తట్టుకొని మేము ముందుకు వెళ్తుంటే నేను ఆరో వార్డు నుండి కాంగ్రెస్ పార్టీలో చేరకపోతే ఆర్పినీ తీసివేస్తానని కొంతమందితో నాకు సమాచారం కూడా పంపించాడని అన్నారు. ఆమె నాకు సపోర్ట్ చేయకపోతే ఇంకా అన్ని రకాలైన హింస పెడతానని చెప్పేసి వాళ్లకు చెప్తే వాళ్ళు వచ్చి చెప్పారని తెలిపింది. అయినా ముందుకెళ్తున్న క్రమంలో ఆర్పీని తీసివేయాలని నోటీసులు జారీ చేయడం, నోటీసులో వాళ్ళు చేసిన ఆరోపణలన్నీ అబద్ధాలు అని మా దగ్గర పూర్తి ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని కూడా కాదంటూ ఇవన్నీ అబద్ధాలు అంటూ ఇంకా చిత్రహింసలకు గురి చేస్తున్నాడన్నారు. మేము ఎక్కడికి వెళ్లినా ఎవర్నో ఒకరిని మా వెంట పంపడం, మేము ఏం చేస్తున్నామని, మేము ఎక్కడికి వెళ్తున్నాము, అంటూ మా వెంట కొంతమందిని పంపించి మాపై నిఘా పెట్టి వీడియోలు, ఫోటోలు తెప్పించుకుంటున్నాడని తెలిసిందన్నారు. మాకు ఏదైనా జగరానిది జరిగితే దానికి కారణం మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి, ఆమె భర్త దావ రమేష్ కారణం అన్నారు. కేవలం తాను కాంగ్రెస్ పార్టీలో చేరి ఛైర్పర్సన్ కు సపోర్ట్ చేయకపోతే ఎంతటి దారుణానికైనా తెగించేలా ఉన్నాడని, మేము భయంతో బతుకుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నూనెటి సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్లు సల్ల కృష్ణవేణి, తాండ్ర స్రవంతి, సిమ్రాన్, తిరుమల వాసు, రాజకుమార్, కంపెల్లి రాజం, ఏట కమల, ప్రసన్న, బెడ్డల సౌజన్య, బిఆర్ఎస్ నాయకులు మదర్ తెరిసా, సంతోషం మల్లేశ్వరి, శైలజ, ప్రసన్న పాల్గొన్నారు.




# సురక్షిత, గౌరవప్రద బాల్యాన్ని అందించడమే లక్ష్యం

- అందుకే ఫోక్సో చట్టంలో కఠిన నిబంధనలు
- సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి
- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

**గూడూరు, సెప్టెంబర్25 (జనంసాక్షి):** బాల బాలికలపై జరుగుతున్న లైంగిక ఆకృత్యాలను అరికట్టడానికి,వారికి సురక్షితమైన, గౌరవప్రదమైన బాల్యాన్ని అందించడానికి పోక్సో చట్టం అత్యంత కఠినమైన నిబంధనలతో అమలవుతోందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి స్వాతి మురారి స్పష్టం చేశారు.శుక్రవారం మహబూబాద్ జిల్లా గూడూరు మండలం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ..లింగభేదాలకు తావులేకుండా 18 సంవత్సరాల లోపు వయసున్న బాల బాలికలందరికీ ఈ చట్టం పూర్తి రక్షణ, చట్టబద్ధమైన భద్రత కల్పిస్తుందన్నారు.బాలలపై ఎక్కడైనా లైంగిక వేధింపులు జరిగినట్లు గమనిస్తే... ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది లేదా స్థానికులు తక్షణమే పోలీసులకు లేదా చైల్డ్‌లైన్‌కు ఫిర్యాదు చేయడం చట్టరీత్యా తప్పనిసరని తెలియచేశారు.నేరాన్ని దాచిపెట్టడం లేదా ఉపేక్షించడం కూడా శిక్షార్హమైన నేరమన్నారు.బాధితుల గుర్తింపును వెల్లడించేలా వారి పేర్లు,ఫొటోలు పాఠశాల లేదా నివాస వివరాలను సోషల్ మీడియా లేదా ఇతర ప్రసార మాధ్యమాలలో బహిర్గతం చేయడం చట్టప్రకారం తీవ్ర నేరమన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత లీగల్ ఎయిడ్ న్యాయవాదుల సేవలు అందించబడతాయని, అలాగే బాధితుల పరిహార పథకం కింద తగిన ఆర్థిక, వైద్య,మరియు మానసిక సహాయం కూడా లభిస్తుందని తెలియచేశారు. విద్యార్థులకు న్యాయస్థానాల పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో, ఆసక్తి గల విద్యార్థులను కోర్టు ప్రాంగణానికి తీసుకురావాలని న్యాయమూర్తి పాఠశాల ప్రత్యేకాధికారికి సూచించారు.

అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి రామకృష్ణ మాట్లాడుతూ బాల్య వివాహాలు సామాజిక దురాచారాలని ఆర్థిక ఇబ్బందులు కానీ ఇతర ఇబ్బందుల వల్ల గాని బాల్యాన్ని దూరం చేసుకోవద్దని హితవు పలికారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలవివాహాల వల్ల జరిగే దుష్ప్రభావాలను వివరించారు. బాల్యవివాహాలు నిర్వహించిన వారు ప్రోత్సహించిన వారు నేరస్తులుగా పరిగణించ బడతారన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వివరించారు.నా సలహాల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంపాదించ వచ్చాని అన్నారు. అయోధ్యపురం పిహెచ్సీ వైద్య అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ సాంకేతికతను సరైన రూపంలో వినియోగించుకోవాలని సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల ఆడపిల్లలు అఘాయిత్యాలకు గురవుతున్నారని, వారి భవిష్యత్తును అంధకారం చేసుకుం టున్నారని తెలియజేశారు.అలాగే, బాలికల భవిష్యత్తు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని,సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం ఇటీవల చేపట్టిన 'హెచ్‌పీవీ (హెచ్ పి వి) వ్యాక్సినేషన్ డ్రైవ్' ను కూడా విజయవంతంగా పూర్తి చేసినట్లు ఈ సందర్భంగ తెలియచేశారు.వసతి గృహాల్లో ఉండి చదువుకున్నటువంటి బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సునీత, బోధనా సిబ్బంది, గూడూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్య బృందం పాల్గొన్నారు.

# లక్షలు వెచ్చించి కట్టిన గోదాం నిరుపయోగం

- మందుబాబులకు అడ్డాగా.. మారిన వైనం





**కెరమెరి , సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** కెరమెరి మండల కేంద్రంలోని అనార్ పల్లి వెళ్లే రోడ్డు మార్గంలో పదేళ్ల కిందట గత ప్రభుత్వం రైతుల పంట నిలువ కోసం రూ. లక్షలు వెచ్చించి గోదాంను నిర్మించింది. తదనంతరం ఎలాంటి ఉపయోగంలోకి తీసుకురాకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ప్రస్తుతం ఆ గోదాం నిరుపయోగంగా మారింది. కెరమెరి పరిసర ప్రాంతంలో రైతులు ప్రధానంగా పత్తి, కందులు, జొన్న పంటలను పండిస్తున్నారు. మార్కెట్ లో డిమాండ్ ఉన్నప్పుడు విక్రయించే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా గోదాంను వినియోగంలోకి తేవాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ గోదాం ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారింది.

**ఎక్కడ చూసిన మద్యం సీసాలే...**

గోదాం ఆవరణలో, లోపల ఎక్కడ చూసినా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఆకతాయిలు అక్కడ చేరి మద్యం సేవిస్తూ, గోదాం షట్టర్లను, డోర్లను ధ్వంసం చేశారు. పై కప్పు కూడా గాలి దుమారంతో పాడైపోతున్నాయి. చుట్టూ ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. లక్షలు వెచ్చించి నిర్మించిన గోదాంను వృథాగా వదిలేయడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, గోదాంకు మరమ్మతులు చేయించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

# జర్నలిస్ట్ వనం భాస్కర్ కు ఘన నివాళి అర్పించిన జర్నలిస్టులు



**వరంగల్ మండలం, సెప్టెంబర్ 25( జనం సాక్షి) :** అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ మృతదేహానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.వనం భాస్కర్ కుటుంబానికి ప్రెస్ క్లబ్ నుండి 25,000/- రూపాయలు సాయం అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో కూడా ఆ కుటుంబానికి క్లబ్ నుండి 20వేల ఆర్థిక సాయం అందించడం జరిగింది.భాస్కర్ మృతి దురదృష్టకరమని, వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. నివాళులర్పించిన వారిలో టి యు డబ్ల్యూ జే (హెచ్)143 వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొరుకొప్పుల నరేందర్, టి యు డబ్ల్యూ జే- ఐ జే యు వరంగల్ జిల్లా కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్, ప్రెస్ క్లబ్ ఈసీ సభ్యులు ఎండీ నయీంపాషా, కమటం వేణు గోపాల్, సీనియర్ జర్నలిస్టులు దాసరి శ్రీనివాస్, మహేష్, స్వామి, కందుల శ్రీధర్, పెరుమాండ్ల మధు, బండి రవి, మోహన్, ఉమాశంకర్, పాషా, అక్రం, రాజేశ్, శ్యాం, గంగరాజు, కృష్ణాకర్, తదితరులు ఉన్నారు.

# రిమ్స్ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత

- మూలగూడ గ్రామంలో చిన్నారి కుటుంబాన్ని పరామర్శించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు



**జైనూర్ లింగాపూర్, సెప్టెంబర్ 25(జనం సాక్షి) :** ఆసిఫాబాద్ జిల్లా సోమవారం రాత్రి రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన మూలగూడ గ్రామానికి చెందిన చిన్నారి కుటుంబాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుక్రవారం పరామర్శించారు. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం మూలగూడ గ్రామానికి చేరుకున్న ప్రాజెక్టు అధికారి, చిన్నారి తల్లిదండ్రులను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారి మృతి పట్ల ప్రాజెక్టు అధికారి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రిమ్స్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్నారి మృతి చెందడంతో బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును ప్రాజెక్టు అధికారి చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. ప్రభుత్వం తరఫున అందుతున్న ఆర్థిక సహాయాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. బాధిత కుటుంబ పరిస్థితిని అధికారులు సైతం పరిశీలించి, వారికి అందాల్సిన ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అధికారి సంబంధిత అధికారులను సూచించారు. కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని నిబంధనల ప్రకారం అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సహాయం అందించినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పీవీటీవీ ఆత్రం భాస్కర్ , ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి, ఏఈ (హౌసింగ్) తదితర అధికారులు పాల్గొన్నారు.

# 8 కిలోల గంజాయి పట్టివేత




**గూడూరు,సెప్టెంబర్ 25(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం గూడూరు ఎస్సై చిర్ర రమేష్ బాబు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి ఆటో నుంచి దిగి అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్ద తనిఖీలు నిర్వహించగా 8 కిలోల గంజాయి లభించిందని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4,18,000 ఉంటుందని తెలిపారు.వ్యక్తి వీరగాని కృష్ణ తండ్రి వీరభద్రం వయస్సు 55 సంవత్సరాలు కులం గౌడ,వృత్తి కూలి గ్రామం, జ్యోతి బసు కాలనీ, మహబూబాబాద్ జిల్లా నిందుతునిని విచారించగా సదరు వ్యక్తి ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, బీదర్‌లో విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు వెల్లడించాడు.బ్రాహ్మణపల్లి వద్ద నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా గంజాయితో అతడు పట్టుబడ్డాడు. ఈ ఘటనపై సదరు వ్యక్తిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి,తదుపరి న్యాయస్థానంలో హాజరుపరిచి జైలుకు పంపించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈసందర్భంగా సీఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ గంజాయిని రవాణా చేసిన వారు,విక్రయించిన, కొనుగోలు చేసిన, వినియోగించే వారిపై , అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా,విక్రయాలు, వినియోగం మరియు అక్రమ నిల్వను అరికట్టేందుకు గూడూరు పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తూ, చట్టపరమైన కఠిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈసమావేశంలో ఎస్ఐ రమేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఐఐటీ జామ్‌పై విద్యార్థులకు అవగాహన అవసరం

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఐఐటీ జామ్ (జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్స్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా ఐఐటీ మద్రాస్ మెటలర్జీ విభాగం ప్రొఫెసర్ ఆచార్య రవిశంకర్ కొట్టాడా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఐఐటీ జామ్‌కు విద్యార్థుల నమోదు తక్కువగా ఉందని, ఈ పరీక్ష ద్వారా ఉన్నత విద్యలో అనేక అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పరీక్షకు ఎలా సిద్ధం కావాలి, ప్రిపరేషన్ విధానం, ముఖ్యమైన తేదీలు, ఫలితాలు, కౌన్సెలింగ్ ప్రక్రియ తదితర అంశాలను వివరించారు. ప్రణాళికాబద్ధమైన సిద్ధత, నిరంతర సాధనతో మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు.కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుంకరి జ్యోతి అధ్యక్షత వహించి, విద్యార్థులు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలను లక్ష్యంగా చేసుకుని తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ ఎస్.ఎం. రెహమాన్, గణిత విభాగాధిపతి డాక్టర్ జి. రవికుమార్, అధ్యాపకులు డాక్టర్ అంజన్ రావు, డాక్టర్ నాగయ్య, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మంజులతో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 400 మంది పోలీసులతో గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- విధుల్లో ఉన్న పోలీసులకు జిల్లా ఎస్పీ నితికా పంత్ బ్రీఫింగ్




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25(జనంసాక్షి ):** కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో జరగనున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ శ్రీమతి నితికా పంత్, ఐపీఎస్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన బందోబస్తు విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ బ్రీఫింగ్ నిర్వహించి, విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, మసీదులు, నిమజ్జన ప్రదేశాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. భద్రతా విధుల్లో ఏఎస్పీ - 1, డీఎస్పీలు - 2, సీఐలు - 12, ఎస్సైలు - 28 మందితో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు. నిమజ్జన శోభాయాత్రను 6సెక్టార్లుగా ,11 క్లస్టర్ లగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. అవసరమైన ప్రాంతాల్లో లిఫ్టింగ్ అండ్ పుషింగ్ పార్టీలను కూడా అందుబాటులో ఉంచారు. నిమజ్జన శోభాయాత్ర జరిగే మార్గాల్లో నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన వాహనాల క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. సీసీటీవీ కెమెరాలు, పర్యవేక్షణ బృందాల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. విధుల్లో ఉన్న ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించి, ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు పూర్తిగా సహకరించి, నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ,ఇతర పోలీస్ అధికారులు,సీఐలు, ఎస్సైలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

- అధికారులపై ఎంపీ రఘునందన్ రావు ఆగ్రహం
- అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- దిశ సమావేశంలో ఎంపీ రఘునందన్ రావు

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు లో అధికారుల నిర్లక్ష్యం, కొంత మంది అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, ప్రభుత్వ పథకాల అమలు లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం లేకుండా అధికారులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారని ఎంపీ ,ఎమ్మెల్యే,సర్పంచ్ లు వివిధ స్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని సంబంధిత అధికారులపై ఎంపీ రఘునందన్ రావు మండి పడ్డారు. ప్రభుత్వ పథకాలు ప్రజల దరికి చేర్చడం అధికారులు,ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం తో కలిసి పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు సూచించారు. మెదక్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు వాటి ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం, గృహ నిర్మాణం, విద్యుత్, మహిళా మరియు శిశు సంక్షేమం, సామాజిక సంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద జిల్లాకు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్న పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎంపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు తదితర సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎంపీ సూచించారు. రామ్ జీ బి వి పథకం ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించేలా ప్రణాళికాబద్ధంగా ఉండాలని సూచించారు.విద్యా రంగంపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, తాగునీరు, మరుగుదొడ్లు




తదితర సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. తాగునీటి పథకాల పురోగతిని సమీక్షించిన ఎంపీ, ప్రతి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అధికారుల సమన్వయంతో పథకాలు ప్రజలకు అందేలా చూడలన్నారు. ఎంపీ రఘునందన్ రావు గారు సూచించిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, వచ్చే దిశ మీటింగ్ వరకు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, జిల్లా స్థాయి అధికారులు, దిశా కమిటీ సభ్యులు ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిలో మళ్లీ పెరుగుతున్న ఉధృతి

- 20 అడుగులు దాటిన నీటిమట్టం..
- మరింత పెరిగే అవకాశం



**భద్రాచలం, సెప్టెంబరు 25 (జనంసాక్షి) :** భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గోదావరి ఎగువ ప్రాంతాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద ప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 17.40 అడుగులుగా ఉన్న నీటిమట్టం శుక్రవారం ఉదయం 6 గంటలకు 17.80 అడుగులకు చేరింది. ఉదయం 9 గంటలకు 18 అడుగులు, 11 గంటలకు 18.80 అడుగులు, మధ్యాహ్నం 12 గంటలకు 19.30 అడుగులకు పెరిగింది. సాయంత్రం 4 గంటలకు గోదావరి నీటిమట్టం 20.10 అడుగులకు చేరుకుంది. గంట గంటకూ నీటిమట్టం పెరుగుతుండటంతో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో గోదావరి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## అద్దె బకాయిలతో ఈఎస్ఐ ఆసుపత్రికి తాళాలు

- 15 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని చర్యలు..
- వైద్య సేవలకు అంతరాయం



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 25 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాకలోని ఈఎస్ఐ ఆసుపత్రికి అద్దె బకాయిల వ్యవహారం కారణంగా తాళాలు పడినట్లు సమాచారం. సుమారు 15 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని ఆసుపత్రికి తాళాలు వేసినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో కార్మికులు, వారి కుటుంబాలకు అందాల్సిన వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రికే తాళాలు పడటంతో సారపాకలో చర్చనీయాంశంగా మారింది. నెలల తరబడి అద్దె బకాయిలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించలేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. బకాయిల సమస్యను ముందుగానే పరిష్కరించకుండా ఆసుపత్రి మూసివేత వరకు పరిస్థితి ఎందుకు వెళ్లిందని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అత్యవసర వైద్యం అవసరమైన సమయంలో ఆసుపత్రి అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అద్దె బకాయిల సమస్యను పరిష్కరించి, ఈఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సేవలను పునరుద్ధరించాలని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు.

## గోదావరి వరదపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశం
- 25--30 అడుగుల వరకు నీటిమట్టం పెరిగే అవకాశం
- ముందస్తు చర్యలకు ఆదేశం

**భద్రాచలం, సెప్టెంబరు 25 (జనంసాక్షి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, గోదావరి వరద పరిస్థితుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించేలా అన్ని శాఖల అధికారులు తమ హెడ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా వర్షపాతం, గోదావరి నీటిమట్టం, రహదారులు, వంతెనలు, పాఠశాలలు, పంటలు, ఇళ్ల నష్టంపై వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నందున పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రాణహిత నుంచి సుమారు లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీంతో గోదావరి నీటిమట్టం 25 నుంచి 30 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

### ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి




పాత వంతెనలు, కల్వర్టులు, రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. ములకలపల్లి వద్ద దెబ్బతిన్న వంతెనపై రాకపోకలను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వంతెన మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

### పంట, ఇళ్ల నష్టంపై తక్షణ నివేదిక

ప్రస్తుతం వర్షాల కారణంగా పంటలకు ఎలాంటి నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పంటలు, ఇళ్ల నష్టం తదితర పరిస్థితులను పరిశీలించి, నష్టం జరిగినట్లయితే వెంటనే నివేదించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ గోదావరి వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనం

- వ్యక్తి మృతి



**గద్వాల, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** గద్వాల మున్సిపాలిటి పరిధిలో నదీఅగ్రహారం రోడ్డులో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గద్వాల పట్టణం చింతలపేటకు చెందిన మునగాల శీను(54) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి ఈశ్వరన్నకు తీవ్రగాయలయ్యాయి. నదీ అగ్రహారం నుంచి గద్వాల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వీరి బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన శీను(54) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన ఈశ్వరన్న ను గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్, ఎస్పీ,వివిధ శాఖల అధికారులతో కలిసి సమావేశం



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** సెప్టెంబర్ 30వ తేదీ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రాజన్న సిరిసిల్ల జిల్లాకు రానున్నారని, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. 30వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి రాక నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.సీఎం రేవంత్ రెడ్డి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, అలాగే సిరిసిల్ల రగుడు బై పాస్ రోడ్ వద్ద ఉన్న మైదానంలో పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారని తెలిపారు.ఆయా శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్, బందోబస్తు, భద్రతా చర్యలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఇట్టి సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలానికి పోటెత్తిన గణనాథులు

- 2 కి.మీ. మేర వాహనాల బారులు..
- నిమజ్జనం అనంతరం రామయ్య దర్శనానికి భక్తుల క్యూ



**భద్రాచలం, సెప్టెంబరు 25 (జనంసాక్షి) :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో భద్రాచలం గణనాథుల నిమజ్జనాలతో సందడిగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు భద్రాచలం గోదావరి తీరానికి తరలివస్తున్నాయి. శుక్రవారం నిమజ్జనానికి గణనాథుల విగ్రహాలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. రంగారెడ్డి, ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ తదితర జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో వినాయక విగ్రహాలను భక్తులు భద్రాచలానికి తీసుకొచ్చారు.

### నిమజ్జనం అనంతరం రామయ్య దర్శనం

దూర ప్రాంతాల నుంచి గణనాథులను తీసుకొచ్చిన భక్తులు గోదావరిలో నిమజ్జనం పూర్తిచేసిన అనంతరం భద్రాద్రి సీతారామచంద్రస్వామివారి దర్శనానికి తరలివస్తున్నారు. దీంతో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ పెరిగింది.

### పర్ణశాలకు సైతం భక్తుల తాకిడి

భద్రాచలంతో పాటు పర్ణశాలకు కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారు. గోదావరిలో పుణ్యస్నానాలు, భద్రాద్రి రామయ్య దర్శనం అనంతరం పర్ణశాలలోని సీతారాముల పాదుకా ప్రాంతం, ఇతర ఆధ్యాత్మిక ప్రదేశాలను భక్తులు సందర్శిస్తున్నారు. మరో రెండు రోజుల పాటు గణేష్ నిమజ్జనాలు కొనసాగే అవకాశం ఉండటంతో మరిన్ని విగ్రహాలు భద్రాచలానికి తరలివచ్చే అవకాశముంది.

## అర్నాబ్ తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను బీభత్సానికి తీవ్రంగా దెబ్బతిన్న మండల పరిధిలోని దంతాలబోర్ ఎస్ కాలనీ గ్రామాన్ని స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం అధికారులతో కలిసి స్వయంగా సందర్శించారు. గ్రామంలో పర్యటించి అర్నాబ్ తుఫాను సృష్టించిన నష్టాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో కూలిపోయిన ఇళ్లను అయిన పరిశీలించారు. సర్వస్వం కోల్పోయిన బాధితులను కలిసి వారిని ఓదార్చారు. అన్ని విధాలా అండగా ఉంటామని అధైర్యపడవద్దని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తమకు జరిగిన ఆస్తి నష్టం, విద్యుత్ లేక పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కూనంనేని వెంటనే గ్రామంలో నిలిచిపోయిన విద్యుత్‌ను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు చేపట్టాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు దెబ్బతిన్న పేదలకు ప్రభుత్వ నియమావళి ప్రకారం నష్టపరిహారం అందేలా త్వరగా నివేదికలు తయారు చేయాలని రెవెన్యూ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గ్రామానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామని గ్రామస్థులకు మాట ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే బీర్ పాషా, తహసిల్దార్ దారా ప్రసాద్ ఎం.పి.డి.ఓ.రాజారావు , ఎలక్ట్రికల్ డి ఈ, ఏ ఈ అగ్రికల్చరల్ ఏఓ.సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు నిమ్మల రాంబాబు, నారాయణపేట సర్పంచ్ సరస్వతి, నాయకులు కోలేటి రాంబాబు, ప్రేమచంద్, ప్రశాంత్, సాయిలి శ్రీను, ఎంకన్న, వెల్లంకి శివరావు, సత్యనారాయణ రాజు, మేక రాంబాబు, జకరయ్య, అమీర్, మోహన్, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం బందోబస్తు విధుల్లో పోలీస్ సిబ్బందికి రోడ్డు ప్రమాదం



**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** కరీంనగర్ III టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుళ్లు పీసీ శివకుమార్ మరియు పీసీ రాజరత్నం ఆదర్శనగర్ బోర్డు వద్ద ట్రాఫిక్ మళ్లింపు విధులు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో టీస్ 11 ఇల్ 8787 నంబర్ గల హ్యుందాయ్ క్రెటా కారు చొప్పదండి వైపు వెళ్తుండగా, దాని డ్రైవర్ గాసికంటి అరవింద్ వాహనాన్ని నడుపుతూ పోలీస్ సిబ్బంది ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పోలీస్ కానిస్టేబుళ్లు శివకుమార్ మరియు రాజరత్నం కిందపడిపోగా, వారి తల మరియు కాళ్లకు రక్తస్రావంతో గాయాలయ్యాయి. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.కారు డ్రైవర్‌కు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో 39 ఎంజి/100 ఎమ్మెల్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల పూర్తి కారణాలు మరియు ఇతర అంశాలపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# రాతోనని చెరువుకు 7:30 అడుగులకు చేరిన వరద నీరు

- గరిష్ట నీటిమట్టం 14 అడుగులు
- రాతోని రైతులకు భారీ ఊరట

**పెనుబల్లి, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా గత మూడు రోజులుగా పెనుబల్లి మండలంలొ కురిసిన వర్షాలకు పెనుబల్లి రాథోని చెరువుకు 7:30 అడుగుల వరద నీరు చేరింది. చెరువులోకి వరద నీరు చేరడంతో రాతోని ఆయకట్టు రైతులకు భారీ ఊరట లభించింది. ఈ తుఫాను ముందు వరకు రా తోని ఆయకట్టు రైతులు వేసిన పంట చేతికి వస్తుందో లేదో అనే అనుమాలతో దిగాలుగా ఉన్న రైతులకు ఈ వర్షం కొండంత అండగా నిలిచింది. ఈ ఏడాది రాతోని చెరువులో అట్టడుగు నీటిమట్టం ఉన్నప్పటికీ,మెరక పొలాలు తప్ప, బాడవ పొలాల రైతులు తొలకరి ప్రారంభంలో అడపాదడపా కురిసిన వర్షాలకు నార్లు పోసి నాట్లు వేశారు. వారి నమ్మకానికి తగ్గట్టే సెప్టెంబర్ నెల వరకు అడపాదడపా వర్షాలు పడి వరి పొలాలకు ప్రాణం పోశాయి, సెప్టెంబర్ నెలలో చిరు పొట్ట దశకు వచ్చిన వరి పొలాలకు సమృద్ధిగా సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితి దాపురించడంతో రైతులు దిగాలు పడ్డారు. వేసిన పంట చేతికి వస్తుందో లేదో అని ఆశలు వదులుకునే సమయంలో ఈ వర్షాలకు రాతోని చెరువులోకి సుమారు 7:30 అడుగులు వర్షపు నీరు చేరి రైతులకు భారీ ఊరటను కలిగించింది. ఆయకట్టు కింద సుమారు 2500 ఎకరాలకుగాను ఎలినినో ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురవక రాతోని చెరువులోకి వరద నీరు చేరకపోవడంతో రైతులు మెరక పొలాలను వదిలేసి బాడవపొలాలలో సుమారు 15 వందల ఎకరాల వరకు వరి నాట్లు వేశారు. ఎలిని నో ప్రభావం వలన సమృద్ధిగా వర్షాలు పడకపోవడంతో సీతారామ ప్రాజెక్ట్ సాగు నీరు ను ఎన్ ఎస్ పి కెనాల్ ద్వారా పెనుబల్లి మండలానికి మళ్ళించడంతో కెనాల్ దిగువ ప్రాంతంలో రైతులు వరి నాట్లు ముమ్మరంగా వేశారు,ఎగువ ప్రాంతంలోని రైతులు బోర్ల కింద తప్ప, వర్షాభావం పై ఆధారపడే రైతులు వరి సాగు చేయలేదు. రా తోని చెరువుకి ఎన్ఎస్పీ కెనాల్ పై ఎత్తిపోతల పథకం ఉన్నప్పటికీ దొంగల కారణంగా లిఫ్ట్ పనిచేయకపోవడంతో రా తోని ఆయకట్టు రైతులకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందలేకపోయాయి. దీంతో రా తోని చెరువులో నీళ్లు లేక సగం మంది రైతులు వర్షాన్ని నమ్ముకొని బాడవ పొలాల వరకు వరి పంట వేశారు, తుఫాను కారణంగా పడ్డ వర్షాలకు రాతోని



చెరువు లోకి వరద నీరు చేరడంతో రైతుల కష్టాలు తీరినట్లు అయింది. చిరు పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు రాతోని చెరువులో నీరు వారబంది ప్రకారం సక్రమంగా సాగునీరు వినియోగించుకున్నట్లయితే చెరువుకి ఉన్న ఒకటవ, రెండవ తూముల చివరి భూముల వరకు సాగునీరు వినియోగించుకొని వరి పంటలు పండించుకోవచ్చని రాథోని చెరువు పై పూర్తి అవగాహన ఉన్న రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.




## టిగోర్ స్థానంలో టాటా కొత్త ఏరిస్ సెడాన్..

### ధర రూ.5.29 లక్షలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా కార్స్ కొత్త కారును లాంచ్ చేసింది. టిగోర్‌కు కొత్త హంగులు జోడిస్తూ సెడాన్ సెగ్మెంట్‌లో ఏరిస్‌ను (ఎజీబీజీ ఒవతీతిబ) విడుదల చేసింది. దీని ధరను రూ.5.29 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా పేర్కొంది. ఐసీఎన్‌జీ వెర్షన్ ధర రూ.6.29 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 11 నుంచి డెలివరీలు ప్రారంభం కానున్నాయి. మారుతీ సుజుకీ డిజైర్, హ్యుందాయ్ ఆరా మోడళ్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.టాటా ఏరిస్ స్లీక్ డిజైన్‌తో వస్తోంది. టియాగోను తలపించేలా ముందు భాగం డిజైన్ ఉంటుంది. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, డీఆర్ఎల్స్ ఇచ్చారు. డైమండ్ కట్ కలిగిన 15 అంగుళాల అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. త్రీస్పోక్ స్టీరింగ్ వీల్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫ్రీ ఫ్లోటింగ్ కలిగిన 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేకు సపోర్ట్ చేస్తుంది. వెంటిలేటెడ్ సీట్లు, డ్యూయల్ వైర్‌లెస్ ఫోన్ ఛార్జర్లు ఉన్నాయి. ఆరు ఎయిర్‌బ్యాగులు, హైబీమ్ అలర్ట్, ఈఎస్‌పీ, టీపీఎంఎస్, హిల్‌హోల్డ్ కంట్రోల్, బ్లైండ్ వ్యూ మానిటరింగ్, కార్నర్ స్టెబిలిటీ కంట్రోల్, 360 డిగ్రీల కెమెరా, బిల్ట్-ఇన్ డ్యాష్‌క్యామ్ రికార్డర్ ఉన్నాయి.ఇక ఇంజిన్ విషయానికొస్తే.. ఇది పెట్రోల్, సీఎన్‌జీ వెర్షన్లలో మాన్యువల్, ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ ఆప్షన్లతో లభిస్తుంది. ఇందులో 1.2 లీటర్ నాచురల్లీ యాస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ అమర్చారు. ఇది 86 హెచ్‌పీ పవర్‌ను, 113 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మాన్యువల్, ఆటోట్రాన్స్‌మిషన్ కలిగిన ఐ-సీఎన్‌జీ ఆప్షన్‌తోనూ లభిస్తుంది. ఇందులో ట్విన్ సిలిండర్ ఐసీఎన్‌జీ టెక్నాలజీని వినియోగించారు. అయినప్పటికీ 419 లీటర్ల కెపాసిటీ కలిగిన బూట్ స్పేస్ లభించేలా డిజైన్ చేశారు. ప్రత్యేకంగా ప్రైవేట్ కస్టమర్ల కోసం డిజైన్, సౌకర్యం, టెక్నాలజీ, ఫీచర్లు ఉండేలా రూపొందించారు. రోజువారీ వినియోగంతో పాటు, సుదూర ప్రయాణాలకు అనుగుణంగా ఈ సెడాన్‌ను డిజైన్ చేశారు.






# లాభాల్లో మార్కెట్ సూచీలు




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని లాభాలతో ముగించాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. దీంతో సెన్సెక్స్ 315 పాయింట్లు, నిఫ్టీ 77 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 73,525.92 (క్రితం ముగింపు 73,580.54) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. మధ్యాహ్నం వరకు ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. తర్వాత రాణించింది. ఈ క్రమంలోనే 315.20 పాయింట్ల లాభంతో 73,895.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 77.40 పాయింట్ల లాభంతో 23,140.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.80గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ట్రెంట్, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ, టాటా స్టీల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 105 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4305 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## విదేశాలకు వెళ్లే వారికి వీఐ గుడ్‌న్యూస్..

### - ఇంటర్నేషనల్ రోమింగ్ ఫ్రీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా కొత్త ఆఫర్‌తో ముందుకొచ్చింది. తమ చందాదారులకు ఇంటర్నేషనల్ రోమింగ్‌ను ఉచితంగా అందిస్తోంది. ఎంపిక చేసిన పోస్ట్ పెయిడ్, ప్రీపెయిడ్, ఎంటర్‌ప్రైజ్ ప్లాన్లతో ఈ సదుపాయం ఉచితంగా ఇస్తోంది. ప్రత్యేకంగా ఎలాంటి రోమింగ్ ఛార్జీలూ చెల్లించకుండా 170కి పైగా దేశాల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. ఏడాదికి మూడు ట్రిప్పుల వరకు ఈ అవకాశం కల్పిస్తోంది. తద్వారా రూ.9 వేల వరకు ఆదా చేసుకోవచ్చని తెలిపింది.సాధారణంగా విదేశాలకు వెళ్లే ప్రయాణికులు పాత సిమ్ తీసేసి, స్థానిక సిమ్ వినియోగిస్తుంటారు. లేదంటే ఇన్‌కమింగ్ కాల్స్, ఓటీపీలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు వేరుగా ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌తో రీఛార్జి చేసుకోవాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియా యూజర్లు మాత్రం కాల్స్, ఓటీపీల కోసం తమ నంబర్‌నే యథాతథంగా కొనసాగించొచ్చు. రూ.501 పైబడిన పోస్ట్ పెయిడ్ ప్లాన్లు, వార్షిక ప్రీపెయిడ్ ప్లాన్ యూజర్లు, రూ.451తో ప్రారంభమయ్యే ఎంటర్‌ప్రైజెస్ ప్లాన్ కలిగిన వినియోగదారులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. వీఐ యాప్ ద్వారా రోమింగ్ ఫ్రీ ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చని చెప్పింది. ప్యాకేజీని బట్టి ఇంటర్నేషనల్ డేటా, ఔట్ గోయింగ్ కాలింగ్ ప్రయోజనాలు లభిస్తాయని కంపెనీ పేర్కొంది.




## సమ్మె ఎఫెక్ట్.. ఏటీఎం ఛార్జీలు రద్దు చేసిన ప్రభుత్వరంగ బ్యాంకులు

దిల్లీ: బ్యాంకు యూనియన్ల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వరంగ బ్యాంకులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. సమ్మె సమయంలో వినియోగదారులకు ఊరట కల్పిస్తూ ఏటీఎం లావాదేవీలపై ఛార్జీలను రద్దు చేశాయి. సెప్టెంబర్ 28-30 మధ్య ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. సాధారణంగా నిర్ణీత సంఖ్య దాటిన తర్వాత ఏటీఎంలో చేసే లావాదేవీలపై బ్యాంకులు రుసుములు వసూలు చేస్తుంటాయి. సమ్మె నేపథ్యంలో ఆ రుసుముల వసూళ్లకు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వరంగ బ్యాంకులు ఉమ్మడిగా నిర్ణయం తీసుకున్నాయి. ఈ మేరకు ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వంటి ప్రభుత్వరంగ బ్యాంకులు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.ఐదు రోజుల పనిదినాలు, ఇతర డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వరంగ బ్యాంకు యూనియన్లు మూడు రోజుల పాటు సమ్మెకు దిగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖాతాదారులకు బ్యాంకు సేవల్లో ఆటంకం ఏర్పడకూడదన్న ఉద్దేశంతో ఈ ఆదివారం బ్యాంకులు పనిచేసేలా కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలోనే సమ్మె కాలంలో ఏటీఎం ఛార్జీల భారం నుంచి ఖాతాదారులకు ప్రభుత్వరంగ బ్యాంకులు మినహాయింపు ఇచ్చాయి. ఏ బ్యాంకు ఏటీఎం నుంచి లావాదేవీలు జరిపినా ఛార్జీలు వర్తించబోవని స్పష్టంచేశాయి. అలాగే, బ్యాంకు సేవల కోసం మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వాట్సప్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను వినియోగించుకోవాలని ఖాతాదారులకు సూచించాయి.



## ఏఐ మోడల్స్‌కు ఏఐతోనే ట్రైనింగ్..

### ఉద్యోగులపై ఓపెన్ ఏఐ వేటు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ హవా కొనసాగుతోంది. కృత్రిమ మేధను మరింత అభివృద్ధి చేయడానికి ఏఐ కంపెనీలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా చాట్‌జీపీటీ రూపకర్త ఓపెన్‌ఏఐ తమ మోడళ్లకు మనుషుల సహజ స్పందనపై శిక్షణనివ్వడానికి కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించింది. అయితే ఏఐకి ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా ఆ ఉద్యోగులు.. ఏఐనే వాడుతుండడంతో అటువంటి వారిపై వేటు వేసింది.తమ ఏఐ చాట్‌బాట్ ఎలా స్పందిస్తుందో అంచనా వేయడానికి, చాట్‌జీపీటీ వినియో గదారుల ప్రాంప్ట్‌లను చదవడానికి ఓపెన్ ఏఐ సంస్థ వేలాది మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను నియమించింది. వాటిని చదివిన తర్వాత ఉద్యోగులు ఏఐ ప్రతిస్పందనలను విశ్లేషించి.. వినియోగదారుడు ఏమి అడిగారో ఆ సమాచారాన్ని మాత్రమే ఇచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకుగానూ కంపెనీ వారికి గంటకు 50 డాలర్ల (సుమారు రూ.4,795) జీతం అందిస్తోంది. అయితే.. వీరిలో చాలామంది కంపెనీ మోడళ్లకు స్వయంగా శిక్షణ ఇవ్వడానికి బదులుగా.. ఏఐ (ఎఐ)నే వాడి ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన యాజమాన్యం.. సదరు ఉద్యోగులను సంస్థ నుంచి తొలగించింది.ఇలా కృత్రిమ మేధ సాయంతో ఏఐకి శిక్షణనివ్వడం వల్ల 'మోడల్ కొలాప్స్' అయ్యే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎఐ-సృష్టించిన కంటెంట్‌తోనే శిక్షణ పొందుతున్న కొద్దీ.. ఒకే రకమైన సమాచారం రిపీట్ అవుతుందన్నారు

### గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹ 1,62,254 (22 క్యారెట్లు)
₹ 1,77,008 (24 క్యారెట్లు)

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 2,50,000

# ఎమ్‌డీఆర్ భారం వినియోగదార్లపై తక్కువే




**ముంబయి:** రూ.2,000కు మించిన వాణిజ్య యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) లావాదేవీలపై కొత్తగా తీసుకొచ్చిన ఎమ్‌డీఆర్ ఛార్జీల భారం వినియోగదార్లపై తక్కువగానే ఉంటుందని నిర్వహణ సంస్థ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) తెలిపింది. ఈ లావాదేవీల విలువ పరంగా చూస్తే, కేవలం 10 శాతంపై మాత్రమే ఈ ఛార్జీలు పడొచ్చని ఎన్‌పీసీఐ ఎండీ, సీఈఓ దిలీప్ అస్బే పేర్కొన్నారు. ఇప్పటికే క్రెడిట్‌కార్డుల చెల్లింపులను అనుమతిస్తున్న పెద్ద కార్పొరేట్ సంస్థలే, యూపీఐ ఎండీఆర్ భారాన్నీ భరిస్తాయని, గురువారమిక్కడ జరిగిన 13వ ఎస్‌బీఐ బ్యాంకింగ్ అండ్ ఎకనమిక్స్ కాంక్లేవ్ 2026లో ఆయన పేర్కొన్నారు. రూ.1,000 కోట్లకుపైగా వార్షిక టర్నోవరు చేసే కంపెనీల నుంచే 80% ఎమ్‌డీఆర్ వసూలవుతోందని దిలీప్ వెల్లడించారు. రూ.కోటి అంతకు మించి టర్నోవరున్న కంపెనీలు వసూలుచేసే ఎమ్‌డీఆర్‌లో 10% వరకు వినియోగదార్లకు బదిలీ కాకపోవచ్చునీ ఆయన అన్నారు. 'అటువంటి కంపెనీలన్నీ, తమ వస్తుసేవల ధరల్లోనే క్రెడిట్ కార్డు ఛార్జీలనూ కలుపుతున్నాయి కనుక, యూపీఐ చెల్లింపులపై ఎటువంటి డిస్కౌంట్లనూ అందించడం లేదు. కాబట్టి ప్రతిపాదిత యూపీఐ ఛార్జీలను అవి వినియోగదార్లకు బదిలీ చేయవ'ని ఆయన వివరించారు.

**75% లావాదేవీలపై ఛార్జీలే పడవు**

మొత్తం యూపీఐ లావాదేవీల్లో విలువ పరంగా 75% వరకు, పరిమాణం పరంగా 96% వరకు ఛార్జీలే పడవని అన్నారు. 6 కోట్ల మంది వ్యాపారులు, 75% వరకు క్యూఆర్ కోడ్ వ్యాపారులు రూ.2,000 కంటే అధికంగా ఉండే ఒక్క లావాదేవీనీ నిర్వహించడం లేదని తెలిపారు. కాబట్టి ఈ విధానం(ఎమ్‌డీఆర్) వల్ల వీరిపై ప్రభావమే ఉండదు. మిగిలిన 10 శాతంపైన ప్రభావం పడే అవకాశం ఉంది. బ్యాంకులు, ఎన్‌పీసీఐ, ప్రొవైడర్లు, పేమెంట్ ఎడ్యుకేటర్లు కలిసి, ఎండీఆర్ ఛార్జీలు వినియోగదారులకు బదిలీ కాకుండా చూసుకోవాలని అన్నారు. యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఒక నిధి ఎమ్‌డీఆర్ వసూళ్లలో 5 శాతాన్ని, యువ పారిశ్రామికవేత్తల కోసం ఒక నిధి ఏర్పాటు చేసేందుకు వినియోగిస్తామని దిలీప్ అన్నారు. ఆర్‌బీఐ, ఇతర వర్గాలతో కలిసి ఈ నిధి రూపకల్పనపై తాము పనిచేస్తున్నట్లు వివరించారు. మూడేళ్ల వ్యవధిలో ఈ నిధి రూ.3,000 కోట్లకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. చిన్న వ్యాపార సంస్థలు యూపీఐని అంగీకరించేందుకు, సౌండ్‌బాక్స్‌లను అధికంగా వినియోగించేందుకు, ఇతర చెల్లింపు మౌలిక వసతుల కల్పనకు ఈ నిధిని ఉపయోగిస్తారు. భారత్‌లో ప్రస్తుతం 6 కోట్ల మంది వ్యాపారులు యూపీఐ వ్యవస్థలో భాగంగా ఉండగా, సౌండ్‌బాక్స్‌లు మాత్రం 2-2.5 కోట్ల వరకే ఉన్నాయని దిలీప్ తెలిపారు.

## వర్క్ ట్రిప్‌లో మద్యం తాగిందని లేఆఫ్..

### రూ.963 కోట్లకు దావా..!



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిజినెస్ ట్రిప్‌లో మద్యం తాగి అమర్యాదగా ప్రవర్తించారన్న కారణంతో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను తొలగించిందో సంస్థ. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. ఏకంగా రూ.963 కోట్ల పరిహారం కోరుతూ దావా వేశారు. యూకేలో జరిగిందీ ఘటన. వివరాల్లోకి వెళితే..బ్రిటన్‌కు చెందిన షానన్ బర్న్స్.. 2022లో సాఫ్ట్‌వేర్ కంపెనీ గిట్‌పాడ్‌లో ఇంజినీరింగ్ విభాగంలో వైస్‌ప్రెసిడెంట్‌గా చేరారు. అప్పట్లో ఆమె వార్షిక వేతనం, బోనస్ కలిపి దాదాపు 3 లక్షల పౌండ్లుగా ఉండేది. 2023 ఏప్రిల్‌లో షానన్ తమ కంపెనీ సీఈఓ, ఇతర టీమ్‌తో పాటు ఆస్ట్రియాకు బిజినెస్ ట్రిప్‌నకు వెళ్లారు. అక్కడ ఆమె మద్యం సేవించారు. ఆ సమయంలో షానన్ తన గది తాళం చెవిని పోగొట్టుకున్నారు. దీంతో హోటల్ గదిలోకి వెళ్లలేక.. ఆ రాత్రి బయట ఉన్న సౌనా రూమ్ (రిలాక్సింగ్ రూమ్)లో నిద్రించారు.ఆ పర్యటన నుంచి తిరిగొచ్చిన తర్వాత కంపెనీ సీఈఓ.. షానన్ ప్రవర్తనపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ట్రిప్‌లో ఆమె బాధ్యతారాహిత్యంగా, అమర్యాదగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఉద్యోగం నుంచి తొలగించారు. అయితే, సంస్థ నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ట్రిప్‌లో తనతో పాటు పురుష సిబ్బంది కూడా మద్యం తాగారని, కానీ వారెవరినీ ఉద్యోగం నుంచి తొలగించకుండా తనపట్ల వివక్ష చూపించారని ఆరోపించారు. అంతేగాక, తనకు అటెన్షన్ డెఫిషిట్.. హైపరాక్టివిటీ డిజార్డర్ అనే సమస్య ఉందని, ఈ విషయాన్ని కంపెనీకి ముందుగానే తెలియజేశానని పేర్కొన్నారు.అనంతరం తన తొలగింపును సవాల్ చేస్తూ ఆమె బర్మింగ్‌హామ్ ఎంప్లాయిమెంట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఉద్యోగం నుంచి తొలగించడం వల్ల తాను మానసికంగా కుంగిపోయానని, దీనివల్ల టెక్ రంగంలో కొనసాగలేకపోయానని పేర్కొన్నారు. ఫలితంగా ఎంతో ఆదాయాన్ని కోల్పోయినట్లు తెలిపారు. ఇందుకు గానూ కంపెనీ నుంచి 76 మిలియన్ పౌండ్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.963 కోట్లకు పైమాటే) నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై ట్రైబ్యునల్ ఇటీవల విచారణ జరిపింది.అయితే, షానన్ డిమాండ్‌ను గిట్‌పాడ్ వ్యతిరేకించింది. ఆమెకు 1 మిలియన్ పౌండ్లు మాత్రమే చెల్లిస్తామని పేర్కొంది. అంత మొత్తంలో పరిహారం కోరడం అతి అవుతుందని, దాన్ని తాము చెల్లించలేమని కంపెనీ తెలిపింది. కాగా.. సంస్థ వాదనపై ట్రైబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. గిట్‌పాడ్‌లో షానన్‌కు 0.85శాతం వాటా ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. అంతేగాక, ఇటీవలే ఈ సంస్థ ఓపెన్‌ఏఐతో చేసుకున్న ఒప్పందాన్నీ ప్రస్తావించింది. అందువల్ల షానన్ భారీ పరిహారం కోరడం సమంజసమేనని ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. దీనిపై త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామని వెల్లడించింది. ఒకవేళ.. ఆమెకు 76 మిలియన్ పౌండ్లు చెల్లించాలని ఆదేశిస్తే.. బ్రిటన్ ట్రైబ్యునల్ చరిత్రలోనే అది అతి పెద్ద పరిహారం కానుంది.

## హాఫీజ్ సయీద్‌పై ప్రశ్న.. ఆగకుండా వెళ్లిపోయిన పాక్ ప్రధాని



**వాషింగ్టన్(జనంసాక్షి):** ఓవైపు ఉగ్రవాదానికి పాలు పోసి పెంచుతూ.. ప్రపంచం ముందు మాత్రం తమకే పాపం తెలియదన్నట్లు నటించడం పాక్‌కే చెల్లుతుంది. ఈ విషయం లో అసత్యాలు వల్లెవేస్తూ అంతర్జాతీయ వేదికగా దాయాది ఎన్నోసార్లు భంగపడిన సందర్భాలున్నాయి. తాజాగా ఐరాస సమావేశంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఇదే ప్రశ్న ఎదురైంది. దానికి సమాధానం చెప్పలేక ఆయన అక్కడనుంచి వెళ్లిపోవడం గమనార్హం.ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో పాల్గొనేందుకు ఐరాస ప్రధాన కార్యాలయానికి వచ్చిన షెహబాజ్ షరీఫ్‌ను.. భారత జర్నలిస్టు ఒకరు ఉగ్రవాదం గురించి ప్రశ్నించారు. "ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం ఎప్పుడు మానేస్తారు?" అని అడిగారు. దీనికి జవాబు చెప్పేందుకు పాక్ ప్రధాని ఆసక్తి చూపించలేదు. అనంతరం సమావేశం ముగించుకుని షెహబాజ్ బయటకు వెళ్తుండగా.. విలేకరులు మళ్లీ దీని గురించి ప్రశ్నించారు. "లష్కరే తయ్యిబా అధినేత హాఫీజ్ సయీద్‌ను మీరు ఎప్పుడు విచారిస్తారు?" అని అడగ్గా.. పాక్ ప్రధాని ఆగకుండా అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయారు.గురువారం ఐరాస సమావేశంలో భాగంగా పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. ఇతర దేశాలపై సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకుని.. ఆర్థిక భారం నుంచి బయటపడే మార్గాలు అన్వేషించుకోవాలని దాయాదికి సూచించింది. 26/11 ముంబయి పేలుళ్ల సూత్రధారి అయిన హాఫీజ్ సయీద్‌ను భారత్ ఇప్పటికే ఉగ్రవాదిగా ప్రకటించింది. గతేడాది పహల్గాం ఉగ్రదాడిలోనూ లష్కరే అనుబంధ సంస్థ హస్తం ఉన్నట్లు తేలడంతో భారత జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అందులో సయీద్‌ను నిందితుడిగా చేర్చిన సంగతి తెలిసిందే.

# గరిష్ఠ వేతనం రూ.15 వేలు చాలు

### ఆటోమేటిక్‌గా పింఛను పథకం వర్తింపు

### కొత్తగా 51 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం

**హైదరాబాద్:** ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో).. గరిష్ఠ వేతన పరిమితి పెంపును ఈ నెల 17 నుంచి అమల్లోకి తీసుకురావడంతో రూ.15 వేలకు మించి రూ.25 వేల లోపు వేతనాలు పొందుతున్న కొత్తగా 51 లక్షల మంది ఉద్యోగులు ఆటోమేటిక్‌గా ఈపీఎఫ్, ఈపీఎస్ (పింఛను) పథకాల పరిధిలోకి రానున్నారు. ఈ పెంపుతో ఈపీఎఫ్‌లో జమయ్యే మొత్తం, పదవీ విరమణ అనంతరం చేతికి వచ్చే పింఛను మొత్తం పెరుగుతుంది. తాజాగా ఈపీఎఫ్‌వో మార్గదర్శకాలు, వివరణలు వెలువరించింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కల్పించాలని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయాలకు సమాచారాన్ని ఇచ్చింది. యాజమాన్యాలు ఒకే నెలలో రెండు గరిష్ఠ వేతనాలకు సంబంధించి వేర్వేరు ఈసీఆర్‌లు దాఖలు చేయాల్సిన అవసరం లేదని, ఒకే ఈసీఆర్‌లో వివరాలు వెల్లడించాలని సూచించింది. బేసిక్ వేతనం, డీఏ కలిపితే వచ్చే మొత్తం ఈపీఎఫ్‌వో గరిష్ఠ వేతనం అవుతుంది. ఉద్యోగులు.. వేతనం నుంచి 12 శాతం ఈపీఎఫ్ చందా చెల్లించాలి. యాజమాన్యాలూ అంతే శాతం చెల్లిస్తాయి. ఈ నెల 16 వరకు గరిష్ఠ వేతన పరిమితి రూ.15 వేలు. ఆ తరువాత నుంచి రూ.25 వేలు అమల్లోకి వస్తుంది.ఈపీఎఫ్‌వో నిబంధనల ప్రకారం తొలిసారి ఉద్యోగంలో చేరినపుడు ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితి కన్నా జీతం (బేసిక్+డీఏ) ఎక్కువ ఉంటే పింఛను పథకానికి అర్హత ఉండదు. ఉద్యోగి, యజమాని వాటాలు రెండూ ఈపీఎఫ్ ఖాతాలో జమవుతాయి. తాజాగా రూ.25 వేలకు పెంచడంతో గతంలో రూ.15 వేలకు మించి, ప్రస్తుతం రూ.25 వేల లోపు గరిష్ఠ వేతనం పొందుతున్న ఉద్యోగులందరికీ ఈపీఎస్ పథకం (పింఛను) వర్తిస్తుంది. ఈపీఎఫ్ చందాను నిర్బంధంగా చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగి ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితి కన్నా ఎక్కువ వేతనం పొందినా, సీలింగ్ కింద రూ.15 వేలపై పీఎఫ్ చెల్లించే వారు. దీంతో నెలకు ఉద్యోగి వాటాగా రూ.1,800, యజమాని వాటాగా రూ.1,800 జమయ్యేవి. వేతన పరిమితి పెంచినందున రూ.25 వేల లోపు వరకు ఆ మేరకు చందా పెరుగుతుంది. అంటే వేతనం రూ.25 వేలు ఉంటే.. ఉద్యోగి వాటా కింద నెలకు రూ.3 వేలు, యజమాని వాటా కింద రూ.3 వేలు జమ అవుతాయి. యజమాని వాటా 12 శాతంలో ఈపీఎస్ చందా కింద రూ.2,083 మినహాయించగా.. మిగతా రూ.917 ఉద్యోగి ఈపీఎఫ్ ఖాతాలో జమవుతాయి. ఈ లెక్కన పదవీ విరమణ అనంతరం చేతికి వచ్చే నగదు పెరుగుతుంది. కొత్తగా చేరిన ఉద్యోగి ఈపీఎఫ్ వేతనం రూ.20 వేలు ఉంటే.. గత సీలింగ్ ప్రకారం రూ15 వేలు దాటినందున సెప్టెంబరు 16 వరకు ఈపీఎస్ పథకానికి అర్హత ఉండేది కాదు. తాజాగా పరిమితి రూ.25 వేలకు పెంచినందున సెప్టెంబరు 17 నుంచి ఈపీఎస్ పథకానికి అర్హులవుతారు. రూ.25 వేల లోపు ఉన్నవారంతా ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఈడీఎల్ఐ పథకానికి అర్హులవుతారు. ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే కుటుంబానికి గరిష్ఠంగా ఈడీఎల్ఐ పథకం కింద రూ.10.50 లక్షలు చేతికి అందుతాయి. గత పరిమితి ప్రకారం గరిష్ఠంగా రూ.7 లక్షలు అందేవి. ఈడీఎల్ఐ చందా 0.5 శాతాన్ని యజమాని అదనంగా చెల్లిస్తారు. కొత్తగా చేరిన ఉద్యోగికి బేసిక్+డీఏ కలిపి రూ.25 వేలు దాటితే ఆ ఉద్యోగికి పింఛను పథకం వర్తించదు.

## జిన్‌పింగ్‌కు ట్రంప్ ప్రత్యేక డిన్నర్

### అమెరికన్-చైనీస్ రుచులు వడ్డింపు

**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా పర్యటనకు విచ్చేసిన చైనా అధినేత షీ జిన్‌పింగ్‌కు అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దంపతులు అధికారిక విందు ఇచ్చారు. శ్వేతసౌధంలోని ఈస్ట్ రూమ్‌లో జరిగిన ఈ విలాసవంతమైన విందులో జిన్‌పింగ్ కోసం ప్రత్యేక వంటకాలు సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మెనూను వైట్‌హౌస్ విడుదల చేసింది. అమెరికన్, చైనీస్ రుచుల కలయికతో చేసిన వంటకాలు అందులో ఉన్నాయి. మెయిన్ కోర్సులో నువ్వులతో చేసిన బాస్ చేప, క్రిస్పీ బాక్ చోయ్ (ఒక రకమైన చైనీస్ క్యాబేజీ), పసుపు గుమ్మడితో చేసిన వెలౌట్, అడవి పుట్టగొడుగులతో చేసిన ఫ్రికాసీ, క్రిస్పీ పాన్‌సెట్టా, రోస్టెడ్ గార్డెన్ ఎగ్‌ప్లాండ్ వంటివి ఏర్పాటు చేశారు. డెజర్ట్స్‌లో వెనీలా క్రిమెక్స్, వైట్‌హౌస్ హనీ క్రీమ్, వాల్‌నట్ ఫ్రాంగిపేన్, చెర్రీ కాన్‌ఫిట్ వంటివి అందించారు.ఇక, ఈ కార్యక్రమంలో జిన్‌పింగ్‌కు ట్రంప్ అరుదైన కానుకనిచ్చారు. అమెరికా జాతీయ బాల్డ్ ఈగల్ విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. మూడు అడుగుల ఎత్తు ఉన్న ఈ గిఫ్ట్‌ను విందు సమయంలో అతిథుల ముందు ప్రదర్శించారు. స్వేచ్ఛ, స్ఫూర్తికి చిహ్నమైన ఈ విగ్రహం.. చైనాలో ప్రత్యేకంగా నిలుస్తుందని ట్రంప్ ఆకాంక్షించారు. విందు అనంతరం శ్వేతసౌధంలో నూతనంగా నిర్మిస్తోన్న బాల్‌రూమ్‌ను జిన్‌పింగ్‌కు చూపించారు. 'ఈ గదిలోకి వచ్చిన మొదటి విదేశీ నేత మీరే' అంటూ ట్రంప్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

**హాజరైన టెక్ దిగ్గజాలు..**

ఈ విందుకు అమెరికా టెక్ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ మాజీ సీఈవో టిమ్ కుక్, ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్, ఓపెన్‌ఏఐకు చెందిన శామ్ ఆల్ట్‌మన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్వార్టర్ల కేటాయింపుతో పాటు సమస్యల పరిష్కారానికి వినతులు

- 495 క్వార్టర్లకు 123 దరఖాస్తులు.. కౌన్సిలింగ్‌కు 41 మంది హాజరు
- 25 మంది ఉద్యోగులు క్వార్టర్లు ఎంపిక
- మురుగునీరు, బురద సమస్యలు పరిష్కరించాలని వినతి





**యైటింక్లైన్ కాలనీ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** సింగరేణి ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఆర్జీ-2 ఏరియాలోని సెక్టార్-3 కాలనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను అర్హులైన గ్రూప్-1 ఉద్యోగులకు కేటాయించేందుకు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. యైటింక్లైన్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో జరిగిన ప్రక్రియలో ఆర్జీ-2, ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1, ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-11 ఇంక్లైన్ ఉద్యోగులు పాల్గొన్నారు. మొత్తం 495 క్వార్టర్లకు 123 మంది దరఖాస్తు చేసుకోగా, సీనియారిటీ ఆధారంగా నిర్వహించిన కౌన్సిలింగ్‌కు 41 మంది హాజరయ్యారు. వారిలో 25 మంది తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా నిర్వహించినట్లు హెచ్‌ఓడీ(పీ) ఎన్.వేణుగోపాల్ తెలిపారు. ఉద్యోగులకు మెరుగైన నివాస వసతి కల్పించడం ద్వారా వారి పని సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సింగ్ శ్రీనివాస్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ గంధం సాంబశివరావు, సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, సింగరేణి క్వార్టర్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహిళలు, బస్తీవాసులు ఆర్జీ-2 ఏరియా జీఎం లక్ష్మీపతిగౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా టీ2-1185 నుంచి టీ2-1214 లైన్ వరకు 31 కుటుంబాలు వర్షపు నీరు, బురదతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఇళ్ల కోసం నిర్మించిన సిమెంట్ రోడ్డు సింగరేణి రోడ్డుకంటే ఎత్తుగా ఉండటంతో వర్షపు నీరు తమ లైన్‌లోనే నిలిచిపోతోందని వివరించారు. చిన్నారులు పాఠశాలకు వెళ్లే సమయంలో ఇబ్బందులు పడుతున్నారని, మురుగునీరు నిలవడంతో దోమల బెడద పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, చల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

# ప్రభుత్వం సానుకూల స్పందన

దసరాకు రెండు డీఏలు.. సంక్రాంతికి మరో డీఏ

- సీపీఎస్‌పై ప్రత్యేక కమిటీకి హామీ
- పీఆర్సీ నివేదికపై త్వరితగతిన నిర్ణయం
- ఈహెచ్‌ఎస్ సేవల బలోపేతానికి చర్యలు



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ తెలిపారు. కరీంనగర్ టీఎన్జీవోల సంఘం భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు సమాయత్తమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరారని, ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జేఏసీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. అనంతరం ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య జరిగిన చర్చల్లో పలు హామీలు లభించాయని పేర్కొన్నారు. వచ్చే నెల దసరా సందర్భంగా రెండు డీఏలు, సంక్రాంతి నాటికి మరో డీఏ విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి మూడు నెలల్లో నివేదిక తీసుకునే ప్రక్రియ చేపడతామని తెలిపిందన్నారు. పీఆర్సీ కమిటీ నివేదికను త్వరితగతిన పరిశీలించి వేతన సవరణపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు సంబంధించిన ఈహెచ్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేసి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం పేర్కొందన్నారు. హామీలను నిర్ణీత గడువులో అమలు చేయాలని జేఏసీ కోరుతుందని మారం జగదీశ్వర్ స్పష్టం చేశారు. ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కరీంనగర్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాల తరఫున ఘన స్వాగతం పలకాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మడిపెల్లి కాళీచరణ్, టీఎన్జీవోల సంఘం నాయకులు, గెజిటెడ్ అధికారుల సంఘం, పెన్షనర్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి త్రోబాలు పోటీలకు జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థి ఎంపిక

గంగాధర సెప్టెంబర్ 25 (జనంసాక్షి):జాతీయ స్థాయిలో జరిగే త్రోబాలు పోటీలకు మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి పి నరేష్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బొజ్జ సురేష్ కుమార్ తెలిపారు.ఈ నెల 26,27,తేదీలలో మహారాష్ట్రలోని నాసిక్ లో జరుగునున్న త్రోబాలు పోటీలకు వెళ్తున్న పి నరేష్ కు పూల బొకే ఇచ్చి ప్రిన్సిపాల్ అభినందించారు.రాబోయే రోజుల్లో ఆటలలో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పిఈటి ఆర్ రాకేష్. ఉపాధ్యాయులు రాజు.వరుణ్ జ్యోతి.అంజయ్య. సత్యనారాయణ.శ్రవణ్ కుమార్.సంపత్.రమేష్.బొడ్డు రమేష్.శ్రీనివాస్ రెడ్డి.వంశీకృష్ణ.జైసింగ్.విశ్వ కర్మ మల్లికార్జున్ ప్రసన్న మంగ రాణి హేమశ్రీ పాల్గొని విద్యార్థిని అభినందించారు.

# గుండెపోటుతో ఫైర్ ఆఫీసర్ మృతి

**డ్రైవర్ స్థాయి నుంచి అధికారిగా ఎదిగిన నాగు అనిల్ కుమార్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** వేములవాడ స్టేషన్ ఫైర్ ఆఫీసరుగా విధులు నిర్వహిస్తున్న నాగు అనిల్ కుమార్ హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 2008 బ్యాచ్‌కు చెందిన అనిల్ కుమార్ డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరి, శ్రమతో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు.గత రెండేళ్లుగా వేములవాడ అగ్నిమాపక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. వేములవాడలో అగ్నిప్రమాద నివారణ అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పలు అగ్నిప్రమాదాల్లో సిబ్బందితో కలిసి పాల్గొని ప్రాణ,ఆస్తి నష్టాలను నివారించారు.ఆయన అకాల మరణంతో అగ్నిమాపక సిబ్బంది శోకసంద్రంలో మునిగిపోయారు.

# మిడ్ మానేరు బాధితుల సమస్యలు పరిష్కరించాలి

- ఇళ్ల నిర్మాణం, నిధులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి
- భాజాప రాష్ట్ర అధికార ప్రతినిధి వికాస్‌రావు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** మిడ్ మానేరు నిర్వాసితుల సమస్యలను,రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెన్నమనేని వికాస్‌రావు డిమాండ్ చేశారు.శుక్రవారం వేములవాడ అర్బన్ మండల బీజేపీ నాయకులు,ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వికాస్‌రావు మాట్లాడుతూ మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణం వల్ల 10,683 కుటుంబాలు తమ భూములు, ఇండ్లు కోల్పోయి సర్వస్వం త్యాగం చేశారన్నారు. పెద్ద ఎత్తున నష్టపోయిన నిర్వాసితులకు సరైన పునరావాసం,ఉపాధి కల్పించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం,ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యాయన్నారు.

**ఇళ్ల నిర్మాణం,నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి.**

ప్రాజెక్టు నిర్వాసితుల్లో ఇప్పటివరకు 5,987 కుటుంబాలు మాత్రమే ఇండ్లు నిర్మించుకున్నారని, ఇంకను 4,696 కుటుంబాలు నిలువ నీడ లేక, ఇళ్లు నిర్మించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిపోయిన ఈ కుటుంబాలకు ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయి...? ఎంత నిధులు విడుదల చేశారన్నారు.ఇప్పటివరకు ఎంత నగదు బదిలీ జరిగిందో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.భూములు కోల్పోయిన నిర్వాసితుల్లో ఇంకా 15 శాతం మందికి వివిధ రకాల పరిహారం అందాల్సి ఉందని,వారికి ఎప్పుడు పరిహారం అందిస్తారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. పరిశ్రమల స్థాపన,నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. ఇండ్లు, భూములు కోల్పోయి ఉపాధి లేక నలిగిపోతున్న నిర్వాసితుల కుటుంబాల్లోని యువతకు తగిన జీవనోపాధి చూపించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

జిల్లాలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు చిన్న,మధ్య తరహా పరిశ్రమలు,ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే స్థానిక యువతీ యువకులకు ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ నెల 30 న సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్న క్రమంలో , మిడ్ మానేరు బాధితుల సమస్యలపై ప్రభుత్వం తరపున స్పష్టమైన అధికారిక ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన ఉండి పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు.ఈ సమావేశంలో వేములవాడ అర్బన్ మండల బీజేపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన

- ప్రమాదాల నివారణపై ప్రత్యేక శిక్షణ
- ఇంధన పొదుపుపై సూచనలు
- అలసటగా ఉంటే డ్రైవింగ్ చేయొద్దు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):** టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ కార్యాలయంలో డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రీజియన్ మేనేజర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డ్రైవర్లకు సురక్షిత డ్రైవింగ్‌పై పలు సూచనలు అందించారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సైకాలజిస్ట్ వి.ప్రవీణ్, నిజామాబాద్-1 డిపో మేనేజర్ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత, దృశ్య అవగాహన, మానసిక ప్రశాంతత కీలకమని తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. విధులకు ముందు తగినంత విశ్రాంతి తీసుకోవాలని, అలసటగా ఉన్నప్పుడు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. వాహనాన్ని నియంత్రణలో ఉంచుతూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరేలా డ్రైవింగ్ చేయాలని సూచించారు. శిక్షణలో భాగంగా బీఎస్-6 బస్సుపై కూడా డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ, అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నతండ్రిని చంపిన కొడుకుకు జీవిత ఖైదు

- పోలీసు అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ డి. జానకి
- తీర్పు వెలువరించిన మహబూబ్‌నగర్ ఫ్యామిలీ కోర్టు జడ్జి



**రాజాపూర్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** డబ్బుల కోసం కన్న తండ్రిని హత్య చేసిన కుమారుడికి మహబూబ్‌నగర్ ఫ్యామిలీ కోర్టు కమ్ 3 అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పి.ఆంజనేయులు జీవిత ఖైదు, రూ.5,000 జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చారు. రాజాపూర్ మండలం రాయపల్లి గ్రామానికి చెందిన కవాలి నారాయణ, చంద్రకళ దంపతులు కూలి పని చేస్తూ జీవిస్తున్నారు. జాలీ ఖర్చుల కోసం కవాలి నదేశ్ ఏ ఆనంద్ తల్లిదండ్రులతో తరచూ గొడవపడేవాడు. 2024 సెప్టెంబర్ 19 రాత్రి డబ్బుల విషయమై గొడవపడి, తండ్రి నారాయణ మెడపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నారాయణను జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు రాజాపూర్ ఎస్ఐ రవి కేసు నమోదు చేయగా, జడ్చర్ల రూరల్ సీఐ టి. నాగార్జున గౌడ్ దర్యాప్తు చేసి కోర్టులో ఆధారాలు సమర్పించారు.

నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పనిచేసిన ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ టి.నాగార్జున గౌడ్, ఎస్ఐ రవి, ఏపీపీ కె.నరేష్ కుమార్, హెచ్‌సీ జె.శ్రీనివాస్, సీడీవో జె. శేఖర్‌లను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అభినందించారు. నేరస్థులకు శిక్ష పడేలా పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు.




# గద్వాల మున్సిపాలిటీలో నిధుల గోల్‌మాల్

**అధికారుల నిర్లక్ష్యానికి రూ. 11 లక్షలు స్వాహా, ఉద్యోగి ఆత్మహత్యా యత్నం !**

**గద్వాల, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** గద్వాల పురపాలక సంఘంలో అధికారుల తీవ్ర నిర్లక్ష్యం, నిధుల పర్యవేక్షణ లోపం మరోసారి పట్టణంలో కలకలం రేపింది. పట్టణ మున్సిపల్ పరిధిలోని దుకాణాల అద్దెలు సరిగ్గా వసూలు చేయకపోవడం, తాయి బజార్ వేలం నిబంధనల నిర్వహణలో మొదటి నుండి తీవ్ర గందరగోళం, ఉదాసీన వైఖరి కొనసాగుతోంది. అధికారుల ఈ పట్టింపులేనితనాన్ని ఆసరాగా చేసుకుని, ఐడీఎస్ఎంటీ దుకాణాల అద్దెలు వసూలు చేసే ఒక ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఏకంగా రూ. 11 లక్షల ప్రభుత్వ సొమ్మును గుటకాయస్వాహా చేశాడు. ప్రతిరోజూ వసూలయ్యే నగదును ఉన్నతాధికారులు సకాలంలో డిపాజిట్ చేయించుకోకపోవడంతో, సదరు ఉద్యోగి ఆ మొత్తాన్ని ఆన్లైన్ బెట్టింగుల్లో పెట్టి పూర్తిగా పోగొట్టుకున్నాడు. ఈ భారీ నిధుల దుర్వినియోగం వ్యవహారం బయటపడటంతో సదరు ఉద్యోగి ఆత్మహత్యకు యత్నించడం గమనార్హం. ఇంత జరుగుతున్నా పోలీసులకు ఫిర్యాదు చేయడంలో మున్సిపల్ యంత్రాంగం చూపిస్తున్న తాత్సారం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గద్వాల మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సు



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ రంగ చర్చలకు హైదరాబాద్ వేదికగా మారింది. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ (ఐఆర్ఈసీ) 2026 శుక్రవారం ప్రారంభమైంది. సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు జరిగే ఈ ఏడో ఎడిషన్‌ను తొలిసారిగా భారత్‌లో నిర్వహిస్తున్నారు. 35కిపైగా దేశాల నుంచి 2,000 మందికిపైగా ప్రతినిధులు, 75కిపైగా అంతర్జాతీయ వక్తలు, 100కిపైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటున్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్-ఇండియా (నార్-ఇండియా) ఆధ్వర్యంలో, హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ సదస్సుకు నార్ అధ్యక్షుడు కెవిన్ బ్రౌన్, నార్-ఇండియా చైర్మన్ సుమంత్ రెడ్డి అరని, ఐఆర్ఈసీ 2026 చైర్ శైలేందర్ సింగ్, ఎంఎస్ఎన్ గ్రూప్ చైర్మన్, ఎండీ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంఎస్ఎన్ రియాల్టీ సేల్స్ అండ్ మార్కెటింగ్ హెడ్ వెంకట్ రమణ బండి తదితరులు హాజరయ్యారు.

'ది డోర్ టు వాట్ హాపెన్స్ నెక్స్ట్' ఇతివృత్తంతో జరుగుతున్న సదస్సులో అంతర్జాతీయ పెట్టుబడులు, ఏఐ, ప్రాప్‌టెక్, డీప్‌టెక్, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్ నగరాలు, బ్రాండెడ్ నివాసాలు, కార్యాలయాల పరిణామంపై చర్చలు జరగనున్నాయి. ఐఆర్ఈసీలో స్ట్రాటజిక్ కాన్ఫరెన్స్, ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో మూడు ప్రధాన వేదికలుగా ఉన్నాయి. 26, 27 తేదీల్లో జరిగే స్ట్రాటజిక్ కాన్ఫరెన్స్‌లో ప్లీనరీలు, అంతర్జాతీయ ప్యానెల్ చర్చలు, సీఈఓల రౌండ్‌టేబుళ్లు, 30కిపైగా బ్రేక్‌అవుట్ సెషన్లు ఉంటాయి. 25 నుంచి 27 వరకు జరిగే లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పోలో జాతీయ, అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ అవకాశాలను ప్రదర్శించనున్నారు. 26న ఐఆర్ఈసీ గాలా నైట్ నిర్వహించనున్నారు. సుమంత్ రెడ్డి అరని మాట్లాడుతూ.. భారత రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రపంచ మార్కెట్లతో అనుసంధానించేందుకు ఐఆర్ఈసీ కీలక వేదికగా నిలుస్తుందన్నారు. శైలేందర్ సింగ్ మాట్లాడుతూ సాంకేతికత, పెట్టుబడులు, సుస్థిరత, పట్టణ అభివృద్ధిపై అంతర్జాతీయ చర్చలకు ఇది వేదికగా నిలుస్తుందని తెలిపారు.

# ఏఐపై పట్టు.. భవిష్యత్‌పై గురి

**గంభీరావుపేట డిగ్రీ కళాశాలలో 'ఏఐ టూల్స్'పై అవగాహన వెబినార్**

గంభీరావుపేట, (జనంసాక్షి): ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో "టీచర్స్, స్టూడెంట్స్ కోసం ఏఐ టూల్స్" అంశంపై ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ జె. శ్రవణ్ కుమార్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. హరికృష్ణ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. విద్యారంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యత, ఏఐ టూల్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. బోధన-అభ్యసన ప్రక్రియలో ఏఐ ఉపయోగాలు, పరిశోధనలో దాని పాత్రను వివరించారు. విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి ఏఐ సాంకేతికతను ఉపయోగించుకునే విధానాలను తెలియజే శారు. ఏఐ పై అవగాహన ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థికి అవసరమని ప్రిన్సిపాల్ విజయ లక్ష్మి పేర్కొన్నారు. ఏఐ సాధనాల ద్వారా బోధన, అభ్యసనం, పరిశోధన, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచు కోవచ్చున్నారు. వెబినార్‌లో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న వారికి గూగుల్ ఫారం ద్వారా సర్టిఫికెట్లు అందించే ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

- 167వ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం.. బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. అక్కడికక్కడే యువకుడి మృతి
- కేసు నమోదు చేసి దర్యాప్తు

**మహమ్మదాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** 167వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గండీడ్ మండలం కొమ్మిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహమ్మదాబాద్ మండలం దేశాయిపల్లికి చెందిన కురువ మల్లేష్ (27) స్థానిక వైన్‌షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శుక్రవారం ఉదయం 10.45 గంటల సమయంలో యూనికాన్ బైక్‌పై దేశాయిపల్లి నుంచి కోస్గి వైపు వెళ్తుండగా.. తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు (TS06UC3213) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు బైక్(TG064657)ను కొంత దూరం ఈడ్చుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రత్నమాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

# గణేష్ నిమజ్జనంలో విషాద ఛాయలు


- కెనాల్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత
- సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించిన మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన తాండ్ర రుద్ర అనే యువకుడు మల్కాపూర్ క్రాస్ రోడ్డు వద్ద కెనాల్‌లో వినాయక విగ్రహ నిమజ్జనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. కెనాల్‌లో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో రుద్ర నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. యువకుడి ఆచూకీ కోసం అధికారులు, పోలీసులు, స్థానికులు, సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఎల్ఎండీ (లోయర్ మానేరు డ్యామ్) ప్రాంతంలో రుద్ర మృతదేహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెలికితీసే ప్రక్రియను మేయర్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసులు, స్థానికులు, సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసి, తదుపరి చర్యల కోసం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రక్రియను వీలైనంత తొందరగా పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్ మృతుడు రుద్ర కుటుంబ సభ్యులను పరామర్శించి, తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ అధైర్యపడవద్దని, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. రుద్ర కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు అందించాల్సిన సహాయ సహకారాల పై మేయర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. మేయర్ వెంట డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తదితరులు ఉన్నారు

# కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ సన్నాహక సమావేశం

- తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి




**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 30న కరీంనగర్ లో నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో కాంగ్రెస్ కార్పొరేషన్ కమిటీ సన్నాహక సమావేశం నిర్వహించింది. డీసీసీ కార్యాలయంలో కార్పొరేషన్ కమిటీ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. సీఎం పర్యటన సందర్భంగా నగరంలోని ప్రధాన కూడళ్లు, కలెక్టరేట్ మార్గంలో ఫ్లెక్సీలు, కటౌట్లు, తోరణాలు ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. 66 డివిజన్లలో కాంగ్రెస్ జెండాలు, బంటింగ్స్, బెలూన్లతో అలంకరించాలని సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో సాంకేతిక లోపాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు పేర్కొన్నారు. పేర్లు, గ్రామాల స్పెల్లింగ్‌లలో తప్పులు నమోదవుతున్నాయని, పలువురికి ఇంకా నోటీసులు అందలేదని తెలిపారు. అక్టోబర్ 31తో ముగియనున్న ప్రక్రియ గడువును డిసెంబర్ వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్న కార్పొరేషన్ కమిటీని అభినందించారు. ఓటు హక్కు పరిరక్షణకు ఏఐసీసీ పిలుపు మేరకు ఈ నెల 28న కరీంనగర్ కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. పార్టీ అంతర్గతంగా వర్గాలకు తావివ్వకుండా అందరూ ఐక్యంగా పనిచేయాలని ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి సూచించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసి కరీంనగర్‌లో కాంగ్రెస్ బలాన్ని చాటాలని అంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దుర్వాసనపై ఇథనాల్ పరిశ్రమలో విచారణ

*స్థానికుల ఫిర్యాదులతో రంగంలోకి కాలుష్య నియంత్రణ మండలి*

- గుగ్గిళ్లలో పరిశ్రమ పరిసరాల పరిశీలన
- అధికారులకు సమస్యలు వివరించిన గ్రామస్థులు
- శాశ్వత పరిష్కారం చూపాలని వినతి



**బెజ్జంకి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఇథనాల్ పరిశ్రమ నుంచి వెలువడుతున్న దుర్వాసన తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చేసిన ఫిర్యాదులపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ బయో ఎనర్జీ పరిశ్రమను శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారులు భాగ్యలక్ష్మి, రవీందర్ పరిశీలించారు. పరిశ్రమ పరిసరాలను తనిఖీ చేయడంతోపాటు స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.
పరిశ్రమ కార్యకలాపాల సమయంలో వెలువడుతున్న దుర్వాసనతో గుగ్గిళ్లతోపాటు బెజ్జంకి, కోహెడ మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులకు తెలిపారు. దుర్వాసన తీవ్రంగా ఉన్న సమయంలో ఇళ్లలో ఉండటం, బయటకు వెళ్లడం, రోజువారీ పనులు చేసుకోవడం కష్టంగా మారుతోందని వివరించారు. పర్యావరణానికి, ప్రజల జీవనానికి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. దుర్వాసనకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పరిశ్రమపై పర్యవేక్షణ పెంచాలని విజ్ఞప్తి చేశారు. విచారణలో భాగంగా అధికారులు స్థానికుల ఫిర్యాదులను నమోదు చేసుకుని పరిశ్రమ కార్యకలాపాలు, కాలుష్య నియంత్రణకు సంబంధించిన వివరాలను సేకరించారు. అధికారుల పరిశీలనతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పేదరికాన్ని జయించి ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు

- నీట్‌లో ప్రతిభతో నిర్మల్ మెడికల్ కాలేజీలో ఝాన్సీ ప్రవేశం
- ఇంటర్‌లో 975 మార్కులతో సత్తా
- నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు రూ.లక్ష సాయం చేసిన డా. పెబ్బేటి మల్లికార్జున్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** పేదరికం చదువుకు అడ్డంకి కాదని నిరూపిస్తూ అచ్చంపేట తాలూకా అనంతవరం గ్రామానికి చెందిన గుడేలి ఝాన్సీ ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ ఏడాది నీట్‌లో ప్రతిభ కనబరిచి నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు పొందిన ఆమెను నాగర్‌కర్నూల్ జిల్లా తెనుగోళ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఝాన్సీ నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు రూ.లక్ష ఆర్థిక సాయం చేసిన డా. పెబ్బేటి మల్లికార్జున్‌ను కూడా సత్కరించారు. ఝాన్సీ అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివి 1000 మార్కులకు 975 మార్కులు సాధించారు. వైద్యురాలు కావాలనే లక్ష్యంతో నీట్‌కు సిద్ధమైన ఆమెకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు కోచింగ్ విషయంలో ఇబ్బందిగా మారాయి. ఈ పరిస్థితిని గుర్తించిన డా. పెబ్బేటి మల్లికార్జున్ కోచింగ్ ఫీజుగా సుమారు రూ.లక్ష అందించడంతో ఆమెకు లాంగ్‌టర్మ్ కోచింగ్ పొందే అవకాశం లభించింది. పట్టుదలతో చదివి నీట్‌లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించారు. ఈ సందర్భంగా డా. మల్లికార్జున్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నారు. పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ సొసైటీ అధ్యక్షుడు తెప్ప బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ సొసైటీ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, సంఘం ప్రతినిధులు, విద్యాభిమానులు పాల్గొన్నారు. ఝాన్సీ భవిష్యత్తులో వైద్యురాలిగా ఎదిగి పేదలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

## వైద్య సీటు సాధించిన సరితకు రూ.లక్ష సాయం



**వెల్దండ సెప్టెంబర్ 25 ( జనంసాక్షి ) :** పేదరికాన్ని అధిగమించి వైద్య విద్యలో సీటు సాధించిన వెల్దండకు చెందిన నిరుపేద విద్యార్థిని గుద్దేటి సరితకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన సరితను తల్లి అలివేలు దినసరి కూలీగా పనిచేస్తూ చదివిస్తు న్నారు. వైద్య విద్య ఖర్చులు భారంగా మారిన విషయం తెలుసుకున్న రాఘవేందర్ రెడ్డి స్పందించి సాయం అందించారు. పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదని, సరిత లక్ష్యాన్ని చేరుకునే వరకు తన సహకారం కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సరిత, ఆమె తల్లి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామచంద్రయ్య, పంతుల నాయక్, శ్రీరాములు, నరేందర్ గౌడ్, పోలే వెంకటేశ్, కృష్ణ, అల్లాజీ, రామాంజనేయులు, శ్రీను నాయక్, చంద్రశేఖర్, కొండల్ యాదవ్, రమేష్ యాదవ్, రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలతో రిటైర్డ్ ఏఆర్ఎస్ఐ భార్య ఆత్మహత్య

**కరీంనగర్, క్రైమ్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరీంనగర్ రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రిటైర్డ్ ఏఆర్ఎస్ఐ కొడిముంజ శంకరయ్య (68) భార్య లింగవ్వ (61) గత పదేళ్లుగా గుండె జబ్బు, మధుమేహం, కీళ్ల నొప్పులతో బాధపడుతు న్నారు. ఇటీవల వైద్య పరీక్షల్లో గుండెలో బ్లాకులు ఉన్నట్లు తేలడంతో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో శంకరయ్య పాలు తీసుకురావడానికి బయటకు వెళ్లి 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చారు. భార్య కనిపించకపోవడంతో ఇంట్లో వెతకగా వంటగదిలోని ఇనుప పైపునకు చీరతో ఉరివేసుకుని కనిపించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఉదయం 9 గంటలకు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతిపై ఎలాంటి అనుమానం లేదని శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు.

## పేద ప్రజల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి కృషి

**స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ**
**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్**

**బొంరాస్ పేట, సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏర్పుమల్ల గ్రామ సర్పంచ్ బందెయ్యతో కలిసి ప్రభుత్వం పంపిణీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆకలి తీర్చేందుకు సన్న బియ్యం పథకం ప్రారంభించిందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్ఐ శిరీష, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, ఉపసర్పంచ్ తిరుపతయ్య, వార్డు సభ్యులు వెంకటయ్య, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు సుకన్య, కార్యదర్శి, కోశాధికారి లలిత, షైనాజ్ బేగం, వివోఏ శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజయ్య, ప్రవీణ్ కుమార్ గౌడ్, కృష్ణయ్య, సత్తయ్య, శేఖర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీని భర్తరఫ్ చేయాలి: పి. సత్యం

- ఎస్ఐఆర్‌పై ఎన్నికల సంఘం నిర్ణయాలను పునఃపరిశీలించాలి
- ఓటరు నమోదును సంక్లిష్టం చేసే నిబంధనలు తొలగించాలని డిమాండ్
- దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరిక



**కాప్రా, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం అనుసరిస్తున్న విధానాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలని సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో జి. శ్రీనివాసులు అధ్యక్షతన నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా పి. సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, ఏ. అశోక్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ విషయంలో ఎన్నికల కమిషన్‌లోని ఇతర కమిషనర్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులపై అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ వాటిని పట్టించుకోలేదని విమర్శించారు. కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం-6లో గత ఎస్ఐఆర్ జాబితాలో తల్లిదండ్రులు, తాత, నానమ్మల పేర్ల వివరాలను కోరడం వల్ల ప్రక్రియ సంక్లిష్టంగా మారిందని వారు పేర్కొన్నారు. దీనివల్ల అర్హులైన ఓటర్లు నమోదుకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని పేర్కొన్నారు.
ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఈసీపై చర్యలు తీసుకోకపోతే దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్. శ్రీనివాస్, జి. యాదగిరిరావు, శ్రీమన్నారాయణ, సీహెచ్ ప్రసాద్, పి. గణేష్, ఎం.ఎస్. రావు, కేవీ చారి, సీహెచ్ దేవిరెడ్డి, సీహెచ్ లీలావతి, ఉన్నికృష్ణ, జి.వి. రావు, శోభ, శారద, గౌసియా, శివరామకృష్ణ, ఆర్.ఎస్.ఆర్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఆకుల ఉదయ్

- నియామక పత్రం అందజేసిన అంజన్‌కుమార్
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న ఉదయ్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఆకుల ఉదయ్ నియమితులయ్యారు. ఈ మేరకు అర్బన్ డీసీసీ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ శుక్రవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, ప్రచారానికి వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు పనిచేస్తానన్నారు. నగరంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆకుల ఉదయ్ పేర్కొన్నారు.

## రచ్చబండ వినాయక లడ్డూ ప్రసాదానికి భారీ ధర

**రూ.28.11 లక్షలకు దక్కించుకున్న బండారు శ్రీనివాస్‌రెడ్డి**



చేవెళ్ల, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) చేవెళ్ల పట్టణంలోని రచ్చబండ వినాయకుడి లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలంపాటలో భారీ ధర పలికింది. చేవెళ్లకు చెందిన బండారు శ్రీనివాస్‌రెడ్డి (చెన్నారెడ్డి) రూ. 28,11,101లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేలంపాటకు భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు ఆసక్తిగా పాల్గొనడంతో వేలం పోటీ ఉత్కంఠగా సాగింది. చివరకు బండారు శ్రీనివాస్‌రెడ్డి రూ.28 లక్షల 11 వేల 101లకు లడ్డూను సొంతం చేసుకున్నారు. లడ్డూ ప్రసాదం వేలంపాటలో ఇంత భారీ మొత్తం పలకడం పట్ల నిర్వాహకులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.



## బీసీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

- పేదలు, అసైన్డ్ భూముల సమస్యలపై ప్రశ్నించాలి : తీన్మార్ మల్లన్న
- కులగణనలో 20 లక్షల బీసీలను తగ్గించారని ఆరోపణ
- బీసీ బిడ్డను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యమని వెల్లడి
- తాండూరు అభివృద్ధిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు

**తాండూరు, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** పేదల భూములు, అసైన్డ్ భూముల విషయంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. శుక్రవారం తాండూరు ఇందిరా చౌరస్తాలో నిర్వహించిన బీసీ రాజ్యాధికార యాత్ర రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీల జనాభా విషయంలో కులగణన లెక్కలు సరిగా లేవని మల్లన్న ఆరోపించారు. గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పోలిస్తే ప్రస్తుత కులగణనలో బీసీల సంఖ్య తగ్గిందని పేర్కొన్నారు. ఈ లెక్కలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులగణన పత్రాలను దహనం చేసినట్లు తెలిపారు. బీసీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు భూములు పంపిణీ చేస్తామని అన్నారు. బీసీలపై జరిగే హింసను అరికట్టి భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. బీసీలు తమ ఓటు శక్తిని గుర్తించి తమ వర్గాల నాయకులను చట్టసభలకు పంపాలని పిలుపునిచ్చారు. తాండూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని మల్లన్న విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రహదారులు, కోకట్ వంతెన, చిలుకవాగు పనులపై ప్రశ్నించారు. తాండూరు ప్రభుత్వ ఆసుపత్రి విషయంలోనూ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రవక్త జీవితం, బోధనలు మానవాళికి మార్గదర్శకం

*కరీంనగర్‌లో సీరత్ ఎక్స్‌పో ప్రారంభం*

- మతసామరస్యం, సోదరభావంపై అవగాహనకు వేదిక

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** హజ్రత్ మహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితం, బోధనలు సమస్త మానవాళికి మార్గదర్శకమని వక్తలు పేర్కొన్నారు. జమాత్-ఎ-ఇస్లామీ హింద్ కరీంనగర్ ఆధ్వర్యంలో శుక్రవారం జుమా నమాజ్ అనంతరం సర్వీస్ గ్రౌండ్‌లో సీరత్ ఎక్స్‌పోను నిర్వహించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఎక్స్‌పోను ప్రారంభించి జమాత్-ఎ-ఇస్లామీ ఏర్పాటు చేసిన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రవక్త చూపిన సత్యం, న్యాయం, శాంతి, మానవతా విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. సమాజంలో సోదరభావం, పరస్పర గౌరవం, సహనం పెంపొందించేందుకు ఆయన బోధనలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రవక్త జీవితం, సందేశాలను అన్ని వర్గాల ప్రజలకు పరిచయం చేయడమే ఎక్స్‌పో ఉద్దేశమని జమాత్-ఎ-ఇస్లామీ హింద్ కరీంనగర్ నగర బాధ్యుడు సొహైబ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఎక్స్‌పోను ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభినందించారు. మతసామరస్యం, సోదరభావం, మానవతా విలువలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందని తెలిపారు. ఎక్స్‌పోలో ప్రవక్త జీవితం, బోధనలు, మానవతా సందేశాలను వివరించే పలు అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్, మహిళా విభాగం బాధ్యులు, ఎస్ఐ, జీఐఓ విభాగాల బాధ్యులు, సభ్యులు, ముస్లిం మతపెద్దలు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎక్స్‌పో శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించాలని కోరారు.

# సమీప ఉపరితల భూభౌతిక సాంకేతికతలపై శిక్షణ

**సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐలో 10 రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభం**




**ఉప్పల్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి):** హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ)లో సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు 'సమీప ఉపరితల భూభౌతిక సాంకేతిక పద్ధతులు-వాటి అనువర్తనాలు' అంశంపై 10 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాల్గొనేవారి శాస్త్రీయ పరిజ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యం, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 22 మంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రారంభ సమావేశం సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్, సీఎస్ఐఆర్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ఇన్‌స్టిట్యూట్ చైర్ డాక్టర్ ప్రకాష్ కుమార్ సమక్షంలో జరిగింది. శాస్త్రీయ అంశాలతో పాటు భూభౌతిక శాస్త్రంలో ఆధునిక సాంకేతికతల వినియోగంపై నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు.
పాల్గొనేవారికి స్వాగతం పలుకుతూ డాక్టర్ మైనయ్య అధునాతన పరిశోధన, క్షేత్ర అనుభవం, ఆచరణాత్మక అనుభవం, వివిధ సాంకేతిక పరిజ్ఞానాలపై శిక్షణ అవసరాన్ని వివరించారు. శాస్త్రీయ జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలు, అనువర్తనాల ద్వారా భూవిజ్ఞాన రంగంలో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.
ఈ శిక్షణలో భూకంపం, భూగర్భ నిర్మాణం, భూగర్భ జలాల అన్వేషణ వంటి అంశాలతో పాటు సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐలో అభివృద్ధి చేసిన ఆధునిక భూభౌతిక సాంకేతిక పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనలు, ప్రదర్శనలు, ప్రయోగాత్మక శిక్షణతో పాటు భూభౌతిక పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నా రు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొని శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సాయంత్రం యోగా సెషన్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ నూతన ఆడిటోరియానికి నేడు భూమిపూజ

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 25 (జనం సాక్షి) :** కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ నూతన ఆడిటోరియం నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు డా. పొన్నం రవిచంద్ర, కార్యదర్శి కె. లక్ష్మి గౌతమ్ తెలిపారు. కరీంనగర్-సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని పద్మనగర్ వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అన్ని హంగులతో నూతన ఆడిటోరియం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని, వచ్చే ఏడాది గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించనున్న సందర్భంగా ఈ నూతన నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. గత 49 సంవత్సరాలుగా సమాంతర సినిమాల ప్రదర్శన, బాలల చలన చిత్రోత్సవాలు, పలు ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తూ సినీ, సాంస్కృతిక రంగాల్లో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిల్మ్ భవన్ వేదికగా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించేందుకు 'చిన్నితెర' వంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కళాకారులకు మార్గదర్శనం చేస్తూ '24 ఫ్రేమ్స్' పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నూతన ఆడిటోరియం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
భూమిపూజ కార్యక్రమానికి కపిసో సలహాదారులు, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణరావు, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఆత్మీయ అతిథిగా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశిష్ట అతిథులుగా కార్పొరేటర్లు ఎం. రాజేందర్, గడ్డి ప్రదీప్, పద్మనగర్ మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, కపిసో సలహాదారు వరాల మహేష్, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ పాల్గొననున్నారు. వినియోగ దారుల మండలి, వివిధ సాహితీ, సాంస్కృతిక సంస్థల బాధ్యులతో పాటు కవులు, రచయితలు, ఔత్సాహిక కళాకారులు, సినీ ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- చదువులతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలి
- రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**నల్గొండ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి):** విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లి మండలం దంజిలాల్ తండాలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. వంటగది, స్టోర్‌రూమ్, పరిసరాలను పరిశీలించడంతోపాటు విద్యార్థులకు అందిస్తున్న భోజనం, కూరగాయలు, వంటనూనె, పండ్లు, గుడ్ల నాణ్యతను పరిశీలించారు.
పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను తెలుసుకున్నారు. వాష్‌రూమ్‌లు, కాంపౌండ్ వాల్, బోరు అవసరమని విద్యార్థులు తెలపగా.. సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అక్టోబర్ 2న గ్రామసభలో తీర్మానం చేసి వీబీజీ రాంజీ నిధులతో పనులకు శంకుస్థాపన చేయించేలా చర్యలు తీసుకుంటామని, బోరు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సూచించినట్లు తరగతి గదిలోనే భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, క్రమశిక్షణతో చదివి ఐఏఎస్, ఇంజనీర్, డాక్టర్, న్యాయవాది తదితర రంగాల్లో రాణించాలని సూచించారు. కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ప్రభుత్వం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నందున విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్‌రెడ్డి, దేవరకొండ సబ్‌కలెక్టర్ కరోలిన్ చింగ్ తియాన్ మావి, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఆర్‌సీఓ శ్రీనివాసరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప యోధురాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ధీర వనిత చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో స్ఫూర్తిదాయకమైన అధ్యాయంగా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, పట్టుదల, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజంలో మహిళా సాధికారతకు, సామాజిక చైతన్యానికి చాకలి ఐలమ్మ చేసిన కృషి విశిష్టమైనదని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

## ఆరోగ్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకం

- మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఫార్మసిస్టులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వైద్యులు, నర్సులతో పాటు ఫార్మసిస్టులు ఆరోగ్య రంగంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని మంత్రి వెల్లడించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన మందులు అందించడంలో, సరైన మోతాదులో మందుల వినియోగంపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. 2026 సంవత్సరానికి గాను 'ఫార్మసిస్టులు - ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసే భాగస్వాములు" అనే థీమ్‌తో అంతర్జాతీయ ఫార్మసిస్టుల సమాఖ్య (ఎఫ్ఐపీ) ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం అత్యంత సముచితమని మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫార్మసీ వృత్తిని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. నాణ్యమైన మందుల లభ్యతను మెరుగుపరచడానికి, ఫార్మసీ విద్యను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం లో భాగంగా ఆసుపత్రుల్లో, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల లోని మెడికల్ స్టోర్లలో ఫార్మసిస్టుల నియామకాలను దశల వారిగా భర్తీ చేస్తున్నామన్నారు. ఫార్మసిస్టులకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దామోదర్ రాజనర్సింహా వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టులు చూపిన అంకితభావం, సేవా తత్పరత చిరస్మరణీయమన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ ఫార్మసి ఆఫీసర్స్ భాగస్వామ్యం మరింత విస్తృతం కావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆకాంక్షించారు. వారి వృత్తి జీవితం మరింత విజయవంతం కావాలని మంత్రి కోరుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని తన నివాసంలో మంత్రి దామోదర్ రాజనర్సింహా ఫార్మసిస్టులతో కలసి కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## బ్యాంకు ఖాతాదారులకు ఊరట..
# ఆదివారం సేవలు

- సెప్టెంబర్ 28-30 సమ్మె నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- దేశవ్యాప్తంగా ప్రభుత్వ, గ్రామీణ బ్యాంకుల కార్యకలాపాలు
- అత్యవసర లావాదేవీలకు అవకాశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బ్యాంకు సమ్మె నేపథ్యంలో ఖాతాదారుల సౌకర్యార్థం ఈ నెల 27న ఆదివారం ప్రభుత్వ రంగ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణ పనిదినంలా పనిచేస్తాయని మేడ్చల్ జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) సి.శివప్రసాద్ తెలిపారు. ఆర్‌బీఐ ప్రత్యేక అనుమతితో దేశవ్యాప్తంగా బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎంలకు అనుసంధానమైన శాఖలు ఆదివారం తెరిచి ఉంటాయని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాతాదారుల అత్యవసర అవసరాల కోసం నగదు జమ, ఉపసంహరణ, చెక్కుల క్లియరెన్స్ తదితర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమ్మె సమయంలో ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా ఈ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అత్యవసర బ్యాంకింగ్ లావాదేవీలు ఉన్న ఖాతాదారులు ఆదివారం అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని సి.శివప్రసాద్ సూచించారు.

## జంతు ప్రేమికుల నిధులు ఏమౌతున్నాయి?

- సినీ నటి రష్మీ గౌతం



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ప్రముఖ యాంకర్, నటి రష్మి గౌతమ్ మరోసారి తన జంతుప్రేమను చాటుకున్నారు. మూగజీవాల సంక్షేమం విషయంలో ప్రభుత్వాలు, అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతు సంక్షేమం కోసం కేటాయించిన నిధులు ఎక్కడికి పోతున్నాయంటూ సోషల్ మీడియా వేదికగా సూటి ప్రశ్నలు సంధించారు. తనను వ్యక్తిగతంగా దూషించినా, విమర్శించినా తాను పట్టించుకోనని, కానీ అసలు సమస్యను మాత్రం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ మేరకు రష్మి పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. "నన్ను తిట్టండి, అవమానించండి, సిగ్గుపడేలా మాట్లాడండి.. నేను అస్సలు పట్టించుకోను. కానీ, మీరు అధికారులను ప్రశ్నించడం ఎప్పుడు మొదలుపెడతారు? అసలు ప్రశ్న ఒక్కటే.. ఆ డబ్బు ఎక్కడికి పోతోంది?" అంటూ ఆమె తన పోస్ట్‌ను ప్రారంభించారు. దేశంలో జంతు సంరక్షణ శాలలు (యానిమల్ షెల్టర్లు) ఎందుకు అంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పశువైద్యశాలల్లో సరైన పరికరాలు, సౌకర్యాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. వీధి కుక్కలు, పిల్లులకు వ్యాక్సినేషన్, సంతాన నియంత్రణ ఆపరేషన్లు ఎందుకు జరగడం లేదని నిలదీశారు. అలాగే, ఆవులు, గేదెల యజమానులకు సరైన మార్గదర్శకాలు ఎందుకు ఇవ్వడం లేదని, వన్యప్రాణులు జనావాసాల్లోకి ఎందుకు వస్తున్నాయని ఆమె వరుస ప్రశ్నలు సంధించారు."ఇలాగే కొనసాగితే భవిష్యత్ తరాలకు పచ్చదనం అనేది మిగులుతుందా? నా పేజీలో కీబోర్డ్ వారియర్‌లా పోరాడితే మీకు ఎలాంటి ప్రయోజనం ఉండదు, కనీసం నా దృష్టిని కూడా ఆకర్షించలేరు. మీ సమయాన్ని, శక్తిని సరైన మార్గంలో ఉపయోగించి వ్యవస్థను ప్రశ్నించండి" అని రష్మి హితవు పలికారు. కేవలం ఆన్‌లైన్‌లో వాదించుకోవడం మానేసి, మార్పు కోసం అధికారులను నిలదీయాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. జంతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై రష్మి చేసిన ఈ వ్యాఖ్యలకు నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది.

## తూప్రాన్‌లో మావోయిస్టు లేఖ కలకలం

- ఇద్దరు అరెస్ట్

**మెదక్ సెప్టెంబర్ 25 :** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయం ముందు ఎర్రబట్టపై మావోయిస్టు హెచ్చరికలు రాసినా కేసులో తూప్రాన్ మండలానికి చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గత 16వ తేదీన మేడారం సమ్మక్క-సారక్క దేవాలయంలో రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అక్కడ కూడా మావోయిస్టు హెచ్చరికలతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ నుంచి స్పందన రాకపోవడంతో తిరిగి తూప్రాన్ పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయానికి ఎర్ర ఎర్రబట్టపై హెచ్చరికల కరపత్రాన్ని నిందితులు కట్టారని ఎస్పీ తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సోషల్ మీడియా, వ్యూస్ కోసం డబ్బు సంపాదనే ధ్యేయంగా మావోయిస్టు పేరును వాడుకోవడానికి తూప్రాన్ మండలం నాగులపల్లికి చెందిన మధు, చింతకింది శ్రీధర్ పథకం వేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారంకోర్టులో హాజరు పరిచామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేంద్ర గౌడ్, ఎస్సై గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## 450 నుంచి 39 లక్షల వరకు
# బాలాపూర్ లడ్డూ...




**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ గణేశుడి లడ్డూ ప్రసాదం వేలంలో మరో కొత్త రికార్డు నమోదైంది. ఈ ఏడాది జరిగిన వేలం పాటలో రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది. వనస్థలిపురం సాహెబ్ నగర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, అర్బన్ గ్రూప్ అధినేత సామ ప్రణీత్ రెడ్డి ఈ పవిత్ర లడ్డూ ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. స్వామివారి లడ్డూను దక్కించుకోవడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.గతేడాది (2025 వేలంలో) బాలాపూర్ లడ్డూ రూ.35 లక్షల ధర పలకగా, ఈసారి అంతకంటే రూ.4 లక్షలు అధికంగా పలికి సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఈ వేలం పాటలో పాల్గొనేందుకు భక్తులు మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గతంలో బాలాపూర్ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న 32 మంది విజేతలతో పాటు, ఈసారి కొత్తగా 8 మంది భక్తులు వేలంలో పాల్గొనడంతో వేలం పాట హోరాహోరీగా సాగింది. చివరికి సామ ప్రణీత్ రెడ్డి 39 లక్షల ధర పాడి బాలాపూర్ గణేషుడి లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. 1994లో తొలిసారి బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం నిర్వహించారు. అప్పుడు కేవలం రూ. 450కి కొలను మోహన్ రెడ్డి అనే భక్తుడు బాలాపూర్ లడ్డూ దక్కించుకున్నారు. ఈ 32 ఏళ్లలో డిమాండ్ చాలా పెరిగింది. ఈ క్రమంలో 2026లో నిర్వహించిన వేలంలో ఏకంగా రూ.39 లక్షలకు సామ ప్రణీత్ రెడ్డి భక్తుడు బాలాపూర్ లడ్డూ దక్కించుకున్నారు

## నిమజ్జనంపై మంత్రి పొన్నం ఏరియల్ పరిశీలన



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నగరంలో అత్యంత వైభవంగా సాగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర సరళిని, భద్రతా ఏర్పాట్లను నగర ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. శుక్రవారం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో బయలుదేరిన వీరు.. హుస్సేన్సాగర్ పరిసరాలతో పాటు నగరంలోని ప్రధాన ఊరేగింపు మార్గాలను, భక్తుల రద్దీని, ట్రాఫిక్ సరళిని వీక్షించారు. ఈ ఏరియల్ సర్వేలో మంత్రి తో పాటు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా పాల్గొన్నారు.




## పట్టా హక్కుల కోసం
## 92 రోజులుగా ఆందోళన..

- మంత్రి శ్రీధర్ బాబును మరోసారి కలిసిన హక్కుదారులు
- 92వ రోజుకు చేరిన హిమాయత్‌నగర్ పట్టా హక్కుదారుల ధర్నా

**మొయినాబాద్ (జనంసాక్షి) :** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ సర్వే నంబర్ 151లో 60 గజాల పట్టా హక్కుదారుల సమస్య పరిష్కారం కోసం కొనసాగుతున్న ధర్నా శుక్రవారంతో 92వ రోజుకు చేరుకుంది. ఇన్ని రోజులుగా హక్కుదారులు తమ న్యాయమైన సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్, టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో 60 గజాల పట్టా హక్కుదారులు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబును కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా హక్కుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, తమ పట్టా హక్కులకు సంబంధించిన సమస్యలను మంత్రికి వివరించి, తక్షణమే సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. హక్కుదారుల సమస్యలను మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా విని, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించాలని సూచించారు. 92 రోజులుగా కొనసాగుతున్న తమ ఆందోళనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని 60 గజాల పట్టా హక్కుదారులు కోరుతున్నారు.

## గాంధీ జయంతి నుంచి ఆందోళన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 25 (జనంసాక్షి) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. శనివారం లోగా ఆయన రాజీనామా చేయకపోతే గాంధీ జయంతి అయిన అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త నిరసనలు చేపడతామని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. జ్ఞానేశ్ కుమార్ తప్పుకోకపోతే తమ ఆందోళనను దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు.భిజీత్ దీప్కే 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "రేపటిలోగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, సీజేపీ తన దేశవ్యాప్త నిరసనను అక్టోబర్ 2న ముంబైలో ప్రారంభించి, భారతదేశంలోని ఇతర నగరాలకు కూడా తీసుకువెళుతుంది. ఈ గాంధీ జయంతి నాడు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రతిజ్ఞ చేద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో దీప్కే మాట్లాడుతూ.. జ్ఞానేశ్ కుమార్‌ను ఈ దేశానికి అతిపెద్ద ద్రోహిగా, దేశ వ్యతిరేకిగా అభివర్ణించారు. "ఎన్నికల సంఘంపై వచ్చిన ఒక నివేదిక ప్రకారం జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారు. మన దేశంలో ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యం. కానీ, జ్ఞానేశ్ కుమార్ సీఈసీ అయినప్పటి నుంచి, ఎవరు ఓటు వేయాలో, ఎవరు వేయకూడదో ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. ఇది ప్రజాస్వామ్యం కాదు, నిరంకుశత్వం. దీనికి ప్రధాన కారకుడు జ్ఞానేశ్ కుమార్" అని దీప్కే తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన 48 గంటల్లో పదవి నుంచి దిగిపోవాలని అల్టిమేటం జారీ చేశారు. ఎస్ఐఆర్, ఓటర్ డేటా యాక్సెస్, కొత్త ఓటర్ల నమోదు వంటి కీలక అంశాలపై ఎన్నికల సంఘంలోనే విభేదాలు తలెత్తాయని వస్తున్న వార్తల నేపథ్యంలో సీజేపీ ఈ ఆరోపణలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే సమావేశంలో పార్టీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. ప్రస్తుత వ్యవస్థ దేశాన్ని ఒక పెద్ద ప్రహసనంగా మార్చేసిందని విమర్శించారు. "ఈ వ్యవస్థ అవినీతిమ యమైంది, విఫలమైంది. దేశంలోని యువత మార్పును కోరుకుంటోంది. ప్రాథమిక మార్పులు అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు


## వివాహేతర సంబంధం పంచాయితీ..

### పోలీస్‌స్టేషన్‌లోనే దాడులు

**భద్రాద్రి కొత్తగూడెం (జనంసాక్షి) :** కొత్తగూడెంలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లోనే ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. వివాహేతర సంబంధం వ్యవహారంలో వివాదం మొదలయింది. తొలుత మాటల యుద్ధం జరిగింది. ఆపై ముదిరి పరస్పర దాడులకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ పీఎస్లోకి ఇరువర్గాలు దూసుకెళ్లాయి. స్టేషన్లోనూ రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. త్రీ టౌన్ పోలీసులు అధికశాతం వినాయక నిమజ్జనం బందోబస్తు విధుల్లో వున్నారు. స్టేషన్ లో సిబ్బంది తక్కువగా ఉండటంతో అక్కడే హల్చల్ చేసుకున్నారు. పదుల సంఖ్యలో ఇరువర్గాలు పీఎస్కు చేరుకున్నాయి. అప్రమత్తమైన నైట్ డ్యూటీ కానిస్టేబుళ్లు.. ఇరువర్గాలను చెదరగొట్టారు. ఘర్షణకు పాల్పడిన కొంతమందిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.


## అత్తాపూర్ గణేష్ లడ్డూ కోసం పోటాపోటీ..

- లడ్డూకు ఈ సారి రికార్డు ధర.. రూ.13.21 లక్షలకు సొంతం



**హైదరాబాద్ (జనం సాక్షి) :** అత్తాపూర్‌లో గణేష్ లడ్డూ వేలం హోరాహోరీగా సాగింది. పురాతన పోచమ్మ ఆలయం వద్ద నవశక్తి భక్త సమాజ్ ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో.. 11 రోజుల పాటు పూజలు అందుకున్న లడ్డూను వేలం వేశారు. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు దాదాపు 50 మంది పోటీపడ్డారు. చివరి వరకు ఉత్కంఠగా సాగిన వేలంలో గుమ్మడి బ్రదర్స్‌కు చెందిన భూపాల్ రెడ్డి రూ.13 లక్షల 21 వేల రికార్డు ధరకు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది వేలం ధరతో పోలిస్తే ఈసారి రూ.70 వేల అధిక ధర పలికింది. దీంతో అత్తాపూర్‌లో ఇప్పటివరకు లడ్డూ ప్రసాదానికి పలికిన అత్యధిక ధరగా ఈ వేలం నిలిచింది. నవశక్తి భక్త సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాల్లో ప్రతిరోజూ భజనలు, కీర్తనలు, హారతులు, గణపతి హోమం, అన్నదానం, ముగ్గుల పోటీలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. చిన్నారులు, యువతకు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. ఈ రోజు గణేష్ నిమజ్జనం ఘనంగా శోభాయాత్ర నిర్వహించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## గణేష్ నిమజ్జనాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** శుక్రవారం నాడు గణేష్ నిమజ్జనాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. నిమజ్జన ఘాట్ వద్ద ఖైరతాబాద్ మహాగణపతికి ప్రత్యేక పూజలు చేసారు. నిమజ్జనానికి ముందు జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తో పాటు అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్యరు కూడా ప్రత్యేక నిమజ్జన పూజల్లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ మార్గంలోని హైడ్రా కంట్రోల్ రూమ్ వేదిక నుంచి నిమజ్జనాన్ని అయన పరిశీలించారు. తరువాత హైడ్రా బోట్స్ పహారాను పరిశీలించారు. నిమజ్జనం పూర్తయ్యేవరకు అన్ని శాఖలతో హైడ్రా అధికారులు, సిబ్బంది సమన్వ యంగా పని చేయాలని సూచించారు. అయనతో పాటు ఆర్ఎఫ్ వో జయప్రకాష్ ఎస్ఎఫ్ వో చంద్రశేఖర్ బాబు ఉన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370